

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## అల్లర్ల బాధ్యులపై కఠిన చర్యలు

- వైసీపీ దౌర్జన్యాలను ఉపేక్షించేది లేదు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా స్పష్టీకరణ
- టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని పిలుపు

- వివరాలు 6 లో..



విజయవాడ కనకదుర్గ అమ్మవారిని సీఎం చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జై దుర్గా భవానీ!

దసరా నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని సతీ సమేతంగా దర్శించుకున్నాను. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మకు ప్రభుత్వం తరపున చీర, సారె సమర్పించాను. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నాను. నేటి దర్శన సమయంలో నాకు కలిగిన అనుభవం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అటు అమ్మవారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగిస్తే... భక్తుల ఉత్సాహం, సానుకూల స్పందన నాకు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. దర్శనాలు, సేవలపట్ల భక్తుల్లో ఎంతో సంతృప్తి కనిపించింది.

– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

# దుర్గమ్మకు చీర, సారె సమర్పణ

- భక్తి శ్రద్ధలతో సమర్పించిన చంద్రబాబు దంపతులు
- ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారికి ప్రార్థన
- రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
- పట్టు వస్త్రాల సమర్పణ సమయంలోనూ సామాన్యులకు దర్శనాలు

2

## ప్రజామోదమే ప్రామాణికంగా..

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో ప్రజామోదమే ఎంపికకు ప్రామాణికమని పార్టీ స్పష్టం చేసింది. యువత, మహిళలు, బీసీలకు పెద్దపీట వేస్తూ విద్యావంతులు, సేవా దృక్పథం కలిగినవారికి అవకాశాలు కల్పించింది. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారి సేవలకు గుర్తింపునిస్తూ భవిష్యత్ నాయకత్వానికి బాటలు వేసింది. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ల ప్రత్యక్ష ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమగ్ర కసరత్తు అనంతరం అభ్యర్థులను ఖరారు చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణ పాలనను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా టీడీపీ ఈ ఎంపికలకు శ్రీకారం చుట్టింది.



5

## ప్రతి రక్తదాతా.. జీవదాతే

- పేదల జీవితాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ భరోసా
- ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి
- విజయవాడ ప్రజలకు రక్తనిధి కేంద్రం అంకితం
- 29 ఏళ్లుగా ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, జీవనోపాధి రంగాల్లో ట్రస్ట్ సేవలు

3





7

## మిథున్‌రెడ్డి బరితెగింపు.. తిరగబడ్డ పుంగనూరు!

- బెంగళూరు రౌడీలతో కాన్వాయ్‌గా నామినేషన్ కేంద్రానికి
- జనాన్ని తొక్కుకుంటూ దురుసుగా కార్లు నడిపిన రౌడీమూకలు
- ఇదేమని అడిగితే టీడీపీ శ్రేణులపై రాడ్లు, కత్తులతో దాడి
- ఎదురుదాడితో వాహనాలను తరిమికొట్టిన పుంగనూరు జనం
- దాడులకు పూర్తి బాధ్యత మిథున్‌రెడ్డిదేనని పోలీసుల వెల్లడి

## పుంగనూరులో హింసే పెద్దిరెడ్డి అజెండా



- స్థానిక ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదనే విధ్వంసానికి కుట్ర
- బెంగళూరులో కూర్చుని అల్లర్లకు జగన్, పెద్దిరెడ్డి పథకరచన
- పుంగనూరులో ఏళ్ల తరబడి పెద్దిరెడ్డి అరాచకాలకు అంతేలేదు
- 30 ఏళ్లుగా కోల్పోయిన స్వేచ్ఛ కోసం తిరగబడ్డ స్థానికులు
- ఫ్యాక్షన్ రాజకీయాలకు ఇక చోటులేదు
- చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు
- టీడీపీ నేత గురజాల మాల్యాద్రి

8

తమిళనాడు, కర్నాటక రౌడీలతో..

## ఎంపీ మిథున్ రెడ్డి అల్లర్లు



- ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆధ్వర్యంలో ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- వైసీపీ విధ్వంసాన్ని వివరించి, దాడి వీడియోలు అందచేత
- ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని ఆగ్రహం

6

# దుర్గమ్మకు చీర, సారె సమర్పణ

- భక్తి శ్రద్ధలతో సమర్పించిన చంద్రబాబు దంపతులు
- ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారికి ప్రార్థన
- రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
- పట్టు వస్త్రాల సమర్పణ సమయంలోనూ సామాన్యులకు దర్శనాలు





విజయవాడ (చైతన్య రథం): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్టు సీఎం తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం సీఎం పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించారు. పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు సీఎం దంపతులకు వేదాశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

## 6 రోజుల్లో 8 లక్షలమంది భక్తుల దర్శనం

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు. ప్రభుత్వం తరఫున కుటుంబ సమేతంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షలమంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.













# ప్రతి రక్తదాతా.. జీవదాతే




- **పేదల జీవితాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ భరోసా**
- **ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి**
- **విజయవాడ ప్రజలకు రక్తనిధి కేంద్రం అంకితం**
- **29 ఏళ్లుగా ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, జీవనోపాధి రంగాల్లో ట్రస్ట్ సేవలు**

విజయవాడ (చైతన్య రథం): "ఆపద సమయంలో రక్తదానం ఎంతో కీలకం. ప్రతి రక్తదాతా జీవదాతే" అని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. శుక్రవారం విజయవాడలో ట్రస్ట్ రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్నవారంతా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం కేవలం దానం కాదని, మరో మనిషి జీవితానికి ఇచ్చే భరోసా అని పేర్కొన్నారు.

చికిత్స సమయంలో రక్తం అవసరమైన కుటుంబం పడే ఆందోళన తమకు తెలుసని భువనేశ్వరి చెప్పారు. విజయవాడ ప్రజలకు సేవ, నమ్మకం, భరోసాకు చిరునామాగా ట్రస్ట్ నిలుస్తుందన్నారు. ఈ బ్లడ్ సెంటర్‌ను విజయవాడ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది కేవలం భవనం కాదని, పేద రోగుల జీవితాలకు వారధి అని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ ముఖ్యమైన కూడలి కావడంతో ఇక్కడ ఆధునిక బ్లడ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలో ఇప్పటికే రక్తనిధి కేంద్రాలు పనిచేస్తున్నాయని ఆమె గుర్తుచేశారు. అనంతపురంలో నెల రోజుల్లో రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించాలని ఆలోచన చేసినట్టు చెప్పారు. తలసేమియాతో బాధపడే పిల్లలకు రక్తం నిరంతరం అవసరమని, వారి కుటుంబాల ఆందోళనను అర్థం చేసుకుని తలసేమియా సెంటర్ ద్వారా ఉచిత రక్త మార్పిడి, ఫిల్టర్లు, ఔషధాలు అందిస్తున్నామని భువనేశ్వరి వివరించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తలసేమియా కేర్ సెంటర్ విజయవాడలో త్వరలోనే ప్రారంభమవుతుందని తెలిపారు.

### ఎన్టీఆర్ ఆశయాలే స్ఫూర్తి

దివంగత ఎన్టీఆర్‌కు ప్రజలంటే అపారమైన ప్రేమ అని, ప్రజల కోసం పనిచేయడం ఆయన జీవితంలో భాగమని భువనేశ్వరి అన్నారు. సామాన్యుల గురించి నిరంతరం తపనపడే ఎన్టీఆర్, చిట్టచివరి వ్యక్తికి కూడా జీవన ప్రమాణాలు పెరగాలని కోరుకున్నారని గుర్తు చేశారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లే సంకల్పంతోనే చంద్రబాబు ట్రస్ట్‌ను స్థాపించారని తెలిపారు. 29 ఏళ్లుగా ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, జీవనోపాధి, స్వచ్ఛమైన తాగునీరువంటి రంగాల్లో ట్రస్ట్ పనిచేస్తోందన్నారు. ఇంత చేసినా చేయాల్సింది చాలా ఉందని నమ్ముతున్నట్టు చెప్పారు. ఈ సేవలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. "ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఏ ఒక్కరిదీ కాదు, సేవ చేసే మనసున్న ప్రతి ఒక్కరిదీ"అని పేర్కొన్నారు. మేనేజింగ్ ట్రస్టీగా ఈ సేవలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భువనేశ్వరి పేర్కొన్నారు.

### సేవల విస్తృతి

సంజీవని మొబైల్ క్లినిక్‌ల ద్వారా ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు తీసుకెళ్తున్నామని, గిరిజన ప్రాంతాల వంటి మారుమూల ప్రాంతాల్లో మందులు, వైద్యం ఉచితంగా అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఎన్టీఆర్ సుజల ద్వారా అనేక ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేసి తాగు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఎంతమందికి సేవలు అందించామన్నది అంకెల్లో కాదని, ప్రజల జీవితాల్లో మార్పు రావడమే ముఖ్యమని వ్యాఖ్యానించారు.

విద్యారంగంలోనూ ట్రస్ట్ అడుగులు వేస్తోందని, పేద విద్యార్థులను భవిష్యత్ తరానికి అవసరమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మహిళల సాధికారత కోసం శిక్షణ ఇవ్వడమే కాకుండా, కుటుంబానికి అండగా నిలవగలమన్న ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నామన్నారు. స్త్రీశక్తి హస్తకళా స్టోర్ ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తున్నామని తెలిపారు. వరదలు, తుపాన్లు, కోవిడ్ సమయాల్లోనూ ట్రస్ట్ విస్తృతంగా సేవలందించిందని భువనేశ్వరి గుర్తుచేశారు. "కష్టకాలంలో మనిషి మరో మనిషికి అండగా ఉండాలన్నదే మా ఆలోచన" అని భువనేశ్వరి పేర్కొన్నారు.




## ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మ

**- ఎన్టీఆర్ ట్రస్ట్ రక్తనిధి కేంద్రానికి సీఎం చంద్రబాబు అభినందనలు**



విజయవాడ (చైతన్య రథం): "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం పునర్జన్మనిస్తుందని పేర్కొన్నారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదన్న సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి, ఆమె బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తలసేమియా చిన్నారులకు ఉచితంగా రక్తం అందించడం గొప్ప మానవీయ సేవగా వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత సహా అనేక రంగాల్లో సేవలందిస్తున్న ట్రస్ట్ మరింత మందికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. సంజీవని మొబైల్ క్లినిక్స్ ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలను చేరువ చేయడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుకు సాగాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

## పిల్లలకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని కోరుకుంటూ..



అమరావతి (చైతన్య రథం): చదువుల తల్లి సరస్వతీ దేవి రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని విద్యా మంత్రి నారా లోకేష్ అమ్మవారిని కోరుకున్నారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున బెజవాడ కనకదుర్గమ్మ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. చదువుల తల్లి సరస్వతీదేవి రూపంలో పిల్లలకు విద్యాబుద్ధులు, విజ్ఞానం ప్రసాదించాలని అమ్మవారిని వేడుకుంటున్నాను" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## గొల్లపల్లి జలాశయంలో మునిగి ఐదుగురు మహిళల మృతిపై సీఎం దిగ్భ్రాంతి

అమరావతి (చైతన్య రథం): సత్యసాయి జిల్లాలో ఐదుగురు మహిళల మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గొల్లపల్లి జలాశయంలో మునిగి పుష్పలత, గాయత్రమ్మ, అశ్విని, షేక్ హసీనా, అత్తర్ మాహీ అనే ఐదుగురు మహిళలు మృత్యువాత పడటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఘటన వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌ను చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడిపోయారని, మత్స్యకారులు గుర్తించి మృతులను బయటకు తీశారని అధికారులు సీఎంకు వివరించారు. మృతులంతా పెనుకొండ మండలం దుర్గాపేట వాసులు అని తెలిపారు.

### మంత్రి లోకేష్ విచారం

సత్యసాయి జిల్లా గొల్లపల్లి జలాశయం వద్దకు విహారయాత్రకు వెళ్లి ఐదుగురు మహిళలు మృత్యువాత పడటం చాలా బాధాకరమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. మృతులకు నివాళులర్పిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి లోకేష్ ఎక్స్ పోస్టులో హామీ ఇచ్చారు.

# పేదలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

## విజయవాడలో తలసేమియా కేర్ సెంటర్, రక్తనిధి కేంద్రం ప్రారంభం



విజయవాడ (చైతన్య రథం): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా కేర్ సెంటర్, రక్తనిధి కేంద్రం విజయవాడలో ప్రారంభమయ్యాయి. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి వీటిని ప్రారంభించారు. విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ట్రస్ట్ ప్రారంభమైన మరుసటి ఏడాది నుంచే ప్రజలకు వైద్యారోగ్య సేవలను అందిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల్లో పేదలకు వైద్యం అందించేందుకు ఎన్టీఆర్ ఆరోగ్య రథాలతో మొబైల్ క్లినిక్స్ నిర్వహిస్తోంది. ట్రస్ట్ ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలలో బ్లడ్ సెంటర్లు నడుపుతోంది. తాజాగా విజయవాడలోనూ రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించడంతో వీటి సంఖ్య ఐదుకు చేరింది. తలసేమియా లోపమున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించే కార్యక్రమాన్ని ట్రస్ట్ గత ఏడాదే ప్రారంభించింది.

ఇప్పుడు విజయవాడలోనూ తలసేమియా కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. అవసరమైనచోట్ల రాష్ట్రవ్యాప్తంగా తలసేమియా కేర్ సెంటర్లు, రక్తనిధి కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామని భువనేశ్వరి ఇటీవల ప్రకటించారు. రోగులకు సకాలంలో చికిత్స, ప్రాణాధారమైన రక్తం సులభంగా అందేలా చూడటమే దీని ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.
















చైతన్యరథం

## ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం..

# సామాజిక న్యాయానికి పట్టం

- పట్టణ స్థానిక ఎన్నికలకు టీడీపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల
- యువత, మహిళలు, బీసీలకు పెద్దపీట
- అభ్యర్థుల ఎంపికపై చంద్రబాబు కసరత్తు
- భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేస్తూ విద్య, సేవా దృక్పథం, పార్టీ కోసం కృషి చేసిన వారికి ప్రాధాన్యం

అమరావతి (చైతన్య రథం): ప్రజాభిప్రాయమే ప్రాతిపదికగా, సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను తెలుగుదేశం పార్టీ విడుదల చేసింది. ప్రజల విశ్వాసం, సమర్థ నాయకత్వం, సేవా దృక్పథాన్ని అభ్యర్థుల ఎంపికలో కీలకంగా పరిగణించింది. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్‌పర్సన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతుండడంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభ్యర్థుల ఎంపికపై విస్తృత కసరత్తు చేశారు. ఆయా పట్టణాలు, నగరాలకు సమర్థంగా నాయకత్వం వహించగల వారిని గుర్తించేందుకు అన్ని అంశాలను నిశితంగా పరిశీలించారు. యువత, మహిళలు, బీసీలకు పెద్దపీట వేయడంతోపాటు విద్యావంతులు, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యమిచ్చారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారి కృషికి గుర్తింపునిస్తూ అవకాశాలు కల్పించారు. అలాగే స్థానిక ప్రజల అభిప్రాయాలను ఎంపికకు ప్రాతిపదికగా తీసుకున్నారు. ప్రతి దశలోనూ సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ అభ్యర్థులపై సమగ్ర పరిశీలన జరిపారు. భవిష్యత్ నాయకత్వాన్ని బలోపేతం చేసేలా... పట్టణ పాలనను మరింత పటిష్ఠం చేసేలా సమర్థత, నిబద్ధత, ప్రజామోదం కలిగిన నాయకులను ముందుకు తీసుకురావాలన్న పార్టీ సంకల్పానికి ఈ తొలి జాబితా అద్దం పడుతోంది.

### 36 స్థానాల్లో 22 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు..19మంది మహిళలకు అవకాశం

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాజిక న్యాయం, మహిళా సాధికారత, యువ నాయకత్వానికి ప్రాధాన్యమిస్తూ తెలుగుదేశం పార్టీ తొలి జాబితాను ప్రకటించింది. ఏడు కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీల్లో మేయర్, ఛైర్‌పర్సన్ స్థానాలకు సంబంధించి ప్రకటించిన 36మంది అభ్యర్థుల్లో 22 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. అంటే మొత్తం జాబితాలో 61 శాతం ఈ వర్గాలకే అవకాశం దక్కింది. బీసీలకు ఏకంగా 16 స్థానాలు కేటాయించగా, ముగ్గురు ఎస్సీలు, ఒక ఎస్టీ అభ్యర్థికి చోటు కల్పించారు. ఆళ్లగడ్డ, రాయచోటిలో ఇద్దరు మైనారిటీ అభ్యర్థులను ఎంపిక చేశారు.

### విద్యావంతులకు ప్రాధాన్యం

అభ్యర్థుల విద్యార్హతలకూ పార్టీ ప్రాధాన్యమిచ్చింది. వివరాలు అందుబాటులో ఉన్న 33మంది అభ్యర్థుల్లో 25మంది డిగ్రీ లేదా అంతకంటే ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నారు. వీరిలో ఏడుగురు పీజీ పట్టభద్రులు కాగా, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఏ వంటి ఉన్నత విద్యార్హతలు కలిగినవారితోపాటు ముగ్గురు వైద్యులున్నారు. పట్టణ పాలనలో విద్య, పరిజ్ఞానం, పరిపాలనా సామర్థ్యాలకు ప్రాధాన్యమివ్వాలన్న పార్టీ ఆలోచనను ఈ ఎంపికలు ప్రతిబింబిస్తున్నాయి.

### యువ నాయకత్వానికి ప్రోత్సాహం

కొత్తతరం నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడంపైనా టీడీపీ దృష్టి సారించింది. 36మంది అభ్యర్థుల సగటు వయస్సు 45.7 సంవత్సరాలుగా ఉంది. వీరిలో 16 మంది 45 ఏళ్లలోపు వారు కాగా, 10 మంది 40 ఏళ్లలోపు వారున్నారు. ఏడుగురు మేయర్ అభ్యర్థుల సగటు వయస్సు 39 సంవత్సరాలుగా ఉంది. ఛైర్‌పర్సన్ అభ్యర్థుల సగటు వయస్సు 47.5 సంవత్సరాలు. వీరితో పోలిస్తే మేయర్ అభ్యర్థుల సగటు వయస్సు సుమారు తొమ్మిదేళ్లు తక్కువగా ఉండటం యువ నాయకత్వానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని సూచిస్తోంది. రాజంపేట అభ్యర్థి డాక్టర్ దొంతం గాయత్రి 26 ఏళ్ల వయస్సుతో అత్యంత పిన్నవయస్కురాలిగా నిలిచారు. విజయనగరం అభ్యర్థి 31 ఏళ్లు, జీవీఎంసీ అభ్యర్థి 32 ఏళ్ల వయస్సుతో యువ అభ్యర్థుల జాబితాలో ఉన్నారు.

### మహిళలకు 53 శాతం అవకాశాలు

మహిళా ప్రాతినిధ్యంలోనూ టీడీపీ ముందడుగు వేసింది. మొత్తం 36మంది అభ్యర్థుల్లో 19మంది మహిళలే ఉండటం విశేషం. అంటే జాబితాలో మహిళల వాటా 53 శాతంగా ఉంది. మహిళలకు రిజర్వు చేసిన 17 స్థానాలకు మించి మరో రెండు స్థానాల్లోనూ మహిళలకు అవకాశం కల్పించింది. మహిళలకు ప్రత్యేకంగా రిజర్వు కాని చిత్తూరు కార్పొరేషన్, బద్వేలు స్థానాల్లోనూ మహిళా అభ్యర్థులను ఎంపిక చేసింది. సామాజిక సమతుల్యతతోపాటు మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, విద్యావంతులకు ప్రాధాన్యం కల్పించేలా తొలి జాబితాను రూపొందించడం ద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో సమర్థ నాయకత్వాన్ని అందించాలన్న లక్ష్యాన్ని టీడీపీ ముందుకు తీసుకెళ్లింది.

### మున్సిపల్ ఎన్నికలు 2026 — ఖరారైన అభ్యర్థులు

#### మున్సిపల్ కార్పొరేషన్లు (7)

| క్ర.సం | పట్టణ సంస్థ | అభ్యర్థి పేరు |
|---|---|---|
| 1 | చిత్తూరు | కటారి హేమలత |
| 2 | కడప | డా. నెల్లటూరి సువర్ణ |
| 3 | కర్నూలు | విజయ ప్రత్యూష |
| 4 | నెల్లూరు | పోలబోయిన రూప్ కుమార్ |
| 5 | తిరుపతి | మన్నెం శ్రీనివాస ప్రసాద్ |
| 6 | విశాఖపట్నం | డా. ముక్క శ్రావణి |
| 7 | విజయనగరం | అవనపు భార్గవి |

#### మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (29)

| క్ర.సం | పట్టణ సంస్థ | అభ్యర్థి పేరు |
|---|---|---|
| 1 | ఆళ్లగడ్డ | అనీషా షేక్ |
| 2 | అద్దంకి | కాకాని అశోక్ |
| 3 | ఆదోని | నాగమణి |
| 4 | ఆత్మకూరు (నంద్యాల) | డా. గోవింద రాజులు |
| 5 | బద్వేలు | సోమశిల దివ్య తేజ |
| 6 | బొబ్బిలి | రాంబార్కి రేణుకా దేవి స్వప్న |
| 7 | దాచేపల్లి | తంగెళ్ల శ్రీనివాసరావు |
| 8 | ధర్మవరం | పరిశె సుధాకర్ |
| 9 | గురజాల | నెలవల్లి బొల్లయ్య |
| 10 | హిందూపురం | పి.ఎస్. మంజునాథ్ |
| 11 | ఇచ్చాపురం | ఆసి లీలా రాణి |
| 12 | జగ్గయ్యపేట | నరేంద్రుల వినీత |
| 13 | జమ్మలమడుగు | జ్యోతి చాడిప్రళ్ల |
| 14 | కమలాపురం | గొంగలిరెడ్డి స్వప్న |
| 15 | కుప్పం | ఎస్. రాజకుమార్ |
| 16 | మాచర్ల | ఏనుముల సుష్మ |
| 17 | మదనపల్లె | శ్రీరామ్ చిన్న బాబు |
| 18 | మార్కాపురం | వక్కలగడ్డ మల్లికార్జున |
| 19 | నగరి | శ్రీనివాసన్ |
| 20 | పలాస కాశీబుగ్గ | వజ్జ గంగాభవాని |
| 21 | పెద్దాపురం | వత్సవాయి ఎల్.ఎస్.ఎన్. రాజు |
| 22 | పెనుకొండ | త్రివేంద్ర మూర్తి |
| 23 | పులివెందుల | తుగుట్ల గీతా కుమారి |
| 24 | రాజంపేట | డా. దొంతం గాయత్రి |
| 25 | రామచంద్రపురం | మేడిశెట్టి శేషారావు |
| 26 | రాయచోటి | ఖాదర్ వలి షేక్ |
| 27 | రాయదుర్గం | టంకశాల హనుమంతు |
| 28 | రేపల్లె | కె. అపర్ణ |
| 29 | సూళ్లూరుపేట | పిట్టల సుహాసిని |

# ఏపీలో పలుచోట్ల ఉద్రిక్తతలు

## విజయవాడలో కంట్రోల్ రూం ఏర్పాటు

విజయవాడ (చైతన్య రథం): ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలుచోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల ఫిర్యాదులు, సమస్యలపై స్పందించనుంది. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూం నెంబర్లు: 0866 2490023, 2490024, 2490025, 2490026 చేయాలని ఎస్ఈసీ వెల్లడించింది. అన్నమయ్య జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. జిల్లాలోని పుంగనూరు, రాయచోటిలో వైకాపా వర్గాలు టీడీపీ వర్గాలపై దాడులకు దిగాయి. ఈ క్రమంలో జరిగిన రాళ్లదాడిలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీలో వాహనాలకు నిప్పంటించారు. తిరుపతిలోనూ వైకాపా నేతలు హల్‌చల్ చేశారు. ఆ పార్టీ నేతలు భూమన కరుణాకర్రెడ్డి, భూమన అభినయ్రెడ్డితో పాటు పలువురు నేతలు తెదేపా కార్యకర్తలపై దౌర్జన్యానికి




పాల్పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇవాళ ఉదయం నుంచి వాహనాలతో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తమ్ముడు కృష్ణారెడ్డి హల్చల్ చేశాడు. దీనిపై భాజపా కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో వైకాపా, భాజపా కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.

### ఐజీ సమీక్ష

రాష్ట్రంలో నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకున్న దాడులపై ఐజీ రాజకుమారి సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితిని ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు పరస్పర దాడులపై ఎన్నికల సంఘం కూడా సమాచారం తెప్పించుకుంటోంది.

### ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పర్యటన

పల్నాడు జిల్లా మాచవరం ఎస్సీ కాలనీలో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పర్యటించారు. కమిషన్ సభ్యుడితో కలిసి వైకాపా దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. వైకాపా నేతల దాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# పుంగనూరు అల్లర్ల బాధ్యులపై కఠిన చర్యలు

- ఎంపీ మిథున్‌రెడ్డి, అనుచరుల దౌర్జన్యాలను ఉపేక్షించేది లేదు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టీకరణ
- టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని పిలుపు

అమరావతి (చైతన్యరథం): వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆయన అనుచరుల దౌర్జన్యాలను ఉపేక్షించే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని, ఘటనల్లో బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. మిథున్‌రెడ్డి, ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం గతంలోనూ దౌర్జన్యపూరితంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయని పల్లా పేర్కొన్నారు. పుంగనూరులో శుక్రవారం జరిగన అల్లర్లు, దాడులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని పల్లా సూచించారు. ఎవరెంతగా రెచ్చగొట్టినా చట్టాన్ని గౌరవించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని స్పష్టం చేశారు.

జగన్ రెడ్డి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గొడ్డలిపార్టీ దౌర్జన్యాలకు పాల్పడి, ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థులకు పోటీచేసే అవకాశం కూడా లేకుండా చేసిందని విమర్శించారు. ఈసారి అలాంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కోరారు. నామినేషన్ల నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పే కీలకం కావాలి తప్ప, బెదిరింపులు, దౌర్జన్యాలు కాదు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.




## తమిళనాడు, కర్నాటక రౌడీలతో..

# పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి అల్లర్లు

- ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆధ్వర్యంలో ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు
- వైసీపీ విధ్వంసంపై ఎస్ఈసీకి వివరించి, దాడి వీడియోల పెన్ డ్రైవ్‌ను అందజేసిన నేతలు
- పెద్దిరెడ్డి కుటుంబం ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించిన వర్ల రామయ్య
- కుట్రలతో శాంతి భద్రతలకు భంగం కలిగించటమే జగన్ రెడ్డి ప్లాన్ అని ఆగ్రహం
- పుంగనూరులో అన్ని కార్లతో ఎంపీ మిథున్ రెడ్డి ఎందుకు వచ్చారు.. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా అని నిలదీత



అమరావతి (చైతన్యరథం): తమిళనాడు, కర్ణాటక నుంచి రౌడీలను తీసుకొచ్చి పుంగనూరులో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దాడులు, అల్లర్లకు పాల్పడ్డారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి గూండాలతో దాడికి తెగబడ్డ వీడియోల పెన్ డ్రైవ్‌ను ఎస్ఈసీకి అందజేశారు. అనంతరం మీడియాతో వర్ల రామయ్య మాట్లాడుతూ పోటీ చేసినా ఎక్కడా గెలవలేమన్న నిరాశ, నిస్పృహలతో రాష్ట్రంలో జగన్ రెడ్డి, పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి పథకం ప్రకారమే గొడవలు సృష్టించేందుకు కుట్రలకు దిగారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రెండు కార్లతో వెళ్లి నామినేషన్ వేయాల్సిన వ్యక్తి... 32 కార్లతో రౌడీలను తీసుకొచ్చి ర్యాలీగా నామినేషన్ వేసేందుకు ఎందుకు వచ్చాడు. ఆయన వచ్చిన విధానం చూసి అధికారులే భయపడిపోయారు.

అసలు ఈ నామినేషన్లలో ఎంపీకి ఏం సంబంధం. మిథున్ రెడ్డి, గొడ్డలి పార్టీ నాయకులు రాజకీయ నాయకుడిలా కాకుండా రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. బందిపోటుల్లా ప్రవర్తిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2021లో చేసిన అరాచకాలను ఇప్పుడు కూడా చేయలనుకుంటున్నారా? తిరుత్తణి, కాట్పాడి, బెంగళూరు నుంచి రౌడీలను తీసుకొచ్చి టీడీపీ నాయకులపై దాడులు చేశారు.

బెంగళూరులో సగం ఆస్తులు పెద్దిరెడ్డి బ్యాచ్‌వే. పుంగనూరులో ఎప్పుడూ చూడని అనేక కొత్త మొఖాలు శుక్రవారం జరిగిన అల్లర్లలో కనిపించాయి. ఆ వీడియోలన్నీ ఎన్నికల సంఘానికి వీడియోలు చూపించాం.

పోలీసుల చేత వీడియోలో ఉన్న వారిని విచారణ జరిపించాలని కోరాం. పుంగనూరు ఎన్నికల్లో తమిళనాడు, కర్నాటక రౌడీలకు ఏం పని? మిథున్ రెడ్డి రౌడీలతో దౌర్జన్యం చేయడంతో ఆర్వో కూడా బయపడి బయటకు వచ్చేశారు. దౌర్జన్యం చేసి గెలవాలని గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. ఎన్ని చేసినా ఒక్క సీటు కూడా వైసీపీ గెలవలేదు. మద్యం కేసు, వివేకా హత్య కేసు, జగన్ అక్రమాస్తుల కేసులను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. వైసీపీకి ప్రజలు ఓటు వేసే పరిస్థితులు లేవు. దౌర్జన్యం చేసేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తే తగిన ముల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. చట్టబద్ధంగా వెళదాం.

రౌడీయిజంతో గెలవాలని చూస్తే అది జరగదు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయి. జగన్ రెడ్డి కోరుకున్నట్టు అరాచకం చేస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవు. తాట తీస్తాయనే విషయం వైసీపీ నాయకులు గ్రహించాలి. ఇలాగే వ్యవహరిస్తే ఎంపీ మిథున్ రెడ్డిని ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని వర్ల రామయ్య హెచ్చరించారు. ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ కూడా ఉన్నారు.

# పుంగనూరులో అల్లర్లు.. ప్రజాస్వామ్యంపై వైసీపీ దాడే

- అరాచకం సృష్టించిన ఎంపీ మిథున్ రెడ్డి
- కఠిన చర్యలు తీసుకోవాలి
- పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి
- దాడుల్లో గాయపడ్డ టీడీపీ కార్యకర్తలకు పరామర్శ, అండగా ఉంటామని హామీ



పుంగనూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు సాగుతున్న తరుణంలో పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి నేతృత్వంలో జరిగిన అరాచకాలు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అంటూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం నామినేషన్ల సందర్భంగా వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, అనుచరుల దాడుల్లో గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి పరామర్శించారు. బాధితులతో నేరుగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితి, జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

అనంతరం ఆసుపత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ఘాటుగా స్పందించారు. నామినేషన్ వేయడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు. ఆ హక్కును అడ్డుకోవాలని చూడటం, దాడులకు తెగబడటం సిగ్గుచేటు. ఇలాంటి దౌర్జన్యాలను ప్రజాస్వామ్యవాదులెవరూ హర్షించరన్నారు. దాడులు చేసి, భయపెట్టి టీడీపీ కార్యకర్తల నోరు మూయించాలని చూస్తే కుదరదు. కార్యకర్తలకు మేమందరం అండగా ఉంటాం. గాయపడిన కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. నిష్పక్షపాతంగా వ్యవహరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి

ఒక పార్లమెంట్ సభ్యుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ కార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి, బయటి నుంచి గుండాలు, ప్రైవేటు గన్‌మెన్లతో కలిసి వాహనాలు నడిపి ప్రజలను తొక్కించుకుటూ వెళ్లిన ఘటన అత్యంత దుర్మార్గం. ఈ దాడిలో అనేక మందికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఒక ఎంపీ స్థాయి వ్యక్తి ఇంత దిగజారి ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి ఎగతాళి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీకి ఏమైనా అభ్యర్థిత్వం ఉందా? నామినేషన్ కారక్రమానికి ఆయనే స్వయంగా వచ్చి గూండాలతో గేట్లు గుద్ది లోపలికి దూసుకెళ్లాల్సిన అవసరం ఏముంది? వైసీపీ పాలనలో పుంగనూరు, అంగళ్లు ప్రాంతాల్లో చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించారో ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఆనాటి అరాచక పద్ధతులు ఇప్పటికీ మారలేదు. పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, మిథున్ రెడ్డి వంటి వ్యక్తులు జిల్లాకు క్యాన్సర్ గడ్డలాగా మారారు. గతంలో అనేక కేసులు ఉన్న పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు తాజా అల్లర్లలో కూడా ఉన్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులను జిల్లా నుంచి, రాష్ట్రం నుంచి బహిష్కరించాలి. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. ఎంపీ మిథున్ రెడ్డిని పుంగనూరులోకి ఎందుకు అనుమతించారో పోలీసులు సమాధానం చెప్పాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి. అరాచకాలు సృష్టించి భయం పుట్టించి గెలవాలనే వైసీపీ కుట్రలను ప్రజలు తిరస్కరిస్తారని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్చార్జ్ మధుసూదన్ నాయుడు, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిథున్‌రెడ్డి బరితెగింపు, తిరగబడ్డ పుంగనూరు

- **బెంగళూరు రౌడీలతో కాన్వాయ్‌గా నామినేషన్ కేంద్రానికి**
- **జనాన్ని తొక్కుకుంటూ దురుసుగా కార్లు నడిపిన రౌడీమూకలు**
- **ఇదేమని అడిగితే టీడీపీ శ్రేణులపై రాడ్లు, కత్తులతో దాడి**
- **ఎదురుదాడితో వాహనాలను వెంటాడి తరిమికొట్టిన టీడీపీ కార్యకర్తలు, స్థానికులు**
- **దాడులకు పూర్తి బాధ్యత మిథున్‌రెడ్డిదేనని పోలీసుల వెల్లడి**



పుంగనూరు (చైతన్యరథం): పాపాల పెద్దిరెడ్డి కుటుంబం మరోసారి బరితెగించింది. ప్రజాస్వామ్యాన్ని పరిహసించేలా స్థానిక ఎన్నికల ప్రక్రియపై నెత్తుటిముద్రలు వేసింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న పుంగనూరులో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం తొలిరోజు శుక్రవారం వైసీపీ మూకలు, కిరాయి రౌడీలు భారీ విధ్వంసానికి పాల్పడ్డారు. పుంగనూరుపై తమ పట్టు చెదరలేదని చెప్పుకునేందుకు కర్నాటక రౌడీలు, అల్లరిమూకలతో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా అల్లర్లకు పాల్పడ్డారు. అయితే 30 ఏళ్లుగా స్థానికంగా ఆ కుటుంబం సాగించిన అణిచివేతలోంచి పెల్లుబికిన ఆక్రోశం ఆగ్రహంగా మారటంతో స్థానిక ప్రజలు తిరగబడి మిథున్‌రెడ్డి ముఠాను తరిమికొట్టారు.

ఎంపీ మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఏకంగా వంద మందిని వెంటేసుకుని, ఆరు వాహనాల్లో కాన్వాయ్‌గా నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. నిబంధనల ప్రకారం, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు ఇద్దరు మాత్రమే కార్యాలయం ఆవరణలో 100 మీటర్ల లోపలికి రావడానికి అనుమతి ఉంది. నిర్దేశించిన వంద మీటర్ల దూరం నిబంధనను వారు పూర్తిగా ఉల్లంఘించారు. పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా అతివేగంగా స్టాపర్లు, గేట్లను తోసుకుంటూ నేరుగా లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతోనే అక్కడ తొలిసారిగా వివాదం తలెత్తింది. ఈ దూకుడును టీడీపీ అభ్యర్థులు, అక్కడున్న ప్రజలు గట్టిగా ప్రతిఘటించడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీసింది. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ వర్గానికి చెందిన మరో వాహనం మరింత అతివేగంగా అక్కడున్న జనాల మీదకు, అభ్యర్థుల మీదకు దూసుకెళ్లడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ప్రశ్నించేందుకు వచ్చిన వారిపై మిథున్ రెడ్డి తన అనుచరులతో దాడులు చేయించాడు. కాన్వాయిలోని కార్లలో ముందుగానే సిద్ధం చేసుకున్న రాడ్లు, కత్తులతో రౌడీ మౌకలు విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డాయి. టీడీపీ కార్యకర్తలు మధు రాయల్ తల పగలగొట్టారు, సుహైల్ బాషాను ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టారు, మంజునాథ్ చెయ్యి విరగ్గొట్టారు, మోహన్ రెడ్డి తల పగలగొట్టారు. దాదాపు 15 మంది టీడీపీ శ్రేణుల కాళ్లు, చేతులు, తలలు పగలగొట్టి ఘోర హింసకు పాల్పడ్డారు. దీంతో టీడీపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఎంపీ మిథున్ రెడ్డి వాహనాలపై దాడికి పాల్పడ్డారు. ఆయన వాహనాలను ధ్వంసం చేసి తరిమికొట్టారు.

### పరారై తలదాచుకున్న మిథున్‌రెడ్డి

టీడీపీ కార్యకర్తలు, స్థానికుల ఎదరుదాడితో పరిస్థితి పూర్తిగా చేజారటంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మిథున్ రెడ్డిని హుటాహుటిన సమీపంలోని నామినేషన్ కేంద్రం లోపలికి తీసుకెళ్లి ఒక గదిలో తలదాచుకునేలా భద్రత కల్పించారు. అయినా ఆందోళనకారులు అక్కడికి దూసుకెళ్లేందుకు యత్నించడంతో గందరగోళం నెలకొంది. రెండు వర్గాలను చెదరగొట్టేందుకు, పరిస్థితిని కంట్రోల్ చేసేందుకు రంగంలోకి దిగిన పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ హింసలో పలువురికి గాయాలయ్యాయి.

### రిటర్నింగ్ అధికారికి బెదిరింపులు

ఇలాఉంటే ఎంపీ మిథున్ రెడ్డి కళ్ళు ఎర్రజేసి, ఆవేశంతో ఊగిపోతూ, ఎదురుగా ఉన్న రిటర్నింగ్ ఆఫీసర్‌లకు వేలు చూపిస్తూ "అంతు చూస్తా" అని బెదిరించటం ఆయనలో గూడుకట్టుకున్న అహంకారాన్ని, మదాన్ని బట్టబయలు చేసింది. చట్టాన్ని రక్షించాల్సిన ప్రజాప్రతినిథే నామినేషన్ దాఖలు సమయానికంటే ముందే వచ్చి స్వయంగా ఒక అధికారిని భయానికి గురిచేయడం ఆయన నియంతృత్వ పోకడలకు, గూండాగిరీకి పరాకాష్ఠగా నిలిచింది.

### పూర్తి బాధ్యత మిథున్‌రెడ్డిదే

పుంగనూరులో వైసీపీ వర్గీయుల దౌర్జన్యంపై పోలీసులకు లభించిన డ్రోన్ వీడియోల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. పోలీసులు సేకరించిన వీడియో ఆధారాల ప్రకారం.. మొదట టీడీపీ నేతలు, కార్యకర్తలపై ఎంపీ మిథున్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేయించారు. కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. ఈ వీడియోలను సేకరించిన పోలీసులు.. ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. దాడులు చేసిన వారిని గుర్తించేపనిలో ఉన్నారు.

పుంగనూరులో చెలరేగిన హింసాత్మక ఘటనలపై అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కనుమిల్లి మీడియా సమావేశంలో స్పష్టతనిచ్చారు. పుంగనూరులో ఉద్రిక్తతలకు, అరాచకానికి పూర్తి ప్రధాన కారణం వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డేనని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ భద్రతా నిబంధనలను ఉల్లంఘించడం వల్లే అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొందని ఎస్పీ తేల్చిచెప్పారు. చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేసినా, ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. వీడియో ఫుటేజ్ ఆధారంగా అల్లర్లకు పాల్పడిన ప్రతి ఒక్కరిని గుర్తిస్తున్నామని, చట్టాన్ని ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఏదేమైనా పాత పుంగనూరు అనుకుని భయపెట్టాలని వచ్చిన మిథున్‌రెడ్డి తానే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. వైకాపా రౌడీల మూకలన్నీ కార్లలో పారిపోయేలా జనం తరిమికొట్టారు, వెంటబడ్డారు. ఇంకా జగన్ హయాంలో నడిచినట్లుగా నడవాలంటే కుదరదుకదా? శ్రీకాకుళం నుండి సైకిళ్ల మీద టీడీపీ కార్యకర్తలు యాత్రకు వస్తే బట్టలు ఊడదీసి అవమానించడం, రామచంద్ర యాదవ్ ఇంటి మీద దాడి చేయడం, చంద్రబాబు నాయుడు మీద రాళ్లు వేయించడం, నామినేషన్ పత్రాలు చించేయడం, తలలు పగలగొట్టడం లాంటి తమ దుర్మార్గాల కాలం ముగిసిందనే విషయం జగన్, పెద్దిరెడ్డికి తెలియకపోవటమే ఆశ్చర్యం. రౌడీ మౌకల తుక్కు రెగ్గొట్టడానికి పుంగనూరు మొత్తం ఏకమైంది.

# పుంగనూరులో పెద్దిరెడ్డి రౌడీయిజానికి కాలం చెల్లింది

- **మూడు దశాబ్దాల అణిచివేతనుండి పెల్లుబికిన ప్రజాగ్రహం**
- **అల్లరి మూకలను తరిమికొట్టిన స్థానికులు**
- **మున్సిపల్ నామినేషన్ కేంద్రం వద్దకు ఎంపీ మిథున్‌రెడ్డి ఎందుకొచ్చారు?**
- **టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్**



అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం మళ్లీ తమ పాత రౌడీయిజాన్ని బయటకు తీసిందని తెలుగుదేశం పార్టీ నేత సప్తగిరి ప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక నుంచి కిరాయి గుండాలు, పెయిడ్ రౌడీలు, గంజాయి బ్యాచ్‌లను 10 కార్లలో రప్పించి ప్రజలను, టీడీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసే కుట్ర చేశారని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్లుగా పెద్దిరెడ్డి కుటుంబం సాగించిన అణచివేత, దౌర్జన్యాలను పుంగనూరు ప్రజలు మౌనంగా భరించారన్నారు. కానీ ఇప్పుడు వాహనాలు ఎక్కించి దాడి చేయాలని చూస్తే ప్రజలే స్వచ్ఛందంగా తిరగబడ్డారు. ప్రజల ఆగ్రహాన్ని చూసి కిరాయి మూకలు తోకముడిచి పారిపోయే పరిస్థితి వచ్చింది. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న మిథున్ రెడ్డికి 10 కార్లు, వందలాది మంది అల్లరి మూకలను వెంటేసుకుని నామినేషన్ కేంద్రాల వద్దకు వచ్చే హక్కు ఎవరిచ్చారు? ఆయన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థా.. అభ్యర్థిని ప్రతిపాదించే ప్రపోజరా? ఏ హోదా ఉందని కత్తులు, రాడ్లు, చైన్లతో నామినేషన్ కేంద్రాలపైకి వచ్చారు? గతంలో పెద్దిరెడ్డి మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలోని 85 పంచాయతీల్లో 82 స్థానాలను బెదిరింపులతో ఏకగ్రీవం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. నేడు కూడా అదే రౌడీయిజాన్ని, భయాందోళనలను పెట్టుబడిగా పెట్టి గెలవాలని చూస్తున్నారు. కూటమి నేతలు చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు చూపి ఓట్లు అడుగుతుంటే.. వైసీపీ నేతలు మాత్రం దౌర్జన్యాలు, కక్షలనే నమ్ముకుంటున్నారు. వైసీపీ రౌడీలు చేసిన దాడిలో దాదాపు 15 మంది టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలై, ఎముకలు విరిగి ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దౌర్జన్యాలు, దాడులు మీరే చేసి.. మళ్లీ అందరికంటే ముందుగా హైకోర్టుకు వెళ్లి శాంతిభద్రతలు క్షీణించాయని పిటిషన్లు వేస్తారా? డీజీపీ, హోం మంత్రి రాజీనామా చేయాలంటూ స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తారా? ఇంతకంటే విడ్డూరం మరొకటి ఉంటుందా? పుంగనూరు గడ్డపై ఇకపై పెద్దిరెడ్డి కుటుంబం అరాచకాలు సాగవని, దౌర్జన్యాలకు భయపడే రోజులు పోయాయని ప్రజలు స్పష్టంగా చెప్పారని సప్తగిరి ప్రసాద్ హెచ్చరించారు.

### పతనం మొదలైంది

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 45 ఏళ్ల రాజకీయ జీవితంలో సాగించిన దౌర్జన్యాలు, అరాచకాలకు పుంగనూరు ప్రజలు చరమగీతం పాడే రోజు వచ్చిందని స్పష్టం చేశారు. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా ప్రజలు పెద్దిరెడ్డి కుటుంబాన్ని చీదరించుకుంటూ తిరగబడుతున్నారని, వారి రాజకీయ పతనం అధికారికంగా మొదలైందని ఆయన హెచ్చరించారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో పుంగనూరును ఒక రాక్షస రాజ్యంగా, చంబల్ లోయలా పెద్దిరెడ్డి మార్చేశారు. నాడు ప్రతిపక్ష నేత హోదాలో నారా చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనకు వస్తే, రౌడీ మూకలను ఉసిగొల్పి రాళ్లదాడి చేయించిన దుర్మార్గ చరిత్ర పెద్దిరెడ్డిది. అంతటితో ఆగకుండా దాదాపు 700 మంది అమాయక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, నియోజకవర్గంలో తీవ్ర భయాందోళనలు సృష్టించారు.

ఏళ్ల తరబడి సాగిన అణచివేత నుంచి పుంగనూరు ప్రజలకు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయి. అందుకే రౌడీ మూకలు దాడులకు తెగబడినా భయపడకుండా ప్రజలే స్వయంగా తిరగబడ్డారు. దౌర్జన్యాలతో గెలవాలనుకునే పెద్దిరెడ్డిని ప్రజలు తరిమికొడుతున్నారు. మేము ప్రజల కోసం చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని నమ్ముకుని ఎన్నికల్లోకి వెళ్తున్నాం. మా ప్రభుత్వం చేసిన పనులు కళ్ల ముందే కనిపిస్తున్నాయి కాబట్టే ఎక్కడికెళ్లినా మాకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజల మద్దతు ఉన్న మాకు దౌర్జన్యాలు, గొడవలు చేయాల్సిన అవసరమే లేదు. ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుగుతాయి, ప్రజాస్వామ్యాన్ని కాపాడి తీరుతాం. ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదన్న భయంతోనే జగన్ మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి ముఠాలు మళ్లీ అరాచకాల బాట పట్టాయి. కానీ రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కూటమి జెండా రెపరెపలాడటం ఖాయం. రౌడీయిజం ఎప్పటికీ గెలవదు, అంతిమంగా ప్రజాస్వామ్యమే గెలుస్తుంది, ప్రజలే గెలుస్తారని సప్తగిరి ప్రసాద్ స్పష్టం చేశారు.

# పుంగనూరులో హింసే పెద్దిరెడ్డి అజెండా

- స్థానిక ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదనే విధ్వంసానికి కుట్ర
- బెంగళూరులో కూర్చుని అల్లర్లకు జగన్, పెద్దిరెడ్డి పథకరచన
- పుంగనూరులో ఏళ్ల తరబడి పెద్దిరెడ్డి అరాచకాలకు అంతేలేదు
- 30 ఏళ్లుగా కోల్పోయిన స్వేచ్ఛ కోసం తిరగబడ్డ స్థానికులు
- ఫ్యాక్షన్ రాజకీయాలకు ఇక చోటులేదు
- చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు
- టీడీపీ నేత గురజాల మాల్యాద్రి



అమరావతి (చైతన్యరథం): పుంగనూరులో శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే తాము గెలవలేమని, కనీసం బోణీ కూడా చేయలేమనే విషయం తెలిసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. అల్లర్లు, దౌర్జన్యాలతో హింసా రాజకీయాలకు తెర తీశారని తెలుగుదేశం పార్టీ నేత గురజాల మల్యాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని చావుదెబ్బ కొట్టడం ఖాయమని గుర్తించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఈ ఎన్నికలను ఎలాగైనా అడ్డుకోవాలని అనేక కేసులు వేయించారని గుర్తుచేశారు. అయితే హైకోర్టులో వారి కుట్రలన్నీ వీగిపోయి, న్యాయస్థానాలు తీసుకున్న సరైన నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలను అడ్డుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని ప్రచారం చేయాలనే దురుద్దేశంతో జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిసి బెంగళూరులో కూర్చొని విధ్వంసానికి కుట్ర పన్నారని మల్యాద్రి ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా ఉన్న మిథున్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఒకటి లేదా రెండు కార్లలో, ఆయనకున్న ప్రభుత్వ గన్‌మెన్లతో రావచ్చు.. కానీ బెంగళూరు నుంచి కార్ల కాన్వాయ్‌తో కర్ణాటక రౌడీలను కార్ల నిండా నింపుకొని పుంగనూరుకు బారు కట్టి రావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అక్కడ విధ్వంసం సృష్టించి, శాంతిభద్రతల సమస్యను తెరపైకి తెచ్చి, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు కాబట్టి ఎన్నికలు ఆపేయండి.. అంటూ మళ్లీ కోర్టులకు వెళ్లి నాటకాలు ఆడాలనే జగన్మోహన్ రెడ్డి ఈ కుట్రకు తెరలేపారని విమర్శించారు. బెంగళూరు నుంచి మిథున్ రెడ్డి రప్పించిన రౌడీ మూకలు పుంగనూరులో తీవ్ర రక్తపాతం సృష్టించాయి. టీడీపీ కార్యకర్తలు మధు రాయల్ తల పగలగొట్టారు, సుహైల్ బాషాను ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టారు, మంజునాథ్ చెయ్యి విరగ్గొట్టారు, మోహన్ రెడ్డి తల పగలగొట్టారు. ఇలా దాదాపు 15 మంది టీడీపీ శ్రేణుల కాళ్లు, చేతులు, తలలు పగలగొట్టి ఘోర హింసకు పాల్పడ్డారు. ఈ అరాచకాలను భరించలేకే స్థానిక ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం ఎంతటి రక్తపాతం సృష్టించిందో, ఎంత ఘోరమైన నేరాలకు పాల్పడిందో రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో కర్ణాటక రౌడీలతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని, అందుకే ఇలాంటి పిరికిపంద దాడులకు పాల్పడుతున్నారని మల్యాద్రి మండిపడ్డారు. పుంగనూరులో మధు రాయల్ తల పగలగొట్టిన వైనం, రౌడీలు సాగించిన దౌర్జన్యాలకు సంబంధించిన వీడియో ఆధారాలను మీడియా సమావేశంలో ప్రదర్శిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న రౌడీలు, వారిని వెనకుండి నడిపించిన మిథున్ రెడ్డి, పెద్దిరెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పుంగనూరులో పెద్దిరెడ్డి మార్కు ఫ్యాక్షన్ అరాచకాలు

పుంగనూరు గడ్డపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఏళ్ల తరబడి సాగిస్తున్న ఫ్యాక్షన్ సంస్కృతి, రక్తపాత దౌర్జన్యాలను మల్యాద్రి వీడియో క్లిప్పింగులతో సహా బట్టబయలు చేశారు. ప్రత్యర్థులు ఎవరైనా సరే.. నామినేషన్లు వేయాలన్నా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలన్నా వారిపై భౌతిక దాడులకు పాల్పడటం పెద్దిరెడ్డికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్ వేసేందుకు వెళ్లిన బీజేపీ నేత మదనమోహన్‌పై పెద్దిరెడ్డి అనుచరులు పైశాచికంగా దాడి చేశారు. ఆయన తల పగలగొట్టి, చేతులు విరగ్గొట్టి ఆస్పత్రి పాలు చేశారు. ప్రత్యర్థి పార్టీ నేతలను ప్రాణాపాయ స్థితికి నెట్టడమే వీరి రాజకీయం. పుంగనూరులో నామినేషన్ వేయడానికి వెళ్లిన వృద్ధుడు అంజిరెడ్డి తాతను అడ్డుకుని, ఆయన చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని దౌర్జన్యానికి పాల్పడ్డారు. వయస్సు మీద పడిన పెద్దాయన అని కూడా చూడకుండా కాగితాలు లాక్కొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. బీజేపీ పార్టీ నాయకుడు రామచంద్ర యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుని పుంగనూరు పట్టణంలోని ఆయన నివాసంపై పెద్దిరెడ్డి ముఠాలు విరుచుకుపడ్డాయి. ఆయన ఇంటిని, ఆస్తులను పూర్తిగా ధ్వంసం చేయడమే కాకుండా, కార్లను పగులగొట్టి నానా బీభత్సం సృష్టించారు. ఆవులపల్లి రిజర్వాయర్‌లో పెద్దిరెడ్డి అక్రమాలను, ప్రాజెక్టుల వాస్తవ స్థితిని పరిశీలించడానికి వెళుతున్న నాటి ప్రధాన ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడుపై అంగళ్లు వద్ద పెద్దిరెడ్డి గూండాలు పథకం ప్రకారం రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దాడి చేయడమే కాకుండా, బాధితులైన చంద్రబాబు నాయుడు, కిశోర్ కుమార్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావుపైనే రివర్స్‌లో అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సాగుతున్న నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రను చూసి ఓర్వలేక ఆయన కాన్వాయ్‌పైనా, పాదయాత్రలో పాల్గొన్న కార్యకర్తలపైనా పెద్దిరెడ్డి ముఠా గూండాలు రాళ్లతో విరుచుకుపడ్డారు. ఇలా పుంగనూరులో సామాన్య కార్యకర్త మధు రాయల్ నుంచి మొదలుకొని, బీజేపీ నేతలు, వృద్ధులు, చివరకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ వరకు ఎవ్వరినీ వదలకుండా భౌతిక దాడులకు పాల్పడటం పెద్దిరెడ్డి రక్తచరిత్రకు నిదర్శనమని మల్యాద్రి ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు, దాడులు చేసినా పుంగనూరులో ప్రజలు పెద్దిరెడ్డి అరాచకాలకు చరమగీతం పాడటం ఖాయమని స్పష్టం చేశారు.

### పెద్దిరెడ్డి అరాచకాలపై తిరగబడ్డ ప్రజలు

పుంగనూరు నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేసి, ప్రతిపక్షాలపై దాడులే అజెండాగా ఫ్యాక్షన్ రాజ్యాన్ని నడిపిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే కనీస నైతిక అర్హత లేదని మల్యాద్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దిరెడ్డి కుటుంబం సాగించిన దుర్మార్గాల వీడియో క్లిప్పింగులను ప్రదర్శిస్తూ నిప్పులు చెరిగారు. శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు సైకిల్ యాత్ర చేపట్టిన ఉత్తరాంధ్ర టీడీపీ కార్యకర్తలు పుంగనూరుకు చేరుకోగానే పెద్దిరెడ్డి రౌడీ మూకలు వారిపై దౌర్జన్యానికి దిగాయి. వారి బట్టలు ఊడదీసి, అత్యంత అమానుషంగా అవమానించిన దృశ్యాలు ఈ రాష్ట్ర ప్రజలంతా చూశారు. యువగళం పాదయాత్రపై కూడా రాళ్లదాడులు చేయించిన మీరా ప్రజాస్వామ్యం గురించి సుద్దులు చెప్పేది? పుంగనూరులో ఎస్.కె. రమణారెడ్డి ఆస్తులను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆవులపల్లి రిజర్వాయర్‌లో పెద్దిరెడ్డి అక్రమాలను పరిశీలించేందుకు టీడీపీ శ్రేణులు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తుంటే, అడ్డుకుని ఏకంగా 15 కార్లను పగులగొట్టి విధ్వంసం సృష్టించారు. పుంగనూరు నియోజకవర్గంలో సుమారు 700 మంది టీడీపీ కార్యకర్తలు, నేతలపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపారు. పోలీసుల వేధింపులు, పెద్దిరెడ్డి ముఠాల దాడులు భరించలేక మహిళలు, పిల్లలతో సహా కార్యకర్తల కుటుంబాలు ఊళ్లు విడిచి అడవుల్లో దాక్కున్న దుస్థితి ఏర్పడింది. ఆ సమయంలో నేను స్వయంగా విజయవాడ నుంచి వెళ్లి, వారం రోజుల పాటు అడవుల్లో తలదాచుకున్న బాధితులను, జైళ్లలో ఉన్న వారిని కలిసి ధైర్యం చెప్పి వచ్చాను. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న మొత్తం 85 పంచాయతీల్లో.. ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి, నామినేషన్లు వేయనీయకుండా ఏకంగా 82 పంచాయతీలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకున్న చరిత్ర పెద్దిరెడ్డిది. అలాంటి వ్యక్తి ఈరోజు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ప్రభుత్వం మద్యం ధరలను అక్రమంగా పెంచిందని ప్రశ్నించిన పాపానికి ఓం ప్రతాప్ అనే దళిత యువకుడిని తెల్లారేసరికి శవమై తేలేలా చేశారు. దౌర్జన్యాలు, హత్యలే ఆస్తిగా బతికే మీరు ప్రజాస్వామ్యవాదులా? చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్నారు తప్ప, చిత్తూరు జిల్లాలో ఏనాడూ ఫ్యాక్షన్ రాజకీయాలు చేయలేదు. ఈ ఎన్నికల్లో శాంతియుతంగా పోలింగ్ జరిగితే పుంగనూరులోనే కాదు.. పులివెందుల, రాయచోటితో సహా రాయలసీమలో ఎక్కడా వైఎస్సార్‌సీపీ గెలవదు. డిపాజిట్లు కూడా రావని తేలిపోవడంతోనే, ఎంపీ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో కర్ణాటక రౌడీలను రప్పించి శాంతిభద్రతల సమస్యను సృష్టించే కుట్ర చేశారు. 30 ఏళ్లుగా అణచిపెట్టుకున్న బాధ, ఆక్రోశంతోనే పుంగనూరు ప్రజలు పెద్దిరెడ్డి రౌడీలపై తిరగబడ్డారు. ఇకనైనా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అబద్ధాలు, భౌతిక దాడుల సంస్కృతికి స్వస్తి పలకాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవాలని మల్యాద్రి హెచ్చరించారు. నియంతృత్వానికి కాలం చెల్లిందని, ప్రజలు ఇచ్చే తీర్పుతో పుంగనూరులో ఫ్యాక్షన్ రాజకీయాలు శాశ్వతంగా అంతమవడం ఖాయమని స్పష్టం చేశారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం

**- ఇరిగేషన్ శాఖ డీఈఈ సస్పెన్షన్**

అమరావతి (చైతన్యరథం): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజనీర్‌పై ఇరిగేషన్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణ, మరమ్మతుల (ఓ అండ్ ఎం) పనులను పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఓఅండ్ఎం పనుల కోసం ప్రభుత్వం ఇటీవల రూ.256 కోట్ల నిధులను విడుదల చేసింది.

అయితే, నెల్లూరు జిల్లా ఉదయగిరి సబ్ డివిజన్ డీఈఈ మల్లాపు పుల్లయ్య ఓఅండ్ఎం పనులకు సంబంధించిన బిల్లుల ప్రాసెసింగ్, రికార్డుల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్) వరప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సాగునీటి నిర్వహణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బందికి ఆయన స్పష్టం చేశారు. పనుల నిర్వహణ, బిల్లుల నమోదు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# పుంగనూరు, రాయచోటిలో...
# ఓటమి భయంతోనే గొడ్డలిపార్టీ హింస

- టీడీపీ నాయకులపై దాడులు చేస్తే ఊరుకోబోము
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ మా విధానం
- ప్రజాక్షేత్రంలో వైసీపీకి గుణపాఠం.. కూటమి ఘన విజయం తథ్యం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతున్నామనే భయంతో గొడ్డలి పార్టీ హింసా సంస్కృతిని అవలింబిస్తోందని.. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాయచోటి, పుంగనూరులో టీడీపీ నేతలపై వైసీపీ మూకల దాడులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు, రాయచోటిలో జరిగిన సంఘటనలను ప్రజలందరూ సోషల్ మీడియా, మీడియా ద్వారా గమనిస్తున్నారు. అయితే, ఈ ఘటనల వెనుక ఉన్న రాజకీయ పరిస్థితులను కూడా ప్రజలు అర్థం చేసుకోవాలి. 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి అధికార బలం, అంగబలం, అర్థబలంతో పాటు పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం సాగించిన దౌర్జన్యాలను ప్రజలు చూశారు. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, బెదిరించడం, దాడులు చేయడం, దుస్తులు చింపి అవమానించడం వంటి ఘటనలు జరిగాయి. అధికార యంత్రాంగాన్ని సైతం ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. కుప్పం మున్సిపాలిటీలోనూ అక్రమాలకు పాల్పడి అధికారాన్ని దక్కించుకున్నారు. అలాంటి పరిస్థితుల నుంచి ఈ రోజు పుంగనూరు, రాయచోటిలో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నదంటే, గతంలో ఆ కుటుంబాలు, నాయకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజల్లో ఎంతటి అసంతృప్తి ఉందో, వారి ఆగ్రహం ఏ స్థాయికి చేరుకుందో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయని మంత్రి మండిపల్లి అన్నారు.

**గొడ్డలి సంస్కృతే పెద్దిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి విధానం**

తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, మా నాయకుడు చంద్రబాబు విధానం అసాంఘిక కార్యకలాపాలకు చోటు ఇవ్వవు. ప్రభుత్వం మా చేతిలో ఉందని అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించాలనుకుంటే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగేవి. కానీ, ఎన్నికల ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ నియమావళికి అనుగుణంగా, నిష్పక్షపాతంగా కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు ప్రభుత్వాన్ని, తెలుగుదేశం పార్టీని బాధ్యులను చేయడం సరికాదు. గత రెండు రోజులుగా పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం, రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ స్థానాలను కోల్పోతే జగన్మోహన్ రెడ్డి వద్ద తమ ప్రాధాన్యత తగ్గిపోతుందనే భయంతో, తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ ఘటనలను ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి మండిపల్లి దుయ్యబట్టారు.

**కిరాయి వ్యక్తులతో గూండాయిజం**

పుంగనూరులో జరిగిన ఘటనకు సంబంధించి కర్ణాటక నుంచి కిరాయి వ్యక్తులను తీసుకొచ్చారని తెలుస్తోంది. సుమారు 40 వాహనాలతో మిథున్ రెడ్డి కాన్వాయ్‌లో వచ్చిన వారు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. దీంతో ఆగ్రహంతో స్థానికులు ప్రతిఘటించిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఏ దాడి జరిగినా చట్టం తన పని తాను చేసుకుంటుంది. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ మా విధానం**

నా నియోజకవర్గంలోనూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మా పార్టీ కార్యకర్తలపై వందలాది కేసులు పెట్టడం, వారి ఆస్తులపై దాడులు జరగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ అనుభవాలను ప్రజలు మర్చిపోలేదు. గతంలో జరిగిన దౌర్జన్యాలను మరచిపోయి, ఇప్పుడు మళ్లీ వారి రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించవచ్చని ఎవరైనా భావిస్తే అది పొరపాటు. ప్రభుత్వం తరపున మేము స్పష్టంగా హామీ ఇస్తున్నాం. అక్టోబర్ 29 వరకు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియలో ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటాం. ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

**ప్రజల తీర్పే అంతిమ తీర్పు**

తెలుగుదేశం పార్టీ, కూటమి అభ్యర్థుల విజయమే మా లక్ష్యం. పెద్దిరెడ్డి కుటుంబం, గడికోట శ్రీకాంత్ రెడ్డి వంటి నాయకుల రాజకీయ వ్యూహాలకు మేము భయపడబోము. వారితో రాజకీయంగా తలపడేది ప్రజాక్షేత్రంలోనే. ప్రజల తీర్పే అంతిమ తీర్పు. రాయచోటి వారికి గుండెకాయ లాంటిదని గతంలో చెప్పుకున్న నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో ప్రజల తీర్పును చూశారు. అక్కడ తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరింది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు కూటమి పక్షాన నిలుస్తారనే నమ్మకం మాకు ఉంది. ఓటమి భయంతో సాకులు వెతుక్కుంటూ, తమ రాజకీయ వైఫల్యాలను ఇతరులపై నెట్టడం సమంజసం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. గతంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన నాయకులు, ఇప్పుడు అదే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారంటే వారి రాజకీయ విధానాలను ఒకసారి సమీక్షించుకోవాలని హితవు పలికారు.

**మేము గాంధేయవాదులం కాదు**

నేను ఒక స్థానిక శాసనసభ్యుడిగా నా కార్యకర్తలను కాపాడుకోవడం నా బాధ్యతగా భావిస్తున్నాను. గతంలో మా కార్యకర్తలు ఎదుర్కొన్న దౌర్జన్యాలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలి. అదే సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు పొందేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మేము గాంధేయవాదులమని చెప్పుకుని, మా కార్యకర్తలపై దాడులు జరిగినా చూస్తూ ఊరుకోబోము. అయితే, ప్రతిఘటన పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని సమర్థించం. మా కార్యకర్తల రక్షణకు, ప్రజల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన మార్గాల్లో పోరాడతాం. పుంగనూరు, రాయచోటిలో జరిగిన ఘటనలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూసేవారికి ప్రజలే సమాధానం చెబుతారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారు. ప్రజల తీర్పుతోనే మా రాజకీయ బలం ఏమిటో నిరూపిస్తామని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.

# పుంగనూరును శ్మశానం చేసేందుకు పెద్దిరెడ్డి కుట్రలు

- ఆ కుటుంబాన్ని తరిమికొట్టాలి
- దౌర్జన్యాలకు, దాడులకు బెదిరేది లేదు
- మున్సిపల్ నామినేషన్లలో ఎంపీ మిథున్‌రెడ్డికేం పని?
- పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి





అమరావతి (చైతన్యరథం): అధికారంలో ఉన్నప్పుడు గొడవలు చేసి గెలిచారు, ఇప్పుడు కూడా అదే చేసి గెలవాలని జగన్ డైరెక్షన్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం కుట్రలకు తెర తీసిందని చిత్తూరు జిల్లా పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే ఎన్.అమరనాథ్ రెడ్డి మండిపడ్డారు. పుంగనూరు ఘటనపై ఆయన మీడియా సమావేశం నిర్వహించి మిథున్ రెడ్డి వ్యవహార శైలిపై ధ్వజమెత్తారు. టీడీపీ పార్టీ స్థాపించినప్పటి నుంచి ప్రజాస్వామ్యయుతంగానే ఎన్నికల్లో పాల్గొంటున్నామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పుంగనూరులో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదు. కానీ పెద్దిరెడ్డి కుటుంబం పుంగనూరును శ్మశానంగా మార్చేలా కుట్రలు చేస్తోంది. ఆ కుటుంబాన్ని పుంగనూరు నియోజకవర్గం నుంచి తరిమికొట్టాల్సిన సమయం వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు హింసాత్మక రాజకీయాలకు పాల్పడిన వైసీపీ నాయకులు, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అదే విధానాన్ని కొనసాగించాలని చూస్తున్నారు. ఎంపీ మిథున్ రెడ్డి అధికారుల కార్యాలయాల్లోకి దౌర్జన్యంగా వెళ్లి వారిని బెదిరిస్తున్నారు. టీడీపీ అధికారంలో లేనప్పుడు 700 మందిపై కేసులు పెట్టినా, జైలులో పెట్టినా, ఆస్తులను ధ్వంసం చేసినా మేము భయపడలేదు. అలాంటిది ఇప్పుడు బెదిరింపులు, దౌర్జన్యాలతో టీడీపీని అణచివేయాలని చూస్తే భయపడే ప్రసక్తే లేదు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మా పోరాటం కొనసాగుతుంది. 2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో కూడా పెద్దిరెడ్డి బయటి ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి అలజడులు సృష్టించి, స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఇప్పుడు అదే పద్ధతి అమలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగనివ్వకుండా, హింసాత్మక వాతావరణంలో గెలవాలని వైసీపీ కుట్రలు చేస్తోందని ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి దుయ్యబట్టారు.

**దౌర్జన్యాలకు బెదిరేది లేదు**

పుంగనూరులో గతంలో ఇటువంటి పరిస్థితి లేదు. మా తండ్రి అక్కడ శాసనసభ్యులుగా పనిచేశారు, నేను కూడా శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహించాను. స్వాతంత్ర్యం నాటి నుంచి ఎంతోమంది పెద్దలు ఈ నియోజకవర్గానికి శాసనసభ్యులుగా సేవలందించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎవరిని అడిగినా పుంగనూరు అంటే ప్రశాంతమైన ప్రాంతం, ప్రశాంతమైన వాతావరణం అని ప్రతి ఒక్కరికీ తెలుసు. అలాంటి ప్రశాంతమైన వాతావరణంలో గత మున్సిపల్ ఎన్నికల్లో, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏం జరిగిందో గుర్తు చేసుకోవాలి.

80 ఏళ్ల వయసు ఉన్న అంజిరెడ్డి తాత నామినేషన్ వేసేందుకు వస్తే వృద్ధుడని కూడా చూడకుండా దౌర్జన్యం చేసి ఆయన చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాగేసుకున్నారు. చంద్రయ్య యాదవ్ ఇంటిపై రాళ్ల దాడి చేసి ఆ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసిన విషయం అందరికీ తెలుసు. గత ప్రభుత్వంలో చేసిన పాపం ఇంకా పోలేదు. ఇప్పుడు అధికార మార్పిడి జరిగింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. స్థానిక సంస్థల పదవులకు రిజర్వేషన్ల ప్రకటన ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా జరిగింది. మున్సిపాలిటీ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వెళ్తుంటే ఒక పార్లమెంట్ సభ్యుడికి ఏం పని? ఆయన ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్నారా? మున్సిపల్ చైర్మన్‌గా లేదా వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్నారా? కాన్వాయ్‌లో అన్ని వాహనాలు తీసుకొని నేరుగా గేట్లు గుద్ది, మనుషులు పరిగెత్తుతుంటే వారిని తొక్కించుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించారు. తలలు పగలగొట్టారు, కాళ్లు చేతులు విరగగొట్టారు, కార్లతో తొక్కించివేశారు. ఇంకా ఈ రాష్ట్రంలో వాళ్లదే అధికారం ఉందని పెద్దిరెడ్డి కుటుంబం అనుకుంటుందా? ప్రజలను భయపెట్టి, బెదిరించి రాజకీయాలు చేయాలనే ప్రయత్నాలను ప్రజలు సహించరు. ప్రజలను భయపెట్టి, అధికారులను బెదిరించి రాజకీయాలు చేయాలనే ప్రయత్నాలను అడ్డుకుంటామని అమరనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో విధ్వంసానికి బెంగళూరులో జగన్ పథకరచన

- స్థానిక ఎన్నికల్లో ఉనికి కోల్పోతామనే భయంతోనే వైసీపీ దౌర్జన్యాలు
- పుంగనూరులో పక్కా ప్రణాళికతోనే ఎంపీ మిథున్‌రెడ్డి అల్లర్లు
- చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



అమరావతి (చైతన్యరథం): వైకాపా ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు అడుగడుగునా దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలే చూశారని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. ఆనాడు ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను ప్రశ్నించిన వ్యక్తులపై, సంస్థలపై భౌతిక దాడులకు తెగబడ్డారని, ప్రజాస్వామ్య వ్యవస్థలను సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటూ ఎంతోమందిని అక్రమంగా జైళ్లలో పెట్టారని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మాచర్లలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సమయంలో టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది కిషోర్ కార్లపై నాటి వైకాపా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు దాడులు చేసిన దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందే ఉన్నాయి. అభ్యర్థులను కిడ్నాప్‌లు చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించి రివార్లతో బెదిరించడం, రకరకాలుగా భయభ్రాంతులకు గురిచేశారు. ఆ అరాచకాలకు విసిగిపోయిన ప్రజలు వైకాపాను చిత్తుగా ఓడించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ప్రజలు కేవలం 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాల్సిన చోట పుంగనూరు, తిరుపతి, రాయచోటి వంటి ప్రాంతాల్లో మళ్లీ రక్తపాతం సృష్టించాలని చూస్తున్నారు. అధికారం కోల్పోయి, రాష్ట్రంలో ఉనికి గల్లంతవుతోందనే భయంతోనే వైకాపా మళ్లీ హింసాకాండకు తెగబడుతోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల విమర్శించారు.

**పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి దౌర్జన్యం**

కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుబడి ఉంటే, వైకాపా అధినేత, నాయకులు కుట్రపూరితంగా అల్లర్లు సృష్టిస్తున్నారు. పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికలతో ఓ లోక్‌సభ ఎంపీకి ఏం పని అని ప్రశ్నిస్తున్నాం. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 11 గంటలకు మొదలవుతుంటే, ఉదయం 10:30 గంటలకే మిథున్ రెడ్డి 8 కార్ల కాన్వాయ్‌తో నామినేషన్ కేంద్రం వద్దకు రావడం దేనికి సంకేతం? కర్ణాటక నుంచి రౌడీలను, గుండాలను తీసుకొచ్చి, నామినేషన్లు వేసేందుకు వస్తున్న తెలుగుదేశం నాయకుల వాహనాలను ఢీకొడుతూ దౌర్జన్యాలకు పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చింది? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, రౌడీయిజంతో ఎన్నికలను ప్రభావితం చేయాలని చూస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ధూళిపాళ్ల నరేంద్ర హెచ్చరించారు.

**నామినేషన్లు అడ్డుకునేందుకు వైకాపా కుట్రలు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర పార్టీల అభ్యర్థులు, నాయకులు నామినేషన్లు వేయకుండా భయపెట్టడమే లక్ష్యంగా వైకాపా మొదటి రోజే దౌర్జన్యాలకు తెరలేపిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకవేళ చివరి రోజైన ఉండి, అధికారులు నామినేషన్లు తీసుకోవట్లేదని నిరసన తెలిపారంటే అందులో అర్థం ఉంటుంది. కానీ తొలిరోజే, అధికారులు నామినేషన్ కేంద్రం తలుపులు కూడా తెరవకముందే ఉదయం 10:30 గంటలకే దౌర్జన్యానికి దిగడం వెనుక స్పష్టమైన కుట్ర ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారు. అధికారులు ఏవైనా ఇబ్బందులు పెడితే అప్పుడు ఎంపీ జోక్యం చేసుకోవడంలో న్యాయం ఉంది. కానీ నామినేషన్లు మొదలయ్యే సమయానికంటే ముందే ఒక ఎంపీ కాన్వాయ్‌తో వచ్చి విధ్వంసం సృష్టించాల్సిన అవసరం ఏమొచ్చింది? మొదటి రోజే భయానక వాతావరణం సృష్టిస్తే ఆ ప్రాంతంలో ఎవరూ నామినేషన్ వేయడానికి ముందుకు రారనే దురాలోచనతోనే వైకాపా నేతలు ఈ విధ్వంసానికి పాల్పడ్డారు. ఇన్నాళ్లూ బెదిరింపులు, కిడ్నాప్‌లు, దౌర్జన్యాలతో అధికారాన్ని అనుభవించిన వీరికి, ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా ప్రశాంతంగా జరిగితే తమకు మనుగడ, పుట్టగతులు ఉండవనే భయంతోనే ఈ అరాచకాలకు ఒడిగట్టారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేలా రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పుంగనూరు సహా ఇతర ప్రాంతాల్లో హింసకు పాల్పడిన ఎంతటి పెద్దవారినైనా వదలకుండా, కారకులైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల డిమాండ్ చేశారు.

**ఓటమి భయంతోనే వైకాపా రక్తపాతం**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే భయంతోనే వైకాపా నాయకులు రాష్ట్రవ్యాప్తంగా హింసాకాండకు తెరతీశారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో ఫ్యాక్షనిజం, బెదిరింపులు, దోపిడీలతో స్థానిక ఎన్నికల్లో గెలిచాం, ఆ దౌర్జన్యాలకు పేటెంట్ మాదే అన్నట్లుగా వైకాపా నేతలు నేడు మళ్లీ అదే దారిలో ప్రవర్తిస్తున్నారు. ఒక్క ఓటు మీ జీవితాలను మారుస్తుంది' అని ఎన్నికల్లో చెప్పిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. అధికారంలోకి రాగానే 16 వేల మంది నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధి కల్పించాం. సామాజిక పింఛన్లను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచి ప్రజలకు అందిస్తున్నాం. గత ప్రభుత్వంలో అధ్వాన్నంగా మారిన గ్రామీణ, గిరిజన ప్రాంతాల రోడ్ల కోసం రూ.13 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఆర్ అండ్ బీ రహదారుల గుంతలను పూడ్చి ప్రజా రవాణాను మెరుగుపరిచాం. ఈ అభివృద్ధి ప్రజల కళ్లముందు స్పష్టంగా కనిపిస్తుండటంతో, తమకు ఎలాగూ ఓట్లు పడవని వైకాపా ముందే తెల్సుకుంది. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య విభేదాలు వస్తాయని, తద్వారా లబ్ధి పొందవచ్చని వైకాపా కలలు కంది. కానీ కూటమి పార్టీలన్నీ ఒకే మాట, ఒకే బాటగా సమన్వయంతో ఎన్నికల బరిలోకి దిగడంతో కనీస స్థానాలు కూడా దక్కవనే నిరాశతో హింసా మార్గాన్ని ఎంచుకున్నారు. పుంగనూరు, తిరుపతి, రాయచోటి వంటి ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి, భౌతిక దాడులకు పాల్పడి, తిరిగి తామే బాధితులమంటూ ప్రభుత్వంపై బురదజల్లుతూ మొసలి కన్నీరు కార్చడం వైకాపాకు అలవాటుగా మారింది. పుంగనూరులో వైకాపా గూండాలు సాగించిన విధ్వంసం అత్యంత హేయమైనది. టీడీపీ శ్రేణులు మధు రాయల్ పై విచక్షణారహితంగా దాడి చేసి తల పగలగొట్టారు. మక్బూల్ బాషా అనే కార్యకర్తపైకి ఉద్దేశపూర్వకంగా కారును దూకించి తీవ్రంగా గాయపరిచారు. మంజునాథ్ అనే వ్యక్తి చేయి విరగ్గొట్టగా, మోహన్ రెడ్డి అనే నాయకుడి తల పగలగొట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను రక్తసిక్తం చేసి ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ప్రజాస్వామ్య వాదాన్ని నమ్ముకుంటే.. వైఎస్సార్సీపీ మాత్రం రౌడీయిజాన్ని, హింసావాదాన్ని నమ్ముకుంది. ఈ దాడులు, బెదిరింపులతో ప్రజలను భయపెట్టలేరు. పుంగనూరుతో పాటు రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గ ప్రజలు ఈ అరాచకాలను గమనిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏ విధంగానైతే ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారో, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వైకాపాకు అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితిని కల్పిస్తూ.. ఓటు అనే ఆయుధంతో ఆ పార్టీకి శాశ్వత రాజకీయ సమాధి కట్టడం ఖాయమని ఎమ్మెల్యే ధూళిపాళ్ల స్పష్టం చేశారు.

**జగనే పూర్తి బాధ్యత వహించాలి**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ జరుగుతున్న హింసాకాండ, దాడులు అన్నింటికీ వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని ధూళిపాళ్ల అన్నారు. స్థానికంగా పోటీ చేయడానికి నాయకులు, కార్యకర్తలు ఎవరూ ముందుకు రాని నిస్సహాయ స్థితిలో ఉన్న వైకాపా, బలవంతపు నామినేషన్ల కోసం చేస్తున్న దౌర్జన్యాలు వారి పతనానికి నాంది అని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవమైతే, పోటీకి అభ్యర్థులను నిలబెట్టకపోతే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చేది లేదని వైఎస్ జగన్ సొంత పార్టీ నేతలనే బహిరంగంగా బెదిరించారు. ప్రజా వ్యతిరేకతతో నిరాశానిస్పృహల్లో ఉన్న వైకాపా నేతలు పోటీకి వెనుకంజ వేస్తుంటే, వారిని భయపెట్టి బలవంతంగా నామినేషన్లు వేయించే క్రమంలోనే ఈ స్థాయి హింసను ప్రేరేపిస్తున్నారు. హింస ద్వారానే తమ పార్టీ మనుగడను కాపాడుకోవాలని చూస్తే ప్రజలే ఆ పార్టీకి శాశ్వత సమాధి కడతారు. పుంగనూరులో జరిగిన దౌర్జన్యం ముందస్తు ప్రణాళికతో చేసిన కుట్ర అని స్పష్టంగా తెలుస్తోంది. మీడియాలో వస్తున్న దృశ్యాల్లో ఎన్నికల అధికారిని ఎలా బెదిరించారో, ప్రజలను కార్లతో ఎలా తొక్కిస్తూ దౌర్జన్యానికి దిగారో రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుల నుంచి కిరాయి రౌడీలను రప్పించి, వాహనాల్లో మారణాయుధాలతో మోహరించి భయోత్పాతం సృష్టించారు. నామినేషన్లు వేసేందుకు వెళ్లే కార్లలో బీరు సీసాలు, ఇనుప రాడ్లు ఎందుకుంటాయని ప్రశ్నించారు. పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన దాడి ముందస్తు ప్రణాళికతో కూడిన పక్కా కుట్ర అని నిప్పులు చెరిగారు. కార్లతో ప్రజలను, ప్రత్యర్థి పార్టీ నాయకులను ఢీకొడుతూ రౌడీయిజం చెలాయించే సంస్కృతికి చరమగీతం పాడాల్సిన సమయం వచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఇలాంటి అరాచకాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. బయట ప్రాంతాల నుంచి వచ్చిన రౌడీలను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేస్తున్నాం. హింసావాదం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైకాపా కుట్రలు ఇకపై సాగవని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ధూళిపాళ్ళ నరేంద్ర హెచ్చరించారు.

**హింసకు తావులేదు**

గతంలో పుంగనూరు అత్యంత ప్రశాంతమైన నియోజకవర్గంగా ఉండేది. పెద్దిరెడ్డి కుటుంబం ఆ ప్రాంతాన్ని ఫ్యాక్షనిజానికి, రక్తపాతానికి కేంద్రంగా మార్చింది. నేడు అధికారంలో లేకపోయినా పాత పద్ధతుల్లోనే దౌర్జన్యాలు చేయవచ్చని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి గూండాయిజానికి ఎట్టిపరిస్థితుల్లోనూ తావులేదని, ఈ అరాచక సంస్కృతికి చరమగీతం పాడతామని హెచ్చరించారు. గతంలో గుంటూరు పర్యటనలో వైఎస్ జగన్ కాన్వాయ్ కింద పడి సింగయ్య అనే సొంత పార్టీ కార్యకర్తే మరణించినా కనీసం కారు ఆపి పరామర్శించని సంస్కృతి వైకాపాది. అలాంటి నైజం ఉన్న నాయకులకు ప్రజల ప్రాణాలన్నా, కార్యకర్తల భద్రత అన్నా ఏమాత్రం లెక్కలేదు. అధికారం, స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను కార్లతో తొక్కించడానికైనా, కార్యకర్తలను బలిపీఠం ఎక్కించడానికైనా వారు వెనుకాడరని నేటి ఘటనలు మరోసారి రుజువు చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా స్వేచ్ఛగా పోటీ చేసే హక్కు రాజ్యాంగం కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలబడ్డారు. బెదిరింపులతో ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తే ఆ ప్రాంత ప్రజలు ఓటు ద్వారా వైకాపా హింసావాదానికి శాశ్వత సమాధి కడతారని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.

# ఓటమి భయంతోనే గొడ్డలిపార్టీ అరాచకాలు

- పుంగనూరు, రాయచోటి అల్లర్లకు జగన్‌దే బాధ్యత
- మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి (చైతన్యరథం): జగన్ రెడ్డిని, గొడ్డలి పార్టీ నాయకులను స్థానిక ఎన్నికల్లో ఓటమి భయం వెంటాడుతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఘోర పరాభవం గొడ్డలి పార్టీని ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. స్థానిక ఎన్నికల్లోనూ ఓటమి తప్పదనే నిరాశ, నిస్పృహలతోనే వైసీపీ నేతలు అరాచకానికి తెరలేపారు. పుంగనూరులో జరిగిన హింస, దౌర్జన్యాలు అందుకు నిదర్శనం. పొరుగు రాష్ట్రాల నుండి రౌడీలను తీసుకొచ్చి అల్లర్లు సృష్టిస్తున్నారు.

గొడ్డలి పార్టీ నాయకులు గతంలో చెప్పినట్లు వారి ఓటర్లు వేరే అంటే ఏమో అనుకున్నాం. వారి ఓటర్లు, వారి ఫాలోవర్లు, వారి పద్ధతి మొత్తం రౌడీయిజం అని నిరూపించుకున్నారు. ప్యాలెస్ లో కూర్చుని రాష్ట్రాన్ని రక్తసిక్తం చేయాలని జగన్ రెడ్డి కుట్రలు పన్నుతున్నాడు. హింసతో గెలవాలనుకుంటే జగన్‌కు ప్రజలు రాజకీయ సమాధి కడతారు.

ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తే ఉపేక్షించేది లేదు. పుంగనూరు, రాయచోటి సహా రాష్ట్రంలో పలు చోట్ల జరిగిన హింసకు జగన్ రెడ్డి బాధ్యత వహించాలని మంత్రి రవీంద్ర డిమాండ్ చేశారు.



## కూటమి పాలనలో..

# పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర అభివృద్ధి వెలుగులు

- వైసీపీ నిర్లక్ష్యం నుండి ఆర్థిక పునర్వైభవం దిశగా మునిసిపాలిటీలు
- సమగ్ర అభివృద్ధికి స్థానిక ఎన్నికలే కీలకం
- మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలి
- స్థానిక ఎన్నికల్లో కూటమికి ఘనవిజయం అందించాలి
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర పునర్నిర్మాణం, పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి ఘన విజయం అందించాలని ప్రజలకు ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలతో మొదలుపెట్టి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీల వరకు స్థానిక సంస్థల ఎన్నికల సమరం మొదలైందని, ఈ నెల 25, 26 తేదీల నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర స్థాయి విధానాలను నిర్ణయిస్తే, స్థానిక సంస్థల ఎన్నికలు మనం నివసించే వీధి, రోడ్డు, వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, అలాగే మన స్థానిక జీవనోపాధిని నిర్ణయిస్తాయన్నారు. మన ప్రాంతం ఎంత పరిశుభ్రంగా, బాగుండాలి, ఎంత హాయిగా జీవించాలన్నది మనం వేసే ఈ ఓటుపైనే ఆధారపడి ఉంది. మన వీధిని, బడిని, ఊరిని, మున్సిపాలిటీని నిజాయితీగా అభివృద్ధి పథంలో ఎవరు నడిపించగలరో ఆలోచించి ఓటు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మనకు మంచి చేసిన వారికి, మన ప్రాంతాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే శక్తి ఉన్న కూటమికి మద్దతు ఇవ్వాల్సిన సమయం ఇది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల కాలంలో రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థలు (17 నగరపాలక సంస్థలు, 106 పురపాలక సంఘాలు/నగర పంచాయతీలు) రూపురేఖలు మారాయి. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న సమస్యలను క్రమబద్ధీకరించి, అత్యంత పారదర్శకమైన పాలనను అందించాం. పట్టణాలు అనగానే మొదట గుర్తుకొచ్చేది రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పచ్చదనం, మౌలిక సదుపాయాలు. వీటన్నింటినీ సమూలంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల దాదాపు రూ.11,359 కోట్ల భారీ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది. పరిశ్రమల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇన్ని మంచి పనలు చేసింది కనుకనే.. ఆ ధైర్యంతోనే, మా అభివృద్ధిని చూసి ఓటు వేయమని ప్రజల ముందుకు వస్తున్నాం. నామినేషన్ల పర్వం ప్రారంభమవుతున్న వేళ, ప్రతి ఒక్కరూ ఆలోచించి రాష్ట్ర, స్థానిక పురోగతికి అండగా నిలవాలని విజయ్‌కుమార్ కోరారు.

### పట్టణాల్లో మౌలిక వసతుల విప్లవం

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న వేళ, గత 30 నెలల్లో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అద్భుతమైన అభివృద్ధి పనులపై విజయ్‌కుమార్ సమగ్ర వివరాలను వెల్లడించారు. కూటమి పాలనలో పట్టణాల్లో తీసుకొచ్చిన మౌలిక సదుపాయాల విప్లవం గురించి వివరించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రోడ్డు ఏదో, గుంత ఏదో తెలియని దుస్థితి ఉండేది. ఆ దుస్థితి నుంచి కేవలం మున్సిపాలిటీల పరిధిలోనే 2,160 కిలోమీటర్ల మేర పట్టణ రోడ్లను నూతనంగా, అత్యంత నాణ్యతతో పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్ర, జాతీయ రహదారులతో సంబంధం లేకుండా కేవలం మున్సిపల్ వీధులను ఇంత భారీ ఎత్తున తీర్చిదిద్దడం మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఓపెన్ డ్రైనేజీల దుర్వాసన, వర్షం వస్తే ముంపు సమస్యలను అధిగమించేందుకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు పెద్దపీట వేశాం. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో 300 కిలోమీటర్లకు పైగా ప్రధాన వరద నీటి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాన్ని చేపట్టాం. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎకో శానిటేషన్ విజన్‌తో అనుసంధానిస్తూ, జీరో డిశ్చార్జ్ ద్రవ వ్యర్థాల నిర్వహణ నమూనాతో వినూత్నమైన 'మ్యాజిక్ డ్రైన్స్'ను పట్టణాల్లో విజయవంతంగా అమలు చేస్తున్నాం. బిందెలు పట్టుకుని బోరింగుల వద్ద బారులు తీరే బాధలను తప్పించాం. అమృత్ 2.0 పథకం ద్వారా 6.8 లక్షల పట్టణ కుటుంబాలకు వ్యక్తిగత పైప్డ్ కుళాయి కనెక్షన్లను అందించాం. పేద కుటుంబాలకు ఉచితంగా తాగునీటి లైఫ్‌లైన్ యాక్సెస్ కల్పిస్తూనే, రోజువారీ మీటర్డ్ నీటి సరఫరాను పారదర్శకంగా ప్రవేశపెట్టాం. గత వైసీపీ ప్రభుత్వం మున్సిపాలిటీలను చెత్తకుండీలుగా మార్చి, చెత్త పన్ను కట్టకపోతే దుకాణాలు, ఇళ్ల ముందే పారబోసి వేధించింది. ఆ ప్రభుత్వం వారసత్వంగా మిగిల్చిన 120 లక్షల టన్నుల చెత్తను శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసి, పర్యావరణానికి ముప్పు లేకుండా యుద్ధప్రాతిపదికన తొలగించాం. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ కృషి ఫలితంగానే జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి నగరాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచి ప్రతిష్ఠాత్మక అవార్డులు గెలుచుకున్నాయి. పట్టణాల్లో రోజూ రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు, కార్మికుల ఆకలి తీర్చడానికి 2019 వరకు ఉన్న అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా మూసేసింది. కూటమి ప్రభుత్వం రాగానే మున్సిపాలిటీల్లోనే 200కు పైగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి, కేవలం రూ.5లకే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని గౌరవంగా అందిస్తున్నాం. గతంలో బల్బులు లేక అంధకారంలో మునిగిపోయిన పట్టణాలకు శాస్త్రీయ పరిష్కారం చూపాం. అత్యాధునిక ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత స్మార్ట్ ఎల్ఈడీ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా వీధి లైట్ వెలగకపోతే ఆటోమేటిక్‌గా మున్సిపల్ కార్యాలయానికి సమాచారం వెళ్లే నిఘా వ్యవస్థను తెచ్చాం. దీనివల్ల 30%కి పైగా విద్యుత్ ఖర్చు ఆదా అవ్వడమే కాకుండా, అర్ధరాత్రి వేళల్లోనూ మహిళలు, పాదచారులు నిర్భయంగా తిరిగేలా వీధులను కాంతిమంతం చేశాం. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు, రాజమండ్రి నుంచి తాడిపత్రి వరకు రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీ ఒకే ఉన్నత ప్రమాణాలతో ఉండాలని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొటోకాల్స్ రూపొందించాం. 2047 నాటికి ప్రతి పట్టణం ఒక 'స్వర్ణ మున్సిపాలిటీ'గా మారేలా పటిష్టమైన బ్లూప్రింట్‌ను సిద్ధం చేశాం. రోడ్లు వేశాం, భూగర్భ డ్రైనేజీలు నిర్మించాం, ప్రతి ఇంటికీ మంచి నీళ్లిచ్చాం, చెత్తను తుడిచిపెట్టాం, అన్న క్యాంటీన్లతో ఆకలి తీర్చాం, ఊరంతా వెలుగులు నింపాం. ఇంత గొప్ప అభివృద్ధిని చేసి చూపిస్తున్నాం కాబట్టే, ఏ సంకోచం లేకుండా గర్వంగా ప్రజల వద్దకు వచ్చి ఓటు అడుగుతున్నాం. రాబోయే స్థానిక ఎన్నికల్లో అభివృద్ధిని కాంక్షించే కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని విజయ్‌కుమార్ పిలుపు ఇచ్చారు.

### సంపద సృష్టి.. పారిశ్రామిక విప్లవం, భారీగా ఉద్యోగాలు

మౌలిక వసతులు ఎంత ముఖ్యమో, అంతిమంగా ప్రజల చేతికి నాలుగు పైసలు అందడం, కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం అంతే ముఖ్యం అని విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ ఆర్థికాభివృద్ధి, పరిశ్రమలు, ఐటీ రంగం, స్వయం ఉపాధి, సంక్షేమ పథకాల అమలు ద్వారా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను సమగ్రంగా వివరించారు. గత రెండేళ్లలో దేశంలో ఏ నగరానికీ రానన్ని దిగ్గజ కంపెనీలు విశాఖపట్నానికి తరలివచ్చాయి. గూగుల్ డేటా సెంటర్లతో పాటు టీసీఎస్, డెలాయిట్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, సత్వ టెక్ పార్క్, యాక్సెంచర్ వంటి ప్రఖ్యాత సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయి. మధురవాడ, రుషికొండ, ఎండాడ ఐటీ పార్కుల్లో వచ్చే ఏడాదిలోగా 50 వేల నుంచి 75 వేల శాశ్వత ఐటీ ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వస్తే అనుబంధంగా కనీసం మరో నలుగురికి శాశ్వత ఉపాధి, క్యాబ్, ఆటో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రిటైల్ వంటి సర్వీస్ సెక్టార్‌లో మరో 4 ఉద్యోగాలు లభిస్తాయి. అంటే ఒక్కో ఉద్యోగం ద్వారా 8 కుటుంబాలకు జీవనోపాధి దక్కుతోంది. భవన నిర్మాణాలు, రవాణా రంగాల ద్వారా వేలాది మంది కార్మికులు, మేస్త్రీలకు పనులు దొరుకుతున్నాయి. మధురవాడ, కొమ్మాది, ఎండాడ పరిసరాల్లో ఇళ్ల అద్దెలు 20–25% పెరిగి, ఆ అద్దెలపై ఆధారపడే వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులకు స్థిరమైన ఆదాయం సమకూరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రాంత సహజ వనరులు, అవకాశాలను గుర్తించి పరిశ్రమలను విస్తరించాం. విజయవాడ – గుంటూరు – అమరావతి బెల్ట్‌లో లాజిస్టిక్స్, మొబిలిటీ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల విస్తరణతో 35,000 పైగా కొత్త పారిశ్రామిక, సేవా రంగ ఉద్యోగాలు... తిరుపతి – చిత్తూరు బెల్ట్ లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, ఎంఎస్ఎంఈ పార్కులతో ఏడాదిలోపు 25,000 పర్మనెంట్ ఉద్యోగాలు... తిరుపతి, రేణిగుంట, పుత్తూరు పరిసరాల్లోని మొబైల్, కంప్యూటర్ల ఫ్యాక్టరీల్లో మహిళలు ఏసీ ప్లాంట్లలో గౌరవప్రదంగా పనిచేసే అనుకూల వాతావరణం కల్పించాం. వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల మహిళలకు స్థానిక ఉపాధి లభిస్తోంది. ఉత్తర కోస్తా, గోదావరి జిల్లాల్లో బయో–ఇథనాల్ ఉత్పత్తిలోనూ, ఆక్వా ఎగుమతుల్లోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. కాకినాడను దేశానికే తలమానికమైన గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాం. కర్నూలు, అనంతపురం జిల్లాలను భారీ సోలార్ పార్కులు, పరికరాల తయారీ కేంద్రాలుగా తీర్చిదిద్ది స్థానిక యువతకు స్థిరమైన ఉపాధి కల్పించాం. పాతికేళ్ల క్రితం చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో వేసిన ఐటీ విత్తనాలే నేడు తెలంగాణకు ఆయువుపట్టయ్యాయి. అదే రీతిన నేడు ఏపీలో ఐదారు ప్రధాన నగరాలను ఆర్థిక చోదక శక్తులుగా తీర్చిదిద్దుతున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. పట్టణాల్లో పెరుగుతున్న ఖర్చుల నుంచి పేద, మధ్యతరగతి గృహిణులకు ఉపశమనం కలిగిస్తూ ఏడాదికి 3 ఉచిత ఎల్పీజీ సిలిండర్ల పంపిణీని మున్సిపాలిటీల్లో దీపం 2.0 ను విజయవంతంగా అమలు చేస్తున్నాం. చేనేత కార్మిక కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ (తరువాయి 12లో..)



చైతన్యరథం

# పొరుగు రాష్ట్రాల రౌడీలతో అరాచకానికి వైసీపీ కుట్రలు

- పుంగనూరు, రాయచోటి, తిరుపతి ఘటనలు ఆ పార్టీ హింసా సంస్కృతికి నిదర్శనం
- శాంతి భద్రతలకు విఘాతం కలిగించి స్థానిక ఎన్నికలు అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ కుయుక్తులు
- రాయలసీమ ఫ్యాక్షన్ రాజకీయాలకు మళ్లీ ప్రాణం పోయాలని చూస్తున్న వైసీపీ
- పోలీసులు, టీడీపీ కార్యకర్తలపై కారు ఎక్కించి ఎంపీ మిథున్ రెడ్డి దుర్మార్గం
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సీఎం చంద్రబాబు సహించబోరు
- టీడీపీ సీనియర్ నేత ఎస్‌వీఎస్ఎన్ వర్మ

అమరావతి (చైతన్యరథం): పుంగనూరు, రాయచోటి, తిరుపతి పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ గూండాలు సృష్టించిన అరాచకాలు, దాడులు ప్రజాస్వామ్యానికే తీవ్ర సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకొస్తుంటే... గొడ్డలి పార్టీ మాత్రం పక్క రాష్ట్రాల నుంచి రౌడీలను రప్పించి రక్తపాతం సృష్టించే కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి, నామినేషన్లు వేయకుండా అడ్డుకుని, అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకోవాలనే దుర్మార్గపు ఆలోచనతోనే వైఎస్సార్సీపీ గూండాలు దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరుగా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేకనే ఈ కుట్రలకు తెరలేపారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ప్రజల పూర్తి మద్దతుతో, సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మా ప్రభుత్వానికి ఇలాంటి దాడులు చేయాల్సిన అవసరం లేదు. దాడులు, బెదిరింపుల సంస్కృతి టీడీపీ రక్తంలోనే లేదు. నాడు స్వర్గీయ ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు నాయుడు వరకు రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని సమూలంగా అంతమొందించి, అభివృద్ధి బాట పట్టించిన ఘనత తెలుగుదేశం పార్టీదే. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చూపేందుకు, మళ్లీ పాత ఫ్యాక్షన్ సంస్కృతిని తెరపైకి తెచ్చి ప్రజలను భయాందోళనలకు గురిచేయాలని గొడ్డలి పార్టీ పథకం రచిస్తోంది. ప్రజాస్వామ్యంలో పోటీ చేయడం ప్రతి పౌరుడి హక్కు. నామినేషన్ వేసే హక్కును కూడా కాలరాయాలని చూడటం దుర్మార్గం. కత్తులు, గొడ్డళ్లు ఝుళిపిస్తే ప్రజలు భయపడతారని, మిమ్మల్ని హీరోలనుకుంటారని భ్రమపడకండి. ప్రజలు చాలా చైతన్యవంతులు. మీ దౌర్జన్యాలకు సమాధానం చెప్పే శక్తిమంతమైన కత్తి ప్రజల దగ్గర 'ఓటు' రూపంలో ఉంది. 2019-24 మధ్య జరిగిన అరాచకాలను, చంద్రబాబు సుపరిపాలనను బేరీజు వేసుకునే ప్రజలు కూటమికి 164 స్థానాలు కట్టబెట్టి, వైఎస్సార్సీపీని 11 సీట్లకు పరిమితం చేసి కర్రుకాల్చి వాత పెట్టారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయి, ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఇప్పటికైనా వైఎస్సార్సీపీ హింసాత్మక రాజకీయాలు మానుకోకపోతే ప్రజలే వారికి శాశ్వతంగా బుద్ధి చెబుతారని వర్మ హెచ్చరించారు.



### అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే వైఎస్సార్సీపీ దాడులకు, అరాచకాలకు పాల్పడుతోందని వర్మ మండిపడ్డారు. ప్రజల్లో తమకు పుట్టగతులు ఉండవనే భయంతోనే బయట వ్యక్తులను తీసుకొచ్చి నామినేషన్లు వేసేవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువనేత నారా లోకేష్ నిరంతర శ్రమతో రాష్ట్రానికి ఏకంగా రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాయలసీమలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కొత్త పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా, ఉద్యానవన (హార్టికల్చర్) రంగానికి పెద్దపీట వేస్తూ పెట్టుబడులు ఆకర్షిస్తున్నారు. గతంలో 'కియా' పరిశ్రమను రాయలసీమకు తెచ్చింది టీడీపీనే. రైతుల పంటలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు వేగంగా పూర్తి చేస్తుండటంతో పాటు, పులివెందులకు తాగునీరు అందించిన ఘనత కూడా మా ప్రభుత్వానిదే. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా జరపాల్సిన ఎన్నికల కమిషన్ విధులను భంగపరచాలనే దురుద్దేశంతోనే వైఎస్సార్సీపీ నేతలు పనిగట్టుకుని దాడులకు దిగుతున్నారు. నాడు జగన్ ఓ దళితుడిని కారుతో తొక్కించగా, నేడు మిథున్ రెడ్డి తన కారుతో పోలీసులు, కార్యకర్తలను తొక్కించి భయపెట్టాలని చూశారు. పెద్ద హోదాలో ఉన్న నాయకులు ఇలాంటి బాధ్యతారాహిత్య ప్రవర్తనను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని గుర్తించాలి. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్యులను, కార్యకర్తలను భయపెట్టే ఇలాంటి దాడులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించరు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుని, లా అండ్ ఆర్డర్‌ను పటిష్టంగా కాపాడతారు. కత్తులు, దౌర్జన్యాలు పక్కనపెట్టి ప్రజాస్వామ్య పద్ధతిలో పోటీ చేయండి. ప్రజల ముందుకు వెళ్లి మీకు ఎందుకు ఓటు వేయాలో ధైర్యంగా చెప్పండి. మీరు చేసే పనుల్లో నిజాయితీ ఉంటే ప్రజలే నిర్ణయిస్తారు. ఎన్నికలంటే ప్రజల ఓటు హక్కు ద్వారా బలాన్ని నిరూపించుకోవడమే తప్ప, గూండాయిజంతో భయపెట్టడం కాదని వర్మ హితవు పలికారు.

### ఎంపీలైనా అనర్హత వేటు తప్పదు

రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు స్థానిక సంస్థలు పటిష్టమైన పునాదుల్లాంటివని, వాటిలో కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వర్మ స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఎక్కడా చిన్న విభేదం కూడా లేకుండా పూర్తి సమన్వయంతో ముందుకు సాగుతుంటే, దాన్ని చూసి ఓర్వలేకనే వైఎస్సార్సీపీ కిరాయి రౌడీలతో దాడులకు తెగబడుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి స్థానిక సంస్థలు అత్యంత కీలకం. టీడీపీ, జనసేన, బీజేపీల కలయిక ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మూడు పార్టీలు ఒకే తాటిపై నిలబడి ఎన్నికల్లోకి వెళ్తున్నాయి. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలే స్వచ్ఛందంగా ఆశీర్వదిస్తున్నారు. అదే సమయంలో హింసను ప్రేరేపించే ఇలాంటి దుర్మార్గపు శక్తులను తరిమికొట్టేందుకు ప్రజలు సమాయత్తమయ్యారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో చట్టం, శాంతిభద్రతలు అత్యంత పటిష్టంగా ఉన్నాయి. కావాలని ఉద్రిక్తతలు సృష్టించి శాంతిభద్రతలను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదు. బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయి. ఎన్నికల ప్రక్రియను, శాంతిభద్రతలను కాపాడుకుంటూ ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయాలతో ముందుకు వెళ్తుంది. రౌడీ మూకలకు, పాత ఫ్యాక్షన్ మనస్తత్వం ఉన్నవారికి ఇకపై రాష్ట్రంలో చోటు లేదు. పొరుగు రాష్ట్రాల నుంచి కిరాయి రౌడీలను తీసుకొచ్చి దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. మీ అరాచకాలు శృతిమించితే ప్రజలే తిరగబడి మిమ్మల్ని నిలదీసే రోజు వస్తుంది. ఆ పరిస్థితి తెచ్చుకోకండి. ప్రజాస్వామ్యబద్ధంగా బరిలో నిలబడి, గతంలో మీరేమైనా మంచి పనులు చేసి ఉంటే వాటిని చెప్పుకుని ప్రజల ఓట్లు అడగండి. రాయలసీమ రూపురేఖలు మారిపోతుండటం చూసి ఓర్వలేక, అసూయతోనే ఎన్నికలను అడ్డుకోవాలనే కుతంత్రంతో వైఎస్సార్సీపీ ఈ దాడులకు పాల్పడుతోంది. మిథున్ రెడ్డి సుమారు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది మంది ప్రజలు ఎన్నుకున్న ఒక పార్లమెంట్ సభ్యుడు అయి ఉండి, కార్లతో కార్యకర్తలను తొక్కించడం, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులపైకి దూసుకెళ్లడం అత్యంత హేయమైన చర్య. పెద్ద పదవుల్లో ఉన్నవారి ప్రవర్తనను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. బయట నుంచి రౌడీలను తెచ్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే... ఎన్నికల నిబంధనలు, చట్టం ప్రకారం ఎంపీలను సైతం పదవుల నుంచి అనర్హులను చేసే నిబంధనలు ఉన్నాయని గుర్తించాలి. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి పెద్ద నాయకులైనా అనర్హత వేటును ఎదుర్కోక తప్పదని వర్మ హెచ్చరించారు.

## కూటమి పాలనలో..

# పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర అభివృద్ధి వెలుగులు

(11వ పేజీ తరువాయి.. )

వారి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాం. ఎన్టీఆర్ భరోసా కింద చేనేత కార్మికుల పెన్షన్లకు పూర్తి భరోసా కల్పించాం. వీధి వ్యాపారులు ఆత్మగౌరవంతో వ్యాపారం చేసుకునేలా డ్రైనేజీ, తాగునీరు, రక్షణతో కూడిన ప్రత్యేక వెండింగ్ జోన్లను ఏర్పాటు చేశాం. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకోకుండా వడ్డీ రాయితీతో బ్యాంక్ రుణాలను అందించాం. పట్టణ స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ రుణాలను పునరుద్ధరించాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టుపని, ఎకో-ప్యాకేజింగ్ వంటి ప్రభుత్వ కొనుగోళ్లలో మెప్మా మహిళలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, అడ్డగోలు పన్నులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వం దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న స్థల వివాదాలను జీవోల ద్వారా క్రమబద్ధీకరించి శాశ్వత ఆస్తి హక్కులు కల్పించింది. దీని ద్వారా పేదలకు బ్యాంక్ రుణాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, వారసత్వ బదిలీలు సులభతరమయ్యాయి. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు బాగుచేయడమే కాకుండా, ప్రజల ఆదాయం పెరిగేలా కంపెనీలు తెచ్చాం, కొలువులు సృష్టించాం, ఇచ్చిన సంక్షేమ హామీలను గడపగడపకూ చేర్చాం. ఈ సర్వతోముఖాభివృద్ధిని చూసి రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

### పట్టణ పేదల ఆత్మగౌరవానికి పెద్దపీట

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైన సందర్భంగా, పట్టణ నిరుపేదలకు కూటమి ప్రభుత్వం కల్పించిన శాశ్వత ఆస్తి హక్కులు, పారదర్శక పౌర సేవలు, పన్నుల భారం తగ్గింపు, స్థానిక సంస్థల ఆర్థిక స్వయంప్రతిపత్తిపై విజయ్‌కుమార్ సమగ్ర వివరాలు తెలియజేశారు. గతంలో పేదలు ఎక్కడ ఇల్లు నిర్మించుకున్నా 'ఎప్పుడు బుల్డోజర్ వచ్చి కూల్చేస్తుందో' అనే ప్రాణభయంతో బతికేవారు. నాడు సొంత ఇంటి ఎదురుగా పేదలు ఉండకూడదని పేదల ఇళ్లను కూల్చేసిన దుర్మార్గమైన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది. కానీ కూటమి ప్రభుత్వం పేదల ఆత్మగౌరవానికి పెద్దపీట వేసింది. కొండ పైన ఉన్నా, కొండ కింద ఉన్నా, కాలువ గట్ల వెంట ఉన్నా... పేదలు ఎక్కడ నివసిస్తుంటే అక్కడే క్రమబద్ధీకరించి శాశ్వత పట్టాలు అందించాం. పైసా ఖర్చు లేకుండా, పూర్తి స్టాంప్ డ్యూటీని ప్రభుత్వమే మినహాయించి, నేరుగా వారి ఇంటికే వచ్చి శాశ్వత హక్కు పత్రాలు అందజేశాం. గ్రేటర్ విశాఖపట్నంలో 45,000 మందికి, విజయవాడలో 30,000 మందికి, తిరుపతి సహా రాయలసీమ మున్సిపాలిటీల్లో 18,000 మందికి, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించాం. గత ప్రభుత్వం అటకెక్కించిన టిడ్కో ఇళ్లను పునరుద్ధరించి, మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేసి దాదాపు 1,80,000 గృహాలను లబ్ధిదారులకు అందజేశాం. పారిశుద్ధ్య కార్మికులు, రోజువారీ కూలీలకు సొంతింటి కలను నిజం చేశాం. గృహ నిర్మాణంలో అత్యాధునిక 3 డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీని వినియోగిస్తూ, లోపల సహజంగానే చల్లగా ఉండే పర్యావరణహిత ఇళ్లను నిర్మిస్తున్నాం. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడే ఉండకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. మున్సిపల్ కార్యాలయాల్లో గతంలో ఉన్న బల్ల కింద చేతులు పెట్టే లంచాల సంస్కృతికి, దళారులు-బ్రోకర్ల వ్యవస్థకు చరమగీతం పాడాం. భవన నిర్మాణ అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు అన్నీ మానవ ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ సింగిల్ విండో పోర్టల్ ద్వారా త్వరితగతిన లభించేలా ఏర్పాట్లు చేశాం. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే బాధలను తప్పించామని విజయ్‌కుమార్ తెలిపారు.

### పన్నుల భారాల నుంచి భారీ ఊరట

వైసీపీ హయాంలో తీసుకొచ్చిన జీవో 198, 199ల వల్ల క్యాపిటల్ వ్యాల్యూ మోడల్ పేరుతో ఏటా 15% వరకు చక్రవడ్డీ తరహాలో పన్నులు పెంచి, ఆస్తి పన్ను భారాన్ని 80% నుంచి 130% వరకు పెంచేశారు. చిన్న వ్యాపారులపై 100% జరిమానాలు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సొంత నివాస గృహాలకు 40% ఏఆర్‌వీ మినహాయింపును ఇచ్చాం. ముందుస్తుగా పన్ను చెల్లించే వారికి 5% రాయితీ కల్పించాం. పేద, మధ్యతరగతి వారు కష్టపడి దాచుకున్న ఖాళీ స్థలాలపై గత ప్రభుత్వం వేసిన వేకెంట్ ల్యాండ్ టాక్స్ ని ఏకంగా 50% తగ్గించి భారీ ఊరటనిచ్చాం. 73, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం కేంద్ర ఆర్థిక సంఘం (14, 15వ) స్థానిక సంస్థల కోసం పంపిన రూ. 8,600 కోట్లకు పైగా గ్రాంట్లను గత వైసీపీ ప్రభుత్వం అక్రమంగా సింగిల్ నోడల్ ఖాతాలకు మళ్లించి తన సొంత ఖజానాకు వాడుకుంది. స్థానిక సంస్థల ఖాతాలను 'జీరో బ్యాలెన్స్' చేసి, కనీసం కార్మికులకు జీతాలు, పెన్షన్లు కూడా ఇవ్వలేని దయనీయ స్థితికి తెచ్చింది. కూటమి ప్రభుత్వం రాగానే మున్సిపాలిటీలకు సంపూర్ణ ఆర్థిక స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించింది. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇప్పుడు రాష్ట్ర జోక్యం లేకుండా నేరుగా మున్సిపాలిటీల ఖాతాల్లోకే జమవుతున్నాయి. దీంతో కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు అందుతున్నాయి. కేంద్ర మద్దతుతో 123 పట్టణ స్థానిక సంస్థలను మున్సిపల్ షేర్డ్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆధునీకరిస్తున్నాం. స్థానిక నాయకత్వం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలతో సమన్వయంతో పనిచేసినప్పుడే మన వీధి, మన డ్రైనేజీ, మన పార్కు, మన మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతాయి. కూటమి అభ్యర్థులైన మేయర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపిస్తేనే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే అభివృద్ధి నిధులు నేరుగా మీ వార్డుకు అందుతాయి. గత 30 నెలల్లో మేము చేసిన ప్రగతిని, పాత దుష్టపాలన తెచ్చిన నష్టాన్ని ఒకసారి బేరీజు వేసుకోండి. గతంలో కంటే ద్విగుణీకృత ఉత్సాహంతో రాబోయే మూడేళ్లలో స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పనిచేస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

# అమరావతిలో పెట్టుబడులకు అపార అవకాశాలు

**రాష్ట్ర జీడీపీలో 35 శాతం వాటా కలిగిన ప్రాంతం.. 46 ప్రాజెక్టుల పనులు, 26 ఎంఎస్ఎంఈలకు 480 ఎకరాల కేటాయింపు**




గుంటూరు (చైతన్యరథం): అమరావతి ప్రాంతాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ తెలిపారు. రాష్ట్ర జీడీపీలో 35 శాతం వాటా కలిగిన తొమ్మిది జిల్లాల ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2030, 2035, 2047 అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సుస్థిర, సమ్మిళిత వృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు.

ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన 46 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని, 26 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 480 ఎకరాలు కేటాయించినట్లు రావత్ వెల్లడించారు. మచిలీపట్నం పోర్టు అనుసంధానం, ప్రకాశం జిల్లాలో బీపీసీఎల్ రిఫైనరీ, దోనేపూడిలో భారత్ డైనమిక్స్ సంస్థ యూనిట్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులతో పారిశ్రామిక రంగానికి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పర్యాటక రంగంలోనూ పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ అమరావతి ప్రాంతం రాష్ట్ర ప్రధాన ఆర్థిక అభివృద్ధి కేంద్రంగా ఎదగనుందని అన్నారు. హైస్పీడ్ రైళ్లు, సమీకృత మౌలిక సదుపాయాలతో పాటు పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ పోర్టులు, షిప్‌బిల్డింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయని వివరించారు.

సీఐఐ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ శరణం, ఐటీసీ అగ్రి బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాహుల్ గౌరహ, పీఐ డేటా సెంటర్స్ సీఈఓ కళ్యాణ్ ముప్పనేని రాష్ట్రంలో సహజ వనరులు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యాలను సమర్థంగా వినియోగించుకుంటే పెట్టుబడులు, ఎగుమతులకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. రైతులకు డిజిటల్, భౌతిక సేవల సమన్వయంతో వ్యవసాయ సలహాలు, ఉత్పత్తుల విక్రయ సదుపాయాలు అందిస్తున్నట్లు ఐటీసీ ప్రతినిధి వివరించారు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ సమాజాల బలోపేతానికి సంస్థ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సదస్సులో ప్రభుత్వం, పెట్టుబడిదారుల మధ్య ఒప్పంద పత్రాలు కుదిరాయి. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, రవాణా శాఖ కార్యదర్శి కోన శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ విజయ రామరాజు, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ షన్ మోహన్, జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## హజ్-2027 యాత్రికుల ఎంబార్కేషన్ పాయింట్ల మార్పునకు వినతి

**11 మంది యాత్రికుల అభ్యర్థనలను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా దృష్టికి తీసుకెళ్లిన చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా**



విజయవాడ (చైతన్యరథం): హజ్–2027 యాత్రకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 మంది యాత్రికుల ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని, వారి ఎంబార్కేషన్ పాయింట్ల మార్పునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా చొరవ తీసుకున్నారు. ఈ మేరకు యాత్రికులు సమర్పించిన వినతులను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

యాత్రికుల అభ్యర్థనల ప్రకారం హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు, చెన్నై నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి బెంగళూరుకు ఎంబార్కేషన్ పాయింట్ల మార్పు కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జఋూ షానవాస్ సి. (IAS), డిప్యూటీ జఋూ (ఆపరేషన్స్) మహమ్మద్ నియాజ్ అహ్మద్‌లతో చైర్మన్ సంప్రదించి, యాత్రికుల వ్యక్తిగత అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు మక్కా, మదీనాలో మెరుగైన వసతి, భోజనం, రవాణా తదితర సౌకర్యాలు కల్పించాలని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారులను కోరారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర హజ్ కమిటీ కార్యక్రమాలకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్‌లకు హాజీ షేక్ హసన్ బాషా కృతజ్ఞతలు తెలిపారు.

# మానవత్వానికి నిలువెత్తు రూపం ఎన్టీఆర్ ట్రస్ట్

NTR TRUST
WE *WORK* THE TALK!

సమాజం పట్ల బాధ్యత, కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వాలనే తపన ఉన్నప్పుడే స్వచ్ఛంద సంస్థల సేవలు సమాజంలో గణనీయమైన మార్పు తీసుకురాగలవని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మరోసారి నిరూపించింది. సేవే లక్ష్యంగా, మానవత్వమే మార్గంగా ముందుకు సాగుతున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం. విజయవాడలో నూతనంగా ఏర్పాటైన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనం, అత్యాధునిక 'బ్లడ్ సెంటర్' ప్రారంభోత్సవం ఆరోగ్య సంరక్షణ రంగంలోను, సామాజిక సేవా రంగంలోను ఒక చారిత్రాత్మక మైలురాయి. ఒక మనిషి ప్రాణాన్ని నిలబెట్టినప్పుడు కలిగే ఆత్మసంతృప్తికి ఏవీ సాటిరావు. కన్నుమూసే క్షణాల్లో ఉన్నవారికి రక్తపు బొట్టు అందితే అది అమృతమవుతుంది. ఒక యూనిట్ రక్తం ఒక ప్రాణానికి భరోసా. ఒక ప్రాణం నిలిస్తే ఒక కుటుంబానికి వెలుగు. ఇంతటి మహత్తరమైన మానవీయ బాధ్యతను సేవా యజ్ఞంగా మలుచుకున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మరో చారిత్రక అడుగు వేసింది. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ గాలిలో కలిసిపోకూడదన్న సంకల్పంతో విజయవాడలో నూతన బ్లడ్ సెంటర్‌ను ప్రారంభించడం సేవా ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం. ఇప్పటికే లక్షలాది మందికి రక్తాన్ని అందించి వేలాది కుటుంబాల్లో ఆశలు చిగురింపజేసిన ఈ సంస్థ విజయవాడలో అత్యాధునిక బ్లడ్ సెంటర్‌ను ప్రారంభించడం సామాజిక సేవా రంగంలో మరో మైలురాయి. రక్తం దొరక్క ఒక్క ప్రాణం కూడా పోకూడదనే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రారంభించిన బ్లడ్ బ్యాంకులు దశాబ్దాలుగా ఎంతో మందికి పునర్జన్మ ఇచ్చాయి.

ఇప్పటివరకు ఈ సంస్థ ద్వారా ఏకంగా 9.5 లక్షల మందికి అత్యవసర సమయాల్లో రక్తం అందించడం సామాన్యమైన విషయం కాదు. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు..జ 9.5 లక్షల కుటుంబాల్లో నిండిన వెలుగు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మనిషికి సకాలంలో రక్తం అందించడం అంటే అతనికి పునర్జన్మ ప్రసాదించడమే. ప్రమాదాలు, అత్యవసర శస్త్ర చికిత్సలు, ప్రసవ సమయాల్లో రక్తం అవసరమైన వారికి అండగా నిలవడం కేవలం వైద్య సేవ మాత్రమే కాదు. అది మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ముఖ్యంగా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతూ తరచూ రక్తమార్పిడి చేయించుకోవాల్సిన చిన్నారులకు రక్తం అందించడం నిరంతర సేవా యజ్ఞం. ఇటువంటి ఆపత్కాలంలో ఆపన్నులకు అండగా నిలవాలన్న సంకల్పంతో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తోంది. విజయవాడలో నూతన బ్లడ్ సెంటర్ ప్రారంభం ఈ దిశగా మరో ముందడుగు. సమాజం నుంచి పొందిన దానిని తిరిగి సమాజానికే అందించడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్న మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి సందేశం సేవాభావానికి ప్రతీకగా నిలుస్తోంది. రక్తం అవసరమైన వారికి చేయూతనివ్వడం, తలసేమియా బాధితులకు అండగా ఉండడం, మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాలతో ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు మానవీయ బాధ్యతను గుర్తు చేస్తున్నాయి. కష్టకాలంలో ఒక మనిషికి మరో మనిషి అండగా నిలవాలన్న ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ ఆచరణ రూపం దాల్చినప్పుడే ఆరోగ్యవంతమైన, సానుభూతితో నిండిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

క్రమం తప్పకుండా రక్తం మార్చాల్సిన తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఉచితంగా 26వేల యూనిట్ల రక్తాన్ని అందించడం ట్రస్ట్ మానవీయ కోణాన్ని చాటిచెప్తోంది. విజయవాడలో కొత్తగా బ్లడ్ సెంటర్ ప్రారంభించడమే కాకుండా, త్వరలోనే ఇక్కడ తలసేమియా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రకటించడం హర్షణీయం. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని వందలాది మంది తలసేమియా బాధిత చిన్నారులకు ప్రాణ రక్షణతో పాటు నాణ్యమైన చికిత్స లభిస్తుంది. రాయలసీమ ప్రాంత అవసరాలను గుర్తించి నెల రోజుల్లో అనంతపురంలో రక్తనిధి కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పడం వెనుకబడిన ప్రాంతాల్లో వైద్య సౌభ్యాల విస్తరణకు ఎంతో దోహదపడుతుంది. ఇప్పటికే లక్షలాది మందికి రక్తాన్ని అందించి, తలసేమియా మహమ్మారితో నిరంతరం పోరాడుతున్న చిన్నారులకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ ఇప్పుడు మరింత విస్తృతంగా సేవలందించేందుకు సిద్ధమవుతోంది. మానవత్వానికి కులం లేదు.. మతం లేదు.. ప్రాంతీయ భేదాలు లేవు. ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలన్న తపన ఒక్కటే దానికి చిరునామా. ఆ రక్తంతో నిలిచేది ఒక కుటుంబం ఆశ, ఒక తల్లి నమ్మకం, ఒక చిన్నారి భవిష్యత్తు. ఇలాంటి సేవా సంకల్పాలు మరిన్ని సంస్థలకు స్ఫూర్తిగా నిలిచినప్పుడే.. రక్తం కోసం ఏ ప్రాణమూ ఎదురుచూడని, ఆపదలో ఏ కుటుంబమూ ఒంటరిగా మిగలనటువంటి మానవీయ సమాజం సాకారమవుతుంది. ప్రభుత్వాల సేవలకు తోడుగా ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చినప్పుడే ఆరోగ్యవంతమైన, సమ్మిళిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. విజయవాడలో ప్రారంభమైన ఈ బ్లడ్ సెంటర్, రాబోయే తలసేమియా కేర్ సెంటర్ అనేక మందికి ఆశాదీపంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. రక్తం దానంతో ప్రాణాలు నిలబడతాయి, కుటుంబాలు నిలుస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల రోగులు రక్తదాతల అమూల్య సేవలతో ప్రాణాలను నిలుపుకుంటున్నారు. రక్త ఉత్పత్తులను దానం చేసే వారి కొరత మన దేశంలో బాగా వుంది. 18 నుంచి 65 ఏళ్ల వయసు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా రక్తదానం చేయవచ్చు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పురుషులు, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మహిళలు రక్తదానం చేయవచ్చు. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి వెయ్యి మందిలో 33మంది రక్తదానం చేస్తుండగా, భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నలుగురు మాత్రమే రక్తదానానికి ముందుకు వస్తున్నారు. ప్రభుత్వాలు, బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవకులు, ఉన్నత విద్యా సంస్థలు అన్నీ కలిసికట్టుగా యువతలో రక్తదానంపై విస్తృత అవగాహన కల్పించాలి.

**- నీరుకొండ ప్రసాద్**

# వ్యూహాత్మకంగా వెళ్దాం... ప్రతి స్థానమూ గెలుద్దాం!

## కూటమి పార్టీల సమన్వయ సమావేశంలో టీడీపీ అరకు ఇంచార్జ్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర



అరకు (చైతన్యరథం): అన్ని పార్టీలను సమన్వయం చేసుకుంటూ.. స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానమూ గెలిచేలా అత్యంత వ్యూహాత్మకంగా వెళ్లాలని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. అరకు వేలిలోని కూటమి పార్టీల సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు పేరాబత్తుల రాజశేఖరం, బుద్ధ నాగ జగదీష్‌లు హాజరైన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొన్ను దొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎంత సమన్వయంగా పనిచేస్తుందో అరకు నియోజకవర్గంలో కూడా అంతే సమన్వయంతో పని చేయాలన్నారు. ఏ స్థానంలో ఏ అభ్యర్థిని బరిలో దించితే గెలిచే అవకాశాలు ఉన్నాయో చూసుకొని పోటీలో నిలపాలని సూచించారు. జనసేన, బిజెపి తెలుగుదేశం పార్టీ సమన్వయం చేసుకుంటూ ఏ పార్టీకి అత్యధిక ఓట్లు వచ్చే అవకాశం ఉందో ఏ అభ్యర్థికి ప్రజలు అనుకూలంగా ఉంటారో మూడు పార్టీల నేతలు చర్చించుకొని ఒక అభ్యర్థిని సూచించి ఆయననే అక్కడ పోటీలో నిలిపి ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. మనలో మనం కొట్టుకునే ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దన్నారు. వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని నిజంగా గెలుస్తామనుకున్న స్థానాలను మాత్రమే బిజెపి జనసేన పార్టీలు సూచించాలన్నారు. తాము ఎన్ని స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయామని అపవాది కంటే పోటీ చేసిన ప్రతి స్థానంలో గెలిచి తమ సత్తాను చాటుకునేలా ఈ ఎన్నికలు ఉండాలన్నారు. పవన్ కళ్యాణ్, మాధవ్ సూచించిన ఆదేశాలను జనసేన బిజెపి పాటిస్తూ చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ ఆదేశాలను కూడా కార్యకర్తలు నాయకులు పాటించాలని సూచించారు.



# టీడీపీలోకి భారీగా వలసలు

అమలాపురం (చైతన్యరథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పాలన, వేగవంతమైన అభివృద్ధికి ఆకర్షితులై విభిన్న వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ వైపు వస్తున్నారని రాజ్య సభ ఎంపీ సానా సతీష్ బాబు, అమలాపురం శాసనసభ్యులు ఐతాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అల్లవరం మండలం గూడాల గ్రామంలోని మట్టపర్తివారిపాలెంలో, గూడాల టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పంపిరెడ్డి కాశీ ఆధ్వర్యంలో ఎస్సీ, బిసి వర్గాలకు చెందిన పలువురు నాయకులు, మహిళలు మరియు యువకులు భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజ్య సభ ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు.

సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలన విజన్ వల్లే ఈరోజు ప్రతి గ్రామంలోనూ ప్రజలు కూటమి ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో ఉన్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధికి తాము నిరంతరం కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు గారి సంక్షేమ పాలన, చేస్తున్న అభివృద్ధే ఈ చేరికలకు కారణమని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని, పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం దక్కుతుందని సానా సతీష్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని 100 శాతం స్ట్రైక్ రేట్ తో గెలిపించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి బహుమతిగా ఇవ్వాలని రాజ్యసభ ఎంపీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చెరుకూరి సాయిరాం, పెచ్చేటి విజయలక్ష్మి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, నియోజకవర్గ పరిశీలకులు వనమాడి సుస్మిత, చిక్కాల గణేష్, అధికారి జయ వెంకట లక్ష్మి, బొర్రా ఈశ్వరరావు, మాకిరెడ్డి వెంకట సత్య పూర్ణిమ, దేసినేడి శ్రీనివాసరావు, కర్రి రామస్వామి, క్షత్రియ కార్పొరేషన్ నాయకులు సత్తిబాబు రాజు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సుపరిపాలన ప్రజలను ఆకర్షిస్తోంది

## ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వెల్లడి

అల్లవరం (చైతన్యరథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలు టిడిపిలోకి చేరేందుకు వరుస కడుతున్నారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడాల గ్రామంలోని మట్టపర్తివారిపాలెంలో శుక్రవారం సుమారు వందమంది వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. అల్లవరం మండలం టిడిపి అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు ఆధ్వర్యంలో గుడాల గ్రామ కమిటీ అధ్యక్షుడు పంపిరెడ్డి కాశీ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది..

నూతనంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి గంధం పల్లంరాజు, టిడిపి అధ్యక్షుడు సత్తిబాబు రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం అన్నిటికంటే ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్ల ఉన్న నమ్మకంతో ప్రజలు టిడిపి వైపు చూస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేయడంతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. దీంతో అనేకమంది ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పల్లంరాజు మాట్లాడుతూ వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అందుకే కూటమిపాలనకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారని, పార్టీను మరింత బలోపేతం దిశగా అల్లవరం టిడిపి అధ్యక్ష, కార్యవర్గం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. అల్లవరం టీడీపీ అధ్యక్షుడు సత్తిబాబు రాజు మాట్లాడుతూ అల్లవరం మండలంలో ఇప్పటికే కొమరగిరిపట్నం, తూర్పులంక గ్రామాలలో అనేకమంది టిడిపిలోకి చేరారని, తాజాగా గూడాల గ్రామంలో 100 మంది వరకు పార్టీలో చేరడం చంద్రబాబు పై ఉన్న నమ్మకం, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి తార్కానంగా నిలుస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో అల్లవరం మండలం నుంచి అధిక సంఖ్యలో టిడిపిలోకి చేరనున్నారని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, సహకార సంఘ అధ్యక్షుడు పోలిశెట్టి భాస్కరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడు పశ్చిమ ఏడుకొండలు, పోలిశెట్టి నాయుడు, తాటికాయల సుధీర్, బొలిశెట్టి వెంకటేశ్వరావు, బొలిశెట్టి రేణు, ఆకుల తాతారావు, మట్టపర్తి కుమార్, మట్టపర్తి నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.





# విపక్ష వ్యూహాలపై అప్రమత్తంగా ఉండాలి

## ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ రావు పిలుపు

ఒంగోలు ( చైతన్యరథం): నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ఎన్నికల కార్యాచరణను పటిష్టంగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని డివిజన్ల వారీగా పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రతి క్లస్టర్‌కు ముగ్గురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలు తమ పరిధిలోని డివిజన్లలో పార్టీ పరిస్థితులను సమీక్షిస్తూ, కూటమి పార్టీల నాయకులతో, స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లనున్నాయి. సమన్వయ కమిటీలు ప్రధానంగా డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో సమన్వయం చేయడం, పార్టీ గెలుపునకు అనుకూలమైన పరిస్థితులను అంచనా వేయడం, స్థానికంగా ప్రజాదరణ కలిగిన నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి బాధ్యతలను అదేవిధంగా పార్టీ తరఫున టికెట్ ఆశించి అవకాశం లభించని నాయకులు, ఆశావహులను సమన్వయ కమిటీ సభ్యులు కలిసి బుజ్జగించాలని, వారందరినీ పార్టీ ఐక్యతలో భాగస్వాములను చేసి సమష్టిగా పనిచేసేలా చూడాలని ఎమ్మెల్యే జనార్దన్ గారు సూచించారు. వ్యక్తిగత అభిప్రాయ భేదాలకు తావివ్వకుండా, పార్టీ ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసేలా కమిటీలు కీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా సమన్వయ కమిటీలు పర్యవేక్షిస్తూ, డివిజన్ల వారీగా ప్రచార ప్రణాళికలను రూపొందించడం, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రజల్లోకి పార్టీ విధానాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తూ, తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషితో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలని పిలుపునిచ్చారు.





# దుర్గమ్మ సన్నిధిలో ఎంపీ కేశినేని చిన్ని దంపతులు



## భక్తులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలు, క్యూ లైన్లలో వేచి ఉండే సమయంపై ఆరా



విజయవాడ (చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎంపీ కేశినేనికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఎంపీ కేశినేని చిన్ని స్వయంగా పరిశీలించారు. క్యూ లైన్లలో వెళ్తున్న భక్తులతో నేరుగా మాట్లాడి, దర్శనానికి ఎంత సమయం పడుతోంది, భక్తులకు అవసరమైన సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు అందించాలని సూచించారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు అందుబాటులో ఉండేలా పరిశీలించడంతో పాటు, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించారు. వారికి స్వయంగా వేడి పాలు అందించి ఆప్యాయతను చాటుకున్నారు. భక్తుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీ కేశినేని చిన్ని సందర్శించారు. అక్కడ భక్తులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు తక్షణ వైద్య సహాయం అందేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో చర్చించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని, క్యూ లైన్ల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా వేద పాఠ్యాంశాలను అభ్యసిస్తున్న చిన్నారులతో ఎంపీ కేశినేని చిన్ని సరదాగా ముచ్చటించారు. వారు నేర్చుకుంటున్న వేద విద్య, అధ్యయన వివరాలను అడిగి తెలుసుకుని, చిన్నారులతో ఆప్యాయంగా గడిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన సౌకర్యాలు, సురక్షితమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఆలయంలో అందుతున్న సేవలు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను ఎంపీ కేశినేని చిన్ని స్వయంగా పరిశీలించడం విశేషం.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

## నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పిలుపు

పెదకూరపాడు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పార్టీ నాయకులతో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల కార్యాచరణ, అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం వంటి అంశాలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయం, క్రమశిక్షణ, సమష్టి కృషితో ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ జానీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నా సాంబశివరెడ్డి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.






# ముదునూరు నాయకులతో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆత్మీయ భేటీ

పెనమలూరు (చైతన్యరథం): టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ, తెలుగుదేశం పార్టీ అభివృద్ధి ప్రస్థానాన్ని గ్రామస్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ముందుకు సాగుతున్నారు.

పోరంకిలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముదునూరు గ్రామానికి చెందిన ముఖ్య నాయకులతో నిర్వహించిన ఆత్మీయ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొని వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.

ఈ సందర్భంగా గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి పనుల పురోగతి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం వంటి కీలక అంశాలపై నాయకులతో సమాలోచనలు జరిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ,వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని బోడే ప్రసాద్ సూచించారు.





# తెలుగుదేశం పార్టీలోకి భారీగా వైసిపీ వలసలు

## కండువా కప్పి ఆహ్వానించిన టీడీపీ యువనాయకుడు బొండా రవితేజ

విజయవాడ (చైతన్య రథం): విజయవాడ సింగ్ నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడి కార్యాలయంలో 73వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన వైసిపి నాయకులు ఎస్కే చాంద్‌బీ, హసీనా, మాబు, సాయి, వెంకట్, వీ శ్రీను, కోలా విజయ, జాన్ బాషా అనుచరులతో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో 200 మంది చేరారు.

ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వం, ప్రజల కోసం ఆయన చేస్తున్న కృషి, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతో తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారని వెల్లడించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కృషి చేస్తున్నారని, ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించడం తమకు నమ్మకాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాలు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి అందుబాటులో ఉంటూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు, కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. 73వ డివిజన్‌లో సుమారు 200 మంది టీడీపీలో చేరడం ద్వారా స్థానికంగా పార్టీ కార్యకలాపాల్లో కొత్త ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాగవంస కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, డివిజన్ అధ్యక్షులు నాని కబీర్,నాని నాగుర్, ఇమ్మానుయేల్, అప్పలనాయుడు, తిరుపతి, నాని, వేణు, గులివిందల లీలావతి, సరోజినీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరులో వైసీపీకి చావుదెబ్బ



గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ హారూన్ రషీద్‌ను ఈ రోజు ఉదయం బెదిరింపులతో, బలవంతంగా వైసీపీ కండువా కప్పి, టీడీపీ నుంచి వైసీపీలో చేరినట్లు ప్రచారం చేశారు. అసలు విషయం తెలుసుకున్న అనంతరం, ముత్తుముల క్రిష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన తిరిగి టీడీపీలో చేరారు. గిద్దలూరులో వైసీపీ చేస్తున్న చిల్లర రాజకీయాలకు ప్రజలే సరైన సమాధానం చెబుతారని ముత్తుముల పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపులకు, బలవంతపు రాజకీయాలకు స్థానం లేదన్నారు.

# ఎంపీ మిథున్ రెడ్డిని జిల్లా నుండి బహిష్కరించాలి

## కూటమి ప్రభుత్వానికి మిన్నల్ రవి డాక్టర్ ఉమేష్ రావు విజ్ఞప్తి

విజయవాడ (చైతన్యరథం): బాధ్యత కలిగిన ఎంపీ స్థానంలో ఉన్న మిథున్ రెడ్డి చేసిన అతికిరాతకమైన, భయంకరపు అరాచకపు చేష్టలను చూసి సభ్య సమాజం అసహ్యించుకుంటున్నదని, పుంగనూరు, పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందుబాటులో ఉండాలంటే, మిథున్ రెడ్డిని తక్షణమే జిల్లా నుండి బహిష్కరించాలని వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి మర తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ మేష్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, దీనిలో భాగంగా పుంగనూరు నియోజకవర్గ పరిధిలో నామినేషన్లు వేయడానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులపై ఎంపి మిథున్ రెడ్డి అతని కిరాయి గూండాలతో వచ్చి అత్యంత పాశవికంగా దాడులకు తెగబడి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను తమ వాహనాలతో తొక్కి చంపేయడానికి ప్రయత్నించిన దురాగతాలను అత్యంత పాశవిక చర్యలుగా తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఆరోపించారు. గత మూడు దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలలో ఆటవిక మనుషుల లాగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేస్తూ, ప్రజలు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా చేసి, రౌడీ మూకలతో రిగ్గింగ్ చేసుకొని గెలిచే పెద్దిరెడ్డి కుటుంబ చరిత్ర మొత్తం పిరికితనంతో నిండి పోయిందని ఆరోపించారు. పక్కన ఉన్న కర్ణాటక నుండి రౌడీ మూకలకు మద్యం త్రాగించి, టీడీపీ నాయకులపై అత్యంత కిరాతకంగా దాడి చేయించాడని, ఇది మొత్తం జగన్ ఆదేశాల మేరకు ఎన్నికల వేళ రక్తం పారించి, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేయడానికి చేసే ప్రయత్నమని ఆరోపించారు. ఎంపి మిథున్ రెడ్డి తన ఎస్కార్ట్ వాహనంతో చేసిన భీభత్సానికి, కత్తులు, బరిసెలతో గూండాలు చేసిన దాడులకు ప్రణాళిక, నిర్దేశకత్వం మొత్తం హింసా రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన వైసిపి అధినేత జగన్ రెడ్డే అని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా, ఈరోజు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి ముందుకు వచ్చి, దాడులకు గురైన తెలుగుదేశం పార్టీ, జనసేన మరియు భారతీయ జనతా పార్టీ కార్యకర్తల శరీరాల నుండి కారే ప్రతీ రక్తపు బొట్టుకు తగిన విధంగా సమాధానం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, తిరుపతి పార్లమెంటు నాయకులు పూల శేఖర్, శంకరయ్య, గంగనపల్లి రమేష్, సులేమాన్, లోకేష్ పాల్గొన్నారు.







# ఎంబార్కేషన్ పాయింట్ల మార్పు కోసం హజ్ యాత్రికుల వినతి

విజయవాడ (చైతన్యరథం): హజ్ 2027 యాత్రకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 11 మంది యాత్రికులు తమ ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఎంబార్కేషన్ పాయింట్ల మార్పు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా గారికి, అలాగే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎల్. అబ్దుల్ ఖాదిర్‌కు వినతులు సమర్పించారు. యాత్రికుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న హాజీ షేక్ హసన్ బాషా స్వయంగా చొరవ తీసుకుని, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై అధికారులు సీఈఓ షానవాస్ డిప్యూటీ సీఈవో (ఆపరేషన్స్) మహమ్మద్ నియాజ్ అహ్మద్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, ఎంబార్కేషన్ పాయింట్ల మార్పునకు తగిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. యాత్రికుల అభ్యర్థన మేరకు, గతంలో హైదరాబాద్‌ను ఎంచుకున్న కొందరు యాత్రికులు విజయవాడకు, విజయవాడను ఎంచుకున్న మరికొందరు హైదరాబాద్‌కు తమ ఎంబార్కేషన్ పాయింట్లను మార్చుకోవాలని కోరారు. అదేవిధంగా, చెన్నై నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి బెంగళూరుకు మార్పు కోరిన యాత్రికుల అభ్యర్థనలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యాత్రికుల ప్రయాణ సౌకర్యాలు, వ్యక్తిగత అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వారి అభ్యర్థనలను పరిశీలించి తగిన అనుమతులు మంజూరు చేయాలని హజ్ కమిటీ ఆఫ్ ఇండియాను కోరారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హజ్ 2027 యాత్రకు వెళ్లే యాత్రికులకు పవిత్ర నగరాలైన మక్కా, మదీనాలో మెరుగైన వసతి, భోజనం, రవాణా, ఇతర అవసరమైన సౌకర్యాలు సముచితంగా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా గారు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారులను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికుల సౌకర్యాలు, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్ర హజ్ కమిటీ కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ హాజీ షేక్ హసన్ బాషా కృతజ్ఞతలు తెలిపారు.

# వైసీపీ హింసా రాజకీయాలను ప్రజలే తిప్పికొడతారు

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత జగన్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం దివాళా తీసిందని, దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం విస్తృతంగా జరుగుతోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకి విఘాధం కలిగించాలని జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎన్నికలు పెట్టకుండా వైసీపీ రెండేళ్లు అప్పట్లో వాయిదా వేసిందని, స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకోవాలని కోర్టులని వైసీపీ ఆశ్రయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో దౌర్జన్యం చేయాలని జగన్ చూస్తున్నారని పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో నామినేషన్ తొలిరోజే వైసీపీ అరాచకాలు చేసి తన వైఖరి బయటపెట్టిందన్నారు. మిధున్ రెడ్డి వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. కొట్టుకుంటూ, తొక్కుకుంటూ పోవాలి అని అన్నాడు. పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే ఊరుకునేది లేదు. ప్రజల్లోకి వెళదాం, అక్కడ తేల్చుకుందామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సవాలు విసిరారు. స్థానిక ఎన్నికల్లో వైసీపీ గెలిచే పనిలేదనుకుంటున్నారన్నారు. ఒకదగ్గరో రెండు దగ్గరలో గెలిచినా లాభం లేదని ప్రజలు అనుకుంటున్నారని, నష్టం తప్ప, వైసిపి వల్ల లాభం లేదు అని ప్రజలు అంటున్నారని వెల్లడించారు. ఐటీడీపీ వ్యక్తులను ఇవాళ వైసీపీ నేతలు బెదిరించారన్నారు. అధికారంలో ఉన్నామని వైసీపీ ఇంకా అనుకుంటుందన్నారు. పిచ్చి పిచ్చి చేష్టలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిష్పక్షపాతంగా పోలీసులు వ్యవహరించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మళ్ళీ వైసీపీ వచ్చే ప్రసక్తే లేదన్నారు. స్వేచ్ఛగా అధికారులు ఎన్నికలు జరపాలని పోలీసులను కోరారు. నెల్లూరు కార్పొరేషన్‌లో టీడీపీ కూటమి మేయర్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీ తో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. 72కి 72 డివిజన్లలో వందశాతం కార్పొరేటర్లు గెలుస్తారన్నారు. చరిత్ర ఎరుగని అభివృద్ధి నెల్లూరులో జరుగుతోందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌లో వైసీపీ దౌర్జన్యాలకి పాల్పడితే టీడీపీ కార్యకర్తలెవరూ భయపడవద్దని తానున్నానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి భరోసానిచ్చారు.

# కూటమిలోకి సన్నపురెడ్డి పెంచలరెడ్డి సోదరులు

## ఆహ్వానించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): వైఎస్ఆర్సీపీకి ఆ పార్టీ నేతలు షాక్‌ల మీద షాకులిస్తున్నారు. అభివృద్ధి కే మా మద్దతు అంటూ అధికార టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారు. రోజుకో డివిజన్‌లో కండువాలు మారుస్తూ వలస బాట పడుతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సన్నపురెడ్డి సోదరులు వైఎస్ఆర్సీపీ అగ్రనేతల ఒంటెద్దు పోకడలు నచ్చక ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. సన్నపురెడ్డి ఆఫీస్‌కి వెళ్లి మంత్రి నారాయణ, ఎంఎల్ఏ శ్రీధర్ రెడ్డిలు ఆహ్వానించటంతో సోదరులు, వారి సహచరులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పెంచలరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ ముగ్గురూ వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరడానికి నిర్ణయించుకోవటం శుభ పరిణామమన్నారు. రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వారి సోదరుడు సుబ్బారెడ్డి నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో మంచి పలుకుబడి ఉన్న నేతలన్నారు. వీరితో పాటు మంచికంటి శ్రీనివాసులు కూడా వైసీపీకి రాజీనామా చేసి, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతుండటం సంతోషకరం అన్నారు. సన్నపురెడ్డి సోదరులు ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో, అంకితభావంతో కష్టపడి పనిచేస్తారన్నారు. వారు అధికారికంగా



పార్టీలో చేరుతారన్నారు. సన్నపు రెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో మమేకమైన తమను విస్మరించడం వల్లనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామన్నారు. వైసీపీకి చెందిన ప్రముఖ నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, మంచికంటి శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న వైసికి తీవ్ర నష్టం చేకూరుస్తుందంటున్నారు. మంత్రి,ఎంఎల్ఏ లతో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయ్ భాస్కర్ రెడ్డి, స్వయంగా సన్నపురెడ్డి సోదరుల ఆఫీస్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.



# రాష్ట్రం రావణకాష్టం కావాలన్నదే జగన్ దురాలోచన

## చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య పునాదులపై ఏర్పడితే, వైసీపీ హింసారాజకీయాల నుంచి పుట్టిందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. దేవతల యజ్ఞాల్ని రాక్షసులు భగ్నం చేసినట్టు.. ప్రజాప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాల్ని నాశనం చేయడానికి జగన్ కుట్రలు చేస్తున్నాడు. ప్రజాస్వామ్యంలో అంతిమ అధికారం ప్రజలదేననే సత్యాన్ని గ్రహించనంతకాలం జగన్ రాజకీయాలకు అనర్హుడే. స్థానిక ఎన్నికలు ఆపాలి.. వేలకోట్ల నిధుల్ని రాకుండా చేయాలన్న దురాలోచనతోనే జగన్.. వైసీపీ కేడర్నిరెచ్చగొట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. హింసను ప్రోత్సహించి, రాష్ట్రంలో రక్తపాతం సృష్టించి, పెట్టుబడుల్ని అడ్డుకోవాలన్నదే గొడ్డలి పార్టీ కుయుక్తి. దాడులు, బెదిరింపులు, భయాందోళనలతో ప్రజాభిప్రాయాన్ని, వారి నిర్ణయాల్ని మార్చాలన్నదే జగన్ దురాలోచన. రాజకీయ ప్రత్యర్థుల్ని శాశ్వత శత్రువులుగా, మార్చి రాష్ట్రాన్ని రావణకాష్టం చేసేందుకు గొడ్డలిపార్టీ తహతహలాడుతోంది. రాష్ట్రం ప్రశాంతంగా, ప్రజలు సంతోషంగా ఉన్న తరుణంలో జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో ప్రజాతీర్పు తప్పకుండా తనపార్టీకి వ్యతిరేకంగా వస్తుందని జగన్ కు అర్థమైంది. వైసీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కవని తెలిసే.. జగన్ హింసా రాజకీయాలకు తెరలేపాడు. ప్రజాక్షేత్రంలో గెలిచే సమర్థత లేకే .... జగన్ రాష్ట్రాన్ని కురుక్షేత్రంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ప్రజామోదంతో, నిబంధనల ప్రకారం స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణకు సిద్ధమవడాన్ని జగన్ ఓర్వలేకపోతున్నాడు. పాము తన పిల్లల్ని తానే మింగినట్టు, రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ సొంతపార్టీ కార్యకర్తల్నే బలిచేస్తున్నాడు. గతంలో పర్యటనల పేరుతో అమాయకుల్ని బలితీసుకున్న జగన్.. నేడు ఏకంగా సామాన్యుల్ని బలిపెట్టి, తన పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాడు. దుర్మార్గాలు, దురాలోచనలకు అలవాటుపడిన జగన్.. ఎప్పటికీ ప్రజా తీర్పును గౌరవించలేడు. ప్రజాస్వామ్యాన్ని ఆమోదించలేడు.

జగన్ హింసను నమ్ముకుంటే.. కూటమి ప్రభుత్వం ప్రజల్ని నమ్ముకుంది. పుంగనూరు, ధర్మవరం, రాయచోటి ఘటనలు.. వైసీపీ ప్రేరేపిత రాజకీయ హింసాత్మక ఘటనల్లో మొదటి ఘట్టంగా చూడాలి. స్థానిక ఎన్నికల్ని అడ్డుకోవడం జగన్ లక్ష్యమైతే, ఎన్నికల్ని సమర్థవంతంగా నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలన్నది చంద్రబాబు ఆలోచన. ప్రజా ప్రభుత్వంలో గొడ్డలిపార్టీ హింసా రాజకీయాలు సాగవని జగన్ తెలుసుకోవాలి." అని ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

# ఏపీటీఎస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఏపీటీఎస్ ప్రధాన కార్యాలయంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన దుర్గాదేవి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఎం.డీ. మల్లవరపు సూర్యతేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించి, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో డిజిటల్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, డీప్‌టెక్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ూాూ తన వంతు పాత్ర పోషిస్తోందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు. అమరావతిలో అభివృద్ధి చెందుతున్న క్వాంటం వ్యాలీ, విశాఖపట్నం లో గూగుల్ వంటి అంతర్జాతీయ సాంకేతిక సంస్థతో రాష్ట్రం ముందుకు సాగుతున్న భాగస్వామ్యాలు ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ సేవల్లో వినియోగించడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి లక్ష్యాలతో ూాూ పనిచేస్తోందని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందం, విజయాలను తీసుకురావాలని మన్నవ మోహనకృష్ణ ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు, మేనేజర్లు పాల్గొన్నారు.



# ఎన్నికల వేళ... జగన్ హింసాత్మక హేల!

అనంతపురం (చైతన్యరథం): స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో వైసిపి నాయకులు చేస్తున్న అలజడులపై అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ వెంకటశివుడు యాదవ్ మీడియా సమావేశంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో టీడీపీ కూటమిని అడ్డుకోవడానికి వైసీపీ అధినేత జగన్ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను




పక్కనపెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ హింసను నమ్ముకుంటే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని నమ్ముకున్నారని పేర్కొన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో జగన్‌కు మరోసారి తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయచోటి, పుంగనూరు, అన్నమయ్య, ధర్మవరం ప్రాంతాల్లో వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అల్లర్లు, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకులు భయంతో గొడవలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజలు ప్రతి పరిణామాన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో తమ తీర్పు ద్వారా సమాధానం చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే దాడులు, అల్లర్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవాల్సింది పోయి, భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని, ఆ పార్టీ రాజకీయంగా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రశాంతమైన ఎన్నికల వాతావరణం నెలకొనేలా ఎన్నికల అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని, హింసకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో అరెకటిక కార్పొరేషన్ చైర్మన్ హరికృష్ణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జె. ఎల్. మురళి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల వేళ వైసీపీకి షాక్

**250 కుటుంబాలతో టీడీపీలో చేరిన మాజీ కోఆప్షన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే దగ్గుపాటి**

అనంతపురం (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికలవేళ అనంతపురం నగరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. వైసీపీకి మాజీ కోఆప్షన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి 250 కుటుంబాలతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవితో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిని పేరుపేరునా ఎమ్మెల్యే దగ్గుపాటి పలకరించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలో ఉన్న కీలక నాయకులంతా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని.. ఇది ఆ పార్టీ పతనానికి నిదర్శనం అన్నారు. లక్ష్మిరెడ్డి గత తెలుగుదేశం పార్టీ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆ పార్టీ విధానాలు నచ్చక ఆయన టీడీపీలో చేరారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవలేమన్న ఉద్దేశంతో గొడ్డలి పార్టీ నాయకులు ఎక్కడికక్కడ అనాచకాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు తమకు క్రమశిక్షణ నేర్పించారని.. అందుకే మౌనంగా ఉన్నామన్నారు. ఆయన కనుసైగ చేస్తే వైసిపి పార్టీ ఉండదని హెచ్చరించారు. ఈ రెండేళ్ల కాలంలో తాము చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని.. అదే నినాదంతోనే ఎన్నికల్లో ప్రచారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించామని దీనిపట్ల ప్రజలు కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1300 కోట్ల రూపాయలతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామని వివరించారు. వందకు వందశాతం స్ట్రైక్ రేటుతో మున్సిపల్ ఎన్నికల్లో గెలవబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మరోవైపు పార్టీలో చేరిన లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ 2009 నుంచి తాను తెలుగుదేశం పార్టీలోనే ఉన్నానని.. తన డివిజన్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. నేను చేసిన అభివృద్ధి తెలుగుదేశం పార్టీ సహకారంతోనే జరిగిందన్నారు. నాకు తెలుగుదేశం పార్టీ తల్లి లాంటిదని.. సొంత ఇంటికి వచ్చానన్న భావన ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో వేగంగా జరుగుతున్నాయని..వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు.




టీడీపీలో చేరిన వైసీపీ మాజీ కోఆప్షన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి, లక్ష్మీరెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లక్ష్మీరెడ్డితో పాటు టీడీపీలో చేరిన 250 కుటుంబాలు..



## ఈ ఘటన చాలా దురదృష్టకరం : ఎంపీ పార్థసారథి

పెనుకొండ (చైతన్యరథం): నియోజకవర్గం గొల్లపల్లి రిజర్వాయర్‌లో మునిగి ఐదుగురు మృతి చెందిన కుటుంబ సభ్యులను హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి పరామర్శించారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. యువ నాయకుడు బీకేసాయికళ్యాణ్, నాయకులు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, రొద్దం నరసింహులు, గుట్టూ రు సుబ్బరాయుడు తదితరులు వారి వెంట ఉన్నారు.



# ప్రజాస్వామ్యంపై దాడులను సహించేది లేదు

**పుంగనూరు, రాయచోటి ఘటనల్లో వైసీపీ తీరును ఖండించిన మంత్రాలయం టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి**

మంత్రాలయం (చైతన్యరథం): టీడీపీ ఇన్చార్జి అధికారాలయంలో ఇన్చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి, అబ్జర్వర్ కే హరి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎన్నికల సమయంలో హింసకు పాల్పడటం, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటమి భయంతో ప్రత్యర్థులను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తాయని అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం ఉండాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని స్పష్టం చేశారు. గతంలో ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రజలు మరచిపోలేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజలను భయపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచన సరికాదని, ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయం ప్రజలదేనని తెలిపారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన సమయంలో రాజకీయ కక్షలు, ఘర్షణలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదని హితవు పలికారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రలోభాలకు లేదా భయాందోళనలకు లోనుకాకుండా తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని, ప్రజలు అభివృద్ధి వైపు అడుగులు వేయాలని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించే చర్యలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు.

# న్యూజెర్సీ తెలుగు సమాజానికి కొత్త నాయకత్వం

## నాట్స్ చాప్టర్ లీడర్‌గా సాయి గంగుల నియామకం




**న్యూజెర్సీ:** న్యూజెర్సీలోని తెలుగు సమాజానికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) కొత్త నాయకత్వాన్ని ప్రకటించింది. నాట్స్ న్యూజెర్సీ చాప్టర్ లీడర్‌గా సాయి గంగులను నియమించింది. నాట్స్ చైర్మన్ కిశోర్ కంచర్ల పాల్గొన్న ప్రత్యేక మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాజ్ మాట్లాడుతూ... యువకుడు, ఉత్సాహవంతుడు, చురుకైన నాయకుడైన సాయి గంగులకు సామాజిక సేవ పట్ల ఉన్న అంకితభావం న్యూజెర్సీ వ్యాప్తంగా నాట్స్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువతను నాట్స్ సేవా కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములను చేయడంలో సాయి గంగుల కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాట్స్ చైర్మన్ కిశోర్ కంచర్ల మాట్లాడుతూ... నాట్స్ అభివృద్ధిలో న్యూజెర్సీ తెలుగు సమాజం అందించిన విశేష సేవలను కొనియాడారు. న్యూజెర్సీ నుంచి ముగ్గురు నాట్స్ అధ్యక్షులు రావడం ఈ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతను చాటుతోందన్నారు. తెలుగు సమాజానికి మరింత చేరువవుతూ, సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి నాట్స్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

సమావేశంలో పలువురు ప్రముఖ తెలుగు సంఘాల నాయకులు, నాట్స్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆప్టా (APTA), ఆత్మీయ (ATMIYA), మాటా (MATA), తానా (TANA), టీఫాస్ (TFAS), ఎన్ఆర్ఐవీఏ (NRIVA) సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. తెలుగు సంఘాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సమాజ సేవ పట్ల ఉమ్మడి నిబద్ధతకు ఈ సమావేశం వేదికగా నిలిచింది. కార్యక్రమంలో నాట్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, బోర్డు సభ్యులు బిందు యలమంచిలి, టీపీ రావు, శ్యామ్ నాళం, మురళీకృష్ణ మేడిచెర్ల, శ్రీనివాస్ భీమినేని, వంశీ కొప్పురావూరి పాల్గొన్నారు.

నాట్స్ జాతీయ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న నెక్సిల్లో హెల్త్ (Nexillo Health) సంస్థకు చెందిన శశి పర్వతం, బులియన్ ఫార్చ్యూన్ (Bullion Fortune) సంస్థకు చెందిన కల్యాణ్ లక్కింశెట్టి, వంశీకృష్ణ కొప్పురావూరి కూడా హాజరై నాట్స్ సేవా కార్యక్రమాలకు తమ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడకు అభినందనలు తెలియజేశారు. ఆయన అంకితభావంతో అందిస్తున్న సేవలను, నాయకత్వాన్ని ప్రశంసించారు. తెలుగు సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని రాజ్ అల్లాడ నొక్కిచెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాల్లో నాట్స్‌తో కలిసి పనిచేయాలని తెలుగు సంఘాలకు పిలుపునిచ్చారు.

తెలుగు సమాజంలో పరస్పర సంబంధాలను మరింత బలోపేతం చేయడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తరించడం వంటి నాట్స్ లక్ష్యాలను ఈ సమావేశం మరోసారి చాటిచెప్పింది.

### గుండె సర్జరీని గెలిచి... పవర్ లిఫ్టింగ్‌లో మెరిసి...

# ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో శంకరరావుకు కాంస్యం

రెనో (అమెరికా): సంకల్ప బలానికి వయసు అడ్డుకాదని, గుండెకు బైపాస్ సర్జరీ జరిగినా ఆత్మవిశ్వాసంతో ప్రపంచాన్ని జయించవచ్చని నిరూపించారు భద్రాచలానికి చెందిన




74 ఏళ్ల రిటైర్డ్ ఎస్‌బీఐ అధికారి డీవీ శంకరరావు. అమెరికాలోని నెవాడా రాష్ట్రం రెనో నగరంలో జరిగిన 2026 IPF వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో మాస్టర్స్-4, 74 కిలోల విభాగంలో ప్రపంచ స్థాయిలో మూడో స్థానం సాధించి కాంస్య పతకం గెలిచి పోడియంపై స్థానం పొందారు.

ఒకప్పుడు గుండె బైపాస్ శస్త్ర చికిత్స ఎదుర్కొన్న శంకరరావు, నేడు అదే గుండె నిండా ఆత్మవిశ్వాసంతో ప్రపంచ క్రీడా వేదికపై భారత త్రివర్ణ పతాకానికి గౌరవం తీసుకురావడం అపూర్వమైన ఘట్టం. జాతీయ స్థాయిలో పలు పతకాలు, రికార్డులు సాధించిన ఆయన ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించి ప్రపంచ పోటీలకు వెళ్లి ఈ ఘన విజయం అందుకున్నారు. ఇది కేవలం ఒక కాంస్య పతకం ఎంతమాత్రం కాదు. ఆయన ప్రదర్శన దేశానికి గర్వకారణం, భద్రాచలానికి అపూర్వ గౌరవమని చెప్పొచ్చు. “వయసు శరీరానికే తప్ప సంకల్పానికి కాదు! గుండెకు శస్త్ర చికిత్స జరగవచ్చు... కానీ గుండెలోని గెలవాలనే తపనకు కాదు!” అని శంకరరావు విషయంలో నిజమైంది.

### తానా మిడ్-అట్లాంటిక్ ఆధ్వర్యంలో నవంబరు 15న

# ఈషా యోగా, ధ్యాన సదస్సు

**పెన్సిల్వేనియా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (TANA) మిడ్-అట్లాంటిక్ బృందం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం-2026 సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ది ఫ్యూచర్ ఈజ్ ఎవ్రీవన్ (The Future Is Everyone), అంతర్గత బలాన్ని పెంపొందించుకోవడం అనే ముఖ్య ఉద్దేశంతో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. దైనందిన జీవిత ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు, శరీరాన్ని రిఫ్రెష్ చేసుకునేందుకు ఈషా ఫౌండేషన్ సౌజన్యంతో ప్రత్యేక యోగా, ధ్యాన సదస్సు నిర్వహిస్తున్నారు.

కార్యక్రమ విశేషాలు...
యోగ నమస్కార్ (Yoga Namaskar)
నాడి శుద్ధి (Nadi Shuddhi)
మిరాకిల్ ఆఫ్ మైండ్ మెడిటేషన్ (Miracle of Mind Meditation)
తేదీ: నవంబరు 15 (ఆదివారం)
సమయం: ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
వేదిక: 399 అర్కోలా రోడ్, కాలేజ్‌విల్లే, PA 19426
గమనిక: ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు సొంతంగా




యోగా మ్యాట్‌లను వెంట తెచ్చుకోవాలని నిర్వాహకులు కోరారు. సీట్లు పరిమితంగా ఉన్నందున ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం https://tinyurl.com/2e55synf లింక్‌ను సందర్శించవచ్చు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తానా మిడ్ అట్లాంటిక్ నిర్వాహక బృంద సభ్యులు ఫణి కంతేటి (మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్-610-620-4135), శ్రీదేవి, గజేంద్రబాబు కోరారు.



# అమెరికాలో మన ‘అన్నదాతలు’

## ‘థ్రైవ్2గెదర్’ ద్వారా 2 లక్షల డాలర్ల ఆహార నిధి సేకరణ

### రెస్టారెంట్లలో మిగిలిన ఆహారంతో పేదల ఆకలి తీరుస్తున్న భారతీయ విద్యార్థులు

**వాషింగ్టన్:** ఆహార అభద్రతను అంతం చేయడమే లక్ష్యంగా అమెరికాలోని జార్జియాకు చెందిన భారతీయ సంతతి విద్యార్థులు ముగ్గురు కలిసి అద్భుతమైన సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. రేనేష్ మైలాపురం, జియా పటేల్, రాయ్నా గోర్... స్థాపించిన ‘థ్రైవ్2గెదర్’ (Thrive2Gethr) అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇప్పటివరకు 2,00,000 డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ.1.66 కోట్లు) విలువైన ఆహారాన్ని సేకరించి పేద కుటుంబాలకు అందించారు.

**తాత్కాలిక డ్రైవ్‌ల నుంచి శాశ్వత పరిష్కారం వైపు!**

సాధారణంగా జరిగే ఫుడ్ డ్రైవ్‌లు ఆ ఒక్క రోజుకే పరిమితమవుతాయని, ఆ తర్వాత ప్రభావం ఉండదని గుర్తించిన రేనేష్ మైలాపురం.. వ్యాపార సంస్థలు, హోటళ్ల నుంచి నిత్యం వృథా అయ్యే మిగులు ఆహారాన్ని సేకరించేందుకు ‘థ్రైవ్2గెదర్’ను వేదికగా మలుచుకున్నాడు.

**50 ప్లస్ చాప్టర్లు-1,200 మంది సభ్యులు:**

2023లో కొలంబస్ (జార్జియా)లో ప్రారంభమైన ఈ సంస్థ అతి తక్కువ కాలంలోనే 501(c)(3) లాభాపేక్ష లేని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎన్జీవోగా రూపాంతరం చెందింది. అమెరికాలోని జార్జియా, టెక్సాస్, ఫ్లోరిడా, న్యూయార్క్, న్యూజెర్సీ తదితర రాష్ట్రాల్లో 50కి పైగా చాప్టర్లను ఏర్పాటు చేసి 1,200 మందికి పైగా విద్యార్థి వాలంటీర్లను భాగస్వాములను చేసింది.

**రెస్టారెంట్ల భయాలకు చట్టబద్ధమైన పరిష్కారం:** రోజువారీ మిగులు ఆహారాన్ని దానం చేస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయేమోనని హోటళ్లు, ఫ్రాంచైజీలు భయపడతాయని గ్రహించిన ఈ విద్యార్థులు.. ‘బిల్ ఎమర్సన్ గుడ్ సమారిటన్ ఫుడ్ డొనేషన్ యాక్ట్’, స్థానిక చట్టాల ద్వారా వ్యాపార సంస్థలకు బాధ్యతల నుంచి ఉపశమనం కల్పించే నమూనాను సిద్ధం చేశారు.

**పన్ను మినహాయింపులు:** ఆహారాన్ని విరాళంగా ఇచ్చే అర్హత కలిగిన వ్యాపార సంస్థలకు ఇంటర్నల్ రెవెన్యూ కోడ్ సెక్షన్ 170(e)(3) ప్రకారం 10శాతం వరకు ఫెడరల్ పన్ను మినహాయింపు లభించేలా సహకరిస్తున్నారు.

**విస్తరణ దిశగా అడుగులు**

వ్యాపార సంస్థలతో నిరంతర షెడ్యూళ్లను ఏర్పాటు చేసుకుని, వాలంటీర్ల ద్వారా నిత్యం ఆహారాన్ని సేకరించి స్థానిక షెల్టర్లు, ఫుడ్ బ్యాంక్‌లకు అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో అమెరికన్ ఇండియన్ వ్యాపారవేత్తలు, రెస్టారెంట్ల యజమానులతో కలిసి ఈ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని థ్రైవ్2గెదర్ బృందం ప్రణాళికలు రచిస్తోంది. ఈ సంస్థలో చేరాలనుకునే విద్యార్థులు, భాగస్వామ్యం కాగోరే వ్యాపార సంస్థలు Thrive2Gethr@gmail.com మెయిల్ ద్వారా లేదా లింక్డ్‌ఇన్ (LinkedIn)లో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (COO) రేనేష్ మైలాపురాన్ని సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.





చైతన్యరథం

# ఈ నెలలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశం

## మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తదితర బిల్లుల ఆమోదం కోసం కేంద్రం కసరత్తు



ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లుల ఆమోదం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించే అంశంపై కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ బిల్లులకు అవసరమైన మద్దతు కూడగట్టేందుకు ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక సమావేశం నిర్వహణపై కేంద్రం కసరత్తు చేస్తోందని, త్వరలోనే సమావేశ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం.

కాగా, మహిళా రిజర్వేషన్ల అమలుతో పాటు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను ఏప్రిల్ 17న కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఆ బిల్లుకు అవసరమైన మద్దతును కూడగట్టడంలో కేంద్రం విఫలమైంది. మరోవైపు, నీట్ పేపర్ లీక్‌పై ప్రతిపక్షాల నిరసనలు, విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వ చర్యల నేపథ్యంలో వర్షాకాల సమావేశాల్లో బిల్లులను తిరిగి ప్రవేశపెట్టాలన్న కేంద్రం ప్రయత్నాలు ముందుకు సాగలేదు. దీంతో ఈ ప్రతిపాదనలను మరోసారి పార్లమెంట్ ముందుకు తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం తనకు మద్దతిచ్చే పార్టీల సంఖ్యను పెంచుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతోందని సమాచారం. అలాగే, మరికొన్ని చిన్న పార్టీలతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

మరోవైపు, అక్టోబర్ 26, 27 తేదీల్లో పార్లమెంట్‌లో 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేసే అవకాశం ఉంది. ఒకవేళ ప్రత్యేక సమావేశాల నిర్వహణపై కేంద్రం నిర్ణయం తీసుకుంటే ఇండియా కూటమి ఏ విధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారనుంది.



# అరెస్టులతో అట్టుడికిన ఢిల్లీ

## ముందస్తు అదుపులో అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంక

ఆందోళనలతో ఢిల్లీలో వాతావరణం వేడెక్కింది. కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, పార్టీ ఇతర నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకలను ఢిల్లీ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం దుమారం రేపింది. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండించిన సీజేపీ వర్గాలు, నేతల నిర్బంధానికి నిరసనగా కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్, వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించాలని పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు సెంట్రల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుకు వ్యతిరేకంగా, అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జరిగిన లోపాలను ఎత్తి చూపుతూ సీజేపీ తలపెట్టిన ఆందోళనలు ఢిల్లీలో తీవ్ర రాజకీయ చర్చకు దారితీశాయి.

# భారత్‌ను శాసిస్తానంటే సహించం : ఎలాన్ మస్క్‌పై ఓవైసీ ఫైర్



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని తాము ఎంతగానో వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఒక విదేశీ బిలియనీర్ భారత్ అంతర్గత విధానాలను, రాజకీయ నిర్ణయాలను ప్రశ్నించడాన్ని లేదా శాసించడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. స్టార్‌లింక్ వాణిజ్య కార్యకలాపాల ప్రారంభంపై టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కేంద్ర ప్రభుత్వం మధ్య నడుస్తున్న వివాదంపై ఒవైసీ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఒవైసీ.. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించడం వేరు, భారతదేశ సార్వభౌమత్వాన్ని ఒక విదేశీ వ్యాపారవేత్త ప్రశ్నించడాన్ని సమర్థించడం వేరని తేల్చిచెప్పారు. 'మేము ఎప్పుడూ నరేంద్ర మోదీకి వ్యతిరేకమే, భవిష్యత్తులోనూ వ్యతిరేకంగానే ఉంటాం. కానీ, ఎలాన్ మస్క్ లాంటి వ్యక్తి మన భారతదేశం గురించి, మన ప్రధాని గురించి ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేయగలడు?' అని ఒవైసీ ప్రశ్నించారు. ఒక 'గోరా' (తెల్ల జాతీయుడు) వచ్చి మన దేశాన్ని ఎలా నడపాలో డిక్టేట్ చేస్తాడా? అని మండిపడ్డారు.ఎల్లప్పుడూ జాతీయవాదం గురించి మాట్లాడే బీజేపీ, మోదీ ప్రభుత్వం.. ఒక శక్తివంతమైన విదేశీ వ్యాపారవేత్త దేశ నిర్ణయాధికారాన్ని సవాల్ చేసినప్పుడు ఎందుకు మౌనంగా ఉంటోందని ఒవైసీ నిలదీశారు. బీజేపీకి 'గోరచర్మం' (తెల్లని చర్మం) పట్ల ఎందుకంత భయమని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. భారతీయ కార్మికులు, పౌరుల ప్రయోజనాలే దేశానికి ప్రథమ ప్రాధాన్యత కావాలని స్పష్టం చేశారు. భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించాలని అమెరికా ఒత్తిడి తెస్తోందని, కానీ అమెరికా మాత్రం స్వయంగా రష్యన్ ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తోందని ఒవైసీ ఎత్తిచూపారు. ఎలాన్ మస్క్.. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయగా, రాహుల్ గాంధీ దానికి స్పందిస్తూ 'భారత్‌కు స్వాగతం ఎలాన్.. మరొకరిని కనుగొనే వరకు వేచి చూడండి' అంటూ పరోక్షంగా గౌతమ్ అదానీని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. దీనికి మస్క్ కూడా స్పందించడం రాజకీయంగా దుమారం రేపింది. అయితే, రాహుల్ గాంధీ కార్పొరేట్ అనుకూల విధానాలపై విమర్శలు గుప్పించేందుకు ఈ వివాదాన్ని వాడుకోగా.. అసదుద్దీన్ ఒవైసీ మాత్రం దీనిని దేశ సార్వభౌమత్వం, జాతీయ గౌరవానికి సంబంధించిన అంశంగా మలచడం గమనార్హం.

# పట్టు వదలని సీజేపీ... మెట్టుదిగని కేంద్ర ప్రభుత్వం!

## నిఘావర్గాలు అప్రమత్తం

దేశ రాజధాని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించనున్న 'లెహ్రా దో తిరంగా' కార్యక్రమంపై నిఘా వర్గాలు అప్రమత్తమైనట్టు సమాచారం. జాతీయ జెండాతో నిర్వహించనున్న ఈ కార్యక్రమం కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా, నిరవధిక ధర్నాగా మారే అవకాశం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను విడుదల చేయాలన్న డిమాండ్‌తో నిరసన కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్ద జాతీయ జెండాలతో సమావేశం కావాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. జాతీయ జెండాను ప్రదర్శించడం, జాతీయ గీతాన్ని ఆలపించడం ద్వారా తమ నిరసనను తెలియజేయాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశమని పార్టీ ప్రకటించింది. అయితే, ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరైతే పరిస్థితులను నియంత్రించడం కష్టమవుతుందని భద్రతా విభాగాలు భావిస్తున్నట్లు సమాచారం.కొందరు అక్కడే ఉండిపోయి ధర్నాను కొనసాగించే అవకాశం ఉందన్నది నిఘా వర్గాలు భావిస్తున్నాయని తెలుస్తోంది. సీజేపీకి చెందిన సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఐదు రోజుల జుడీషియల్ కస్టడీకి పంపిన నేపథ్యంలో పార్టీ తాజా నిరసనకు పిలుపునిచ్చింది. నిరసన నేపథ్యంలో ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో పోలీసులు భద్రతను పెంచారు. కన్నాట్ ప్లేస్, పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌ను అక్టోబర్ 16, 17 తేదీల్లో ప్రజలకు మూసివేస్తున్నట్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రకటించింది.






# ఇటు నిరసనల హోరు ... అటు వ్యాపారుల గగ్గోలు!

## స్పందించిన సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం

దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు, నిరసనల కారణంగా వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. సీజేపీ తలపెట్టిన నిరసనల నేపథ్యంలో సెంట్రల్ పార్క్‌ను మూసివేయాలని న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేయడం, దీనివల్ల భారీగా వ్యాపార నష్టాలు వస్తాయని ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ వ్యాపారాలకు ఎటువంటి అక్రమ అంతరాయం కలిగినా కోర్టు జోక్యం చేసుకుంటుందని స్పష్టం చేసింది. అయితే, ఈ తరుణంలో తక్షణ ఉత్తర్వులు జరపడానికి నిరాకరించిన కోర్టు, తదుపరి విచారణను అక్టోబర్ చివరి వారానికి వాయిదా వేసింది. పండుగ, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారాలు మూతపడితే చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, హమాలీల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. కన్నాట్ ప్లేస్ మార్కెట్‌లో ఒక్క రోజు నిరసనల వల్ల సుమారు రూ. 200 కోట్ల వ్యాపారం దెబ్బతింటుందని, అక్టోబర్ 10 నుంచి ఇప్పటివరకు వర్తకులు రూ. 2,000 కోట్ల నష్టాన్ని చవిచూశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వర్తకులు ప్రధానంగా మూడు డిమాండ్లను కోర్టు ముందుంచారు. అక్టోబర్ 2026 నుంచి జనవరి 2027 వరకు ప్రధాన మార్కెట్లలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలి. నిరసనల కోసం వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ప్రత్యేక ప్రదేశాలను కేటాయించాలి. నిరసన హక్కును, వ్యాపారాల హక్కులను సమతుల్యం చేసేలా ఒక ఎస్‌ఓపీని రూపొందించాలి. మరోవైపు, వ్యాపారుల ఆందోళనలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందిస్తూ.. శాంతియుత నిరసనల వల్ల వ్యాపారాలు నష్టపోరని, ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి, రవాణాను నియంత్రించి నగరాన్ని యుద్ధభూమిలా మార్చడం వల్లే నష్టాలు వస్తున్నాయని ఎక్స్ వేదికగా విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ, పండుగ సీజన్‌లో ఈ నిరసనల అంశం ఢిల్లీ వర్తక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# దేశాధ్యక్షుడిగా ఆయన పనికిరాడు!

- జెలెన్‌స్కీపై ట్రంప్ తీవ్ర విమర్శలు
- కొత్త వ్యక్తిని ఎన్నుకోవడం ఉత్తమమని వ్యాఖ్య

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. యుద్ధాన్ని ముగించడానికి జెలెన్ స్కీ సుముఖంగా లేరని.. అందువల్లే రష్యాపై దాడులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అమెరికాతో డీల్ చేసుకోవడానికి ఆయన సరైన వ్యక్తి కారన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఆయన ఇక ఎంతమాత్రం పనికిరారని.. కొత్త వ్యక్తిని ఎన్నుకోవడం ఉత్తమమని ఆ దేశ ప్రజలకు సూచించారు. శాంతి చర్చలు, రాజీ యత్నాలంటూ బయటకు చెబుతారు కానీ.. లోపల మాత్రం యుద్ధం కొనసాగించాలనే ఆయన కోరుకుంటారన్నారు. జెలెన్స్కీ వల్లే ఆ దేశం



నాశనం అవుతోందని దుయ్యబట్టారు. మరోవైపు 2014లో రష్యా క్రిమియాను స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ యుద్ధం కొనసాగింపునకు గత ఒబామా, బైడెన్ ప్రభుత్వాలు అందించిన సాయంపై కూడా విమర్శలు చేశారు.

### రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ దాడి...

రష్యాలోని ర్యాజాన్ ప్రాంతంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ గురువారం డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మరోవైపు మధ్య ఉక్రెయిన్‌లోని కిరోవోగ్రాడ్ ప్రాంతంపై మాస్కో విరుచుకుపడడంతో ముగ్గురు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది వెలువడి వారం కూడా పూర్తి కాక ముందే ఇరుదేశాలు పరస్పర దాడులకు పాల్పడుతుండడం గమనార్హం.

# కెనడా విచ్ఛిన్నానికి అమెరికా యత్నం

**- ప్రధాని మార్క్ కార్నీ సంచలన వ్యాఖ్యలు**

తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కెనడా ప్రావిన్స్ ఆల్బెర్టాలో వచ్చే సోమవారం రిఫరెండం జరగనున్న నేపథ్యంలో ప్రచార ర్యాలీలో కార్నీ మాట్లాడారు. ఆల్బెర్టా కెనడాలో భాగంగా ఉండేలా ఆ ప్రావిన్స్ ప్రజలు ఓటు వేయాలని కోరారు. అందుకు భిన్నంగా జరిగితే.. విభజన, అనిశ్చితికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. "ప్రపంచం ప్రమాద కరంగా, సొంత లక్ష్యాల ఆధారంగా విడిపోయి ఉంది. మన సరిహద్దులకు అవతల ఉన్నవారు మనల్ని విచ్ఛిన్నం చేసి, గుప్పిట పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలా ఏమాత్రం అనుకూలంగా లేని సమయంలో రిఫరెండం జరుగుతోంది. ఇందులో నిర్ణయాత్మక



ఫలితం వేర్పాటువాద సమస్యను పరిష్కరిస్తుంది. ఆల్బెర్టా విడిపోవడానికి వేసే ఓటు సంవత్సరాల తరబడి అనిశ్చితికి దారితీస్తుంది" అని ఆ ప్రావిన్స్ ప్రజలను హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా, కెనడా మధ్య ట్రేడ్ వార్ నడుస్తోంది. మరోవైపు కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యలకు గతంలోనే కార్నీ కౌంటర్ ఇచ్చారు. ఆల్బెర్టా ప్రజలు కెనడా నుంచి విడిపోవాలని గతంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యాయి.

ఆల్బెర్టా.. చమురు, సహజవాయువులతో సుసంపన్నమైన ప్రాంతం. తాము కెనడా ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ.. తమకు లభిస్తున్న ప్రాతినిధ్యం, నిధులు తక్కువని ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఆర్థిక అసమానతలు, ఫెడరల్ ప్రభుత్వ విధానాలు, రాజకీయ విభేదాలు వేర్పాటువాద ఆలోచనకు బలం చేకూరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 19న ఓటింగ్ జరగనుంది. కెనడానుంచి వేరుపడే ప్రక్రియను చట్టబద్ధంగా ప్రారంభించాలా.. వద్దా..? అనే దానిని దీని ద్వారా నిర్ణయించనున్నారు.



## ప్రాథమిక పాఠశాలలో కాల్పులు

**ముగ్గురు చిన్నారులు, టీచర్ మృతి**

**ఒరేగాన్ రాష్ట్రంలో ఘోరం**

ఒరేగాన్: అమెరికాలోని ఒరేగాన్ రాష్ట్రంలో దారుణం చోటుచేసుకుంది. బెండ్ సిటీలోని సిల్వర్ రైల్ ఎలిమెంటరీ స్కూల్‌లో గురువారం 16 ఏళ్ల బాలుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు, ఒక టీచర్ ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన చిన్నారుల వయసు 5, 8, 11 ఏళ్లని బెండ్ పోలీస్ చీఫ్ మైక్ క్రాంట్జ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. తాళం వేసి ఉన్న తలుపులను కాల్చి, దుండగుడు పాఠశాలలోకి చొరబడినట్టు పోలీసులు వెల్లడించారు. ఇతడు బెండ్ నగరానికే చెందిన వాడని, పొడవైన తుపాకీతో వచ్చాడని పేర్కొన్నారు. అయితే, దుండగుడు లోపలికి వెళ్లడాన్ని గమనించిన స్థానికుడొకరు అతడిని వెంబడించి కాల్చి చంపినట్టు పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో గాయపడిన 7 ఏళ్ల చిన్నారి, 54 ఏళ్ల మరో టీచర్ పరిస్థితి విషమంగా ఉంది. వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల పేర్లను, కాల్పులకు పాల్పడిన బాలుడి పేరును పోలీసులు ఇంకా వెల్లడించలేదు. అతడికి, పాఠశాలకు ఏదైనా సంబంధం ఉందా? కాల్పులకు కారణమేమిటన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనా స్థలంలో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. "మా హృదయాలు బద్దలయ్యాయి" అని బెండ్ మేయర్ మెలనీ కెబ్లర్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల వెలుపల స్థానికులు కొవ్వొత్తులు, పూలతో నివాళు లర్పించారు. ప్రార్థనా సమావేశం కూడా నిర్వహించారు.

## కమ్చట్కాలో భారీ భూకంపం:

**- సునామీ ముప్పు లేదన్న యూఎస్‌జీఎస్**

మాస్కో: రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైనట్లు యూరోపియన్-మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ (ఈఎమ్ఎస్‌సీ) వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం సుమారు 3:35 గంటలకు ఇది సంభవించింది. ఫార్ ఈస్ట్ ప్రాంతంలోని విల్యూచిన్స్ నగరానికి నైరుతి దిశగా సుమారు 123 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈఎమ్ఎస్‌సీ తెలిపింది. భూమికి సుమారు 140 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. అమెరికా భూగర్భ సర్వే సంస్థ (యూఎస్‌జీఎస్) ఈ భూకంప తీవ్రతను



6.9గా పేర్కొంది. ఈ భూకంపం వల్ల సునామీ ముప్పు లేదని అమెరికా జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం, పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం స్పష్టం చేశాయి. భూకంపం చాలా లోతులో సంభవించడం వల్ల సునామీ ఏర్పడే అవకాశం లేదని తెలిపాయి. ఎలాంటి హెచ్చరికలూ జారీ కాలేదు. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలేవీ ఇప్పటివరకు వెల్లడి కాలేదు. కమ్చట్కా గవర్నర్ వ్లాదిమిర్ సోలోడోవ్ టెలిగ్రామ్‌లో స్పందిస్తూ, నష్టం గురించి ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు. పసిఫిక్ మహాసముద్రం చుట్టూ విస్తరించిన 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో కమ్చట్కా ఉంది. ఇక్కడ టెక్టానిక్ పలకల కదలికల వల్ల తరచూ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి. 2025 జులైలో ఈ ప్రాంత తీరానికి సమీపంలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించి సునామీకి కారణమైంది.

## లండన్ వీధిలో కలకలం

- స్పృహ కోల్పోయిన యూఏఈ రాజ కుటుంబ సభ్యురాలు
- చిన్నారి నిర్లక్ష్యం కేసులో నేరం అంగీకారం

లండన్: యూఏఈ రాజ కుటుంబంతో వైవాహిక సంబంధమున్న మహ్రా అల్ నహ్యాన్ (32) లండన్‌లోని ఓ వీధిలో స్పృహ తప్పి పడిపోయిన కేసులో నేరాన్ని అంగీకరించారు. సౌత్‌వార్క్ క్రౌన్ కోర్టులో జరిగిన విచారణలో ఆమె చిన్నారిపట్ల నిర్లక్ష్యం వహించినట్లు ఒప్పుకున్నారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం, జూన్ 13న వెస్ట్ లండన్‌లో ఆమె రెయిలింగ్‌కు ఆనుకుని స్పృహలేని స్థితిలో కనిపించారు. సమీపంలో మరో వ్యక్తి కూడా అపస్మారక స్థితిలో ఉన్నారు. అదే సమయంలో చెప్పులు లేని మూడేళ్ల చిన్నారి ట్రాఫిక్ రోడ్డు దగ్గర దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. గమనించిన స్థానికులు చిన్నారిని చేరదీసి పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమె సుమారు అరగంటపాటు స్పృహలో లేరని కోర్టుకు తెలిపారు. ఆమె



తరఫు న్యాయవాది స్టీఫెన్ వుల్లో కేసువాదిస్తూ, ఆ రోజు ఆమె మత్తుపదార్థాలు తీసుకోలేదని, అంతకుముందు కొన్ని రోజులు అధిక మోతాదులో కొకైన్ వాడటంతో తీవ్ర అలసటకు గురయ్యారని చెప్పారు. జులైనుంచి సర్రేలోని వోకింగ్‌లో ఉన్న ప్రియరీ చికిత్సా కేంద్రంలో ఆమె చికిత్స పొందుతున్నారని, అప్పటి నుంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నారని వివరించారు. న్యాయమూర్తి జెరెమీ జాన్సన్ తీర్పు చెబుతూ, మత్తు ప్రభావంలో చిన్నారిని వీధిలో వదిలేయడం నిర్లక్ష్యమని వ్యాఖ్యానించారు.ఆమెకు రెండేళ్ల కమ్యూనిటీ ఆర్డర్(పునరావాస కార్యక్రమంతో కూడినది) విధించడంతోపాటు 6,114 పౌండ్ల జరిమానా చెల్లించాలని ఆదేశించారు.

# టెస్లా 'ఫ్లయింగ్ కార్' ప్రదర్శన:

**- గాలిలోకి ఎగిరిన రోడ్‌స్టర్**

టెక్సాస్: టెస్లా కంపెనీ నుంచి కొత్త కారు రాబోతోంది. గాలిలో ఎగురుతూ దూసుకెళ్లే ఈ రోడ్‌స్టర్ కారును టెస్లా తాజాగా ప్రదర్శించింది. టెక్సాస్‌లోని మెక్‌గ్రెగర్‌లో ఉన్న స్పేస్‌ఎక్స్ రాకెట్ డెవలప్‌మెంట్ కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాన్ని టెస్లా ఎక్స్ ఖాతాలో లైవ్‌స్ట్రీమ్ చేశారు. ప్రత్యేకంగా నిర్మించిన భారీ వంపు ర్యాంప్‌పై కారు పైకి వెళ్లి, తలకిందులుగా ప్రయాణించింది. ర్యాంప్ చివరినుంచి గాలిలోకి ఎగిరి, 180 డిగ్రీలు తిరిగి చక్రాలపై ల్యాండ్ అయింది. ఇందులో స్పేస్‌ఎక్స్ రాకెట్ సాంకేతికతతో రూపొందించిన కోల్డ్ గ్యాస్ థ్రస్టర్లను వాడారు. అధిక పీడన గాలి ట్యాంకుల ద్వారా థ్రస్ట్ ఉత్పత్తి చేసి కారును గాలిలోకి లేపుతారు. "ఫ్లయింగ్ కార్లు నిజమే" అని ఎలన్ మస్క్ ప్రకటించారు. ఈ ప్రయోగం విజయం ఖాయమని చెప్పలేమని, అయినా పని చేసే అవకాశం ఉందన్నారు. ఎక్స్‌లో వీడియో పంచుకుంటూ "భవిష్యత్తులో ఫ్లయింగ్ కార్లు ఉన్నాయని తేలింది" అని రాశారు. ఈ కారు ఉత్పత్తి 2028లో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. అయితే ఇది ప్రత్యేక నియంత్రిత ప్రదేశంలో చేసిన ప్రదర్శన మాత్రమే. ఇలాంటి కార్లకు ప్రజా రహదారులపై అనుమతి ఉండదు. రోడ్‌స్టర్ తదుపరి తరం కారును టెస్లా 2017లోనే ప్రకటించినా, ఉత్పత్తిలో తీవ్ర జాప్యం జరిగింది. వాణిజ్యపరంగా మార్కెట్‌లోకి రావడానికి వినియోగదారులు మరింత కాలం వేచి చూడాల్సిందే.



# మహిళా అభిమానులకు ఛత్తీస్‌గఢ్ సర్కార్ నజరానా



రాయ్‌పూర్: భారత మహిళా క్రికెట్ జట్టు కొత్త కెప్టెన్ స్మృతి మంధాన సారథ్యంలో నూతన శకానికి నాంది పలికింది. దాదాపు దశాబ్దకాలం పాటు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన హర్మన్‌ప్రీత్ కౌర్ స్థానంలో స్మృతి మంధాన పూర్తిస్థాయి సారథ్య బాధ్యతలు చేపట్టింది. మంధాన నేతృత్వంలో భారత జట్టు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వేదికగా జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఈ ద్వైపాక్షిక సిరీస్ సందర్భంగా మహిళా క్రికెట్ అభిమానులకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తీపి కబురు అందించింది.

### మైదానంలోకి మహిళలకు ఉచిత ప్రవేశం

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సూచనల మేరకు ఛత్తీస్‌గఢ్ స్టేట్ క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాయ్‌పూర్ షాహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగే ఈ మూడు టీ20 మ్యాచ్‌లకు మహిళా అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు ప్రకటించింది. స్టేడియంలో మహిళా ప్రేక్షకుల హాజరును ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

'తొలిసారిగా రాయ్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ అంతర్జాతీయ మహిళా క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు సీఎం విష్ణుదేవ్ సాయిని ఆహ్వానించాం. ఈ సందర్భంగా ఆయన మైదానానికి వచ్చే మహిళా అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పించాలని విలువైన సూచన చేశారు. ప్రస్తుతం నవరాత్రి ఉత్సవాలు కూడా కొనసాగుతున్న తరుణంలో... మహిళా ఫ్యాన్స్ మ్యాచ్‌లకు విచ్చేస్తే స్టేడియానికి అదనపు ఆకర్షణ అవుతారు. అందుకే సీఎం సూచన మేరకు వెంటనే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నాం" అని ఛత్తీస్‌గఢ్ క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

# మద్యం నా జీవితాన్ని తారుమారు చేసింది

### అది నాకు పునర్జన్మే: చాహల్

భారత స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తన వ్యక్తిగత జీవితం, మానసిక సంఘర్షణల గురించి సంచలన నిజాలను బయటపెట్టాడు. మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా నిర్వహించిన 'బైరక్ అండ్ బోల్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న చాహల్... విడాకుల తర్వాత తాను ఎదుర్కొన్న కష్టాలు, ఆందోళన, ప్యానిక్ ఎటాక్స్, మద్యానికి బానిసైన పరిణామాలను వివరించాడు.

**విడాకుల తర్వాత మానసికంగా కుంగిపోయా..**

'చిన్న వయసు నుంచే నాకు పార్టీలకు వెళ్లే అలవాటు ఉంది. అయితే విడాకుల తర్వాత నా జీవితంలో పరిస్థితులు నా చేయి దాటిపోయాయి. మానసికంగా తీవ్రంగా కుంగుబాటుకు గురయ్యాను. ప్యానిక్ ఎటాక్స్ వచ్చే సమయంలో నా ముఖం చిన్నగా అయిపోయేది. పెదవులు వంకరగా మారి మాట్లాడటం కూడా కష్టమయ్యేది. నన్ను చూసినవారు ఏదో తేడాగా ఉందని గుర్తుపట్టేవారు. మానసిక ఆందోళన ఎంత దారుణంగా ఉంటుందో నాకు అప్పుడే అర్థమైంది" అని చాహల్ తెలిపాడు.

**26 రోజుల రీహాబిలిటేషన్ సెంటర్ జీవితం**

విడాకుల అనంతరం కౌంటీ క్రికెట్ ఆడి తిరిగి వచ్చిన తర్వాత మద్యం అలవాటు హద్దులు దాటిందని చాహల్ వెల్లడించాడు.

"ఏబీ డివిలియర్స్ ఒకసారి నాతో మాట్లాడుతూ.. 'జీవితంలో సమతుల్యత చాలా ముఖ్యం' అని చెప్పాడు. పరిస్థితి నా చేయి దాటుతోందని గ్రహించి, నాకెంతో ఇష్టమైన క్రికెట్‌ను కాపాడుకోవడం కోసం మద్యానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. అందుకోసం రీహాబిలిటేషన్ సెంటర్‌లో చేరి 26 రోజుల పాటు చికిత్స తీసుకున్నాను. ఆ నిర్ణయం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఇప్పుడు నేను చాలా సంతోషంగా ఉన్నాను, ఐపీఎల్‌లోనూ మెరుగ్గా రాణిస్తున్నాను" అని చెప్పాడు.

**15వ అంతస్తు ఘటనపై స్పష్టత**

గతంలో ఓ విదేశీ ఆటగాడు హోటల్ 15వ అంతస్తు బాల్కనీ నుంచి తనను వేలాడదీశాడని చాహల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఉదంతంపై కూడా చాహల్ ఈ పాడ్‌కాస్ట్‌లో మళ్లీ స్పందించాడు.

"అది 2013లో బెంగళూరులో ఆర్‌సీబీ ఇచ్చిన



పార్టీ. అప్పుడు నేను ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఆ పార్టీలో ఆస్ట్రేలియాకు చెందిన ఒక క్రికెటర్ బాగా మద్యం తాగి ఉన్నాడు. సరదాగా చేస్తున్నాడనుకున్నాను కానీ, నన్ను బాల్కనీ వద్దకు తీసుకెళ్లి కిందకు వేలాడదీసేందుకు ప్రయత్నించాడు. నేను అతని మెడను గట్టిగా పట్టుకున్నాను. గదిలోని మిగతా వారు వెంటనే జోక్యం చేసుకుని నన్ను కాపాడారు. ఆ సమయంలో అది నాకు పునర్జన్మలా అనిపించింది. సోషల్ మీడియాలో నాపై వచ్చే విమర్శలను పట్టించుకోవడం మానేసి, నా పనిపై మాత్రమే దృష్టి పెడుతున్నాను" అని చాహల్ ముగించాడు.

# బెంగళూరులోనే భువీ పునరాగమనం



భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పునరాగమనం అనుకున్న దాని కంటే ముందుగానే జరగనుంది. శనివారం బెంగళూరు వేదికగా విండీస్‌తో జరిగే నిర్ణయాత్మక ఐదో టీ20కి భారత జట్టులో భువీకి స్థానం కల్పించారు. నాలుగో టీ20లో స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ గాయపడ్డాడు. అతడి స్థానంలో భువీని తీసుకోనున్నట్టు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. కాగా ఈ ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు 2-2 తేడాతో సమంగా నిలిచిన సంగతి తెలిసిందే. స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల భువీ... భారత జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. అనుభవజ్ఞుడైన ఈ పేసర్ రాకతో చివరి టీ20కు బౌలింగ్ విభాగంలో అదనపు బలం చేకూరనుంది. అయితే తుది జట్టులో అతడికి చోటు దక్కుతుందా? అనేది వేచి చూడాలి. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు భువీని ఎంపిక చేశారు. అయితే కివీస్ పర్యటనకు ముందుగానే అతడిని అంతర్జాతీయ మ్యాచ్‌లో చూసే అవకాశం రావడంతో అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. నాలుగేళ్ల తర్వాత భువీ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

### భారత్‌కు రూ.285 కోట్లు..

# మాకు నయా పైసా రాదు



### వెస్టిండీస్ క్రికెట్ బోర్డు సీఈవో క్రిస్ డెహ్రింగ్ ఆవేదన

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్ సాగుతున్న వేళ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆదాయ పంపిణీ విధానంపై తీవ్ర స్థాయిలో చర్చ మొదలైంది. ఈ సిరీస్ ద్వారా భారత క్రికెట్ నియంత్రణ మౌలిక మండలి (బీసీసీఐ)కి దాదాపు 30 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.285 కోట్లు) వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయితే వెస్టిండీస్ క్రికెట్ బోర్డు (CWI)కి మాత్రం ఒక్క రూపాయి కూడా దక్కకపోవడంపై ఆ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) క్రిస్ డెహ్రింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన... ప్రస్తుత ఐసీసీ రెవెన్యూ మోడల్ చిన్న బోర్డుల ఆర్థిక పరిస్థితిని మరింత దిగజార్చుతోందని విమర్శించారు.

ద్వైపాక్షిక సిరీస్‌ల నుంచి వచ్చే ఆదాయం పంపిణీకి సంబంధించి డెహ్రింగ్ కింది కీలక విషయాలను పంచుకున్నారు:

భారత్ వేదికగా జరిగే సిరీస్ ద్వారా ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ విక్రయాల రూపంలో రూ.285 కోట్ల వరకు రాబడి వస్తుంది. అయితే నిబంధనల ప్రకారం సిరీస్‌కు ఆతిథ్యమిచ్చే బోర్డు (BCCI)కే ఆ ఆదాయమంతా దక్కుతుంది. వెస్టిండీస్ వంటి చిన్న కరేబియన్ దీవుల్లో జనాభా, ప్రేక్షకాదరణ పరిమితంగా ఉండటం వల్ల అక్కడ సిరీస్ నిర్వహిస్తే వచ్చే ఆదాయం చాలా స్వల్పంగా ఉంటుంది. దీంతో ద్వైపాక్షిక పర్యటనలు చేసినా ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 1997 కంటే ముందు పర్యటనకు వచ్చే జట్లకు ఆతిథ్య దేశాలు నిర్ణీత రుసుము చెల్లించే పద్ధతి ఉండేదని డెహ్రింగ్ గుర్తు చేశారు.

"1997లో ఐసీసీ సభ్య దేశాలు ఆమోదించిన కొత్త ఆదాయ నమూనా ప్రకారం... ద్వైపాక్షిక సిరీస్ ప్రసార హక్కులు, వాణిజ్య ఆదాయం మొత్తం వేదిక ఇచ్చే దేశానికే చెందేలా మార్చారు. ఆ నిర్ణయాన్ని మేం 9-1 ఓటింగ్‌తో వ్యతిరేకించినప్పటికీ ఉపయోగం లేకపోయింది. ఆ రోజు తీసుకున్న నిర్ణయమే వెస్టిండీస్ క్రికెట్ ఆర్థిక పతనానికి పునాది వేసింది. భారత్ వంటి భారీ మార్కెట్ ఉన్న దేశాలకు ఇది బాగా కలసివచ్చినా, చిన్న క్రికెట్ బోర్డుల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చేసింది" అని క్రిస్ డెహ్రింగ్ స్పష్టం చేశారు.

# బౌలర్లనూ పట్టించుకోండి

### బీసీసీఐకి మాజీ చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ విజ్ఞప్తి



టీ20 క్రికెట్‌లో బ్యాటర్ల ఉధృతి పెరిగిపోతోందని, బౌలర్లకు పిచ్‌ల నుంచి ఏమాత్రం సహకారం లభించట్లేదని భారత మాజీ చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ అభిప్రాయపడ్డారు. భారత్-వెస్టిండీస్ మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో బ్యాటర్లు అలవోకగా 240కి పైగా పరుగులు సాధిస్తున్నారని, ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో తొలి మ్యాచ్ మినహా ప్రతిసారీ 200 ప్లస్ స్కోర్లు నమోదయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి ఆయన ఒక కీలక సూచన చేశారు.

**బ్యాట్-బంతి మధ్య పోటీ ఉండాలి**

బెంగళూరు వేదికగా జరగనున్న చివరి టీ20 మ్యాచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలు ఉన్నాయనే వాదనల మధ్య చేతన్ శర్మ మాట్లాడారు. "ప్రేక్షకులు ఫోర్లు, సిక్సర్లు చూసేందుకు ఆసక్తి చూపుతారనే మాట నిజమే. కానీ బంతికి-బ్యాట్‌కు మధ్య అసలు పోటీయే లేకపోతే మ్యాచ్‌లు ఏకపక్షంగా మారి అభిమానులకు బోర్ కొడుతుంది. అందుకే కాస్తయినా బౌలింగ్‌కు సహకరించే సమతూకమైన పిచ్‌లను తయారు చేయించాలి. దేశవాళీ క్రికెట్‌లో బౌలర్లకు సహకారం అందించే వికెట్లను బీసీసీఐ సిద్ధం చేస్తున్నట్లే, అంతర్జాతీయ మ్యాచ్‌లకు కూడా అదే విధానాన్ని పాటించాలి. ఇలాగే కొనసాగితే బౌలర్లు పుంజుకోవడం, మ్యాచ్‌ల్లోకి తిరిగిరావడం చాలా కష్టమవుతుంది" అని చేతన్ శర్మ వివరించారు.

**వయసుతో సంబంధం లేదు.. ఆటతీరే గీటురాయి**

ఇదే సందర్భంలో సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ప్రదర్శనపై కూడా చేతన్ శర్మ స్పందించారు. 'నాణ్యమైన ఆటతీరు ప్రదర్శిస్తున్నప్పుడు ప్లేయర్ల వయసుతో సంబంధం లేదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇప్పటికీ వన్డేల్లో సెంచరీలు బాదుతూ నిలకడగా రాణిస్తున్నారు. బయట ఎన్నో రకాల వ్యాఖ్యలు వినిపిస్తుంటాయి. వాటికి స్పందించాల్సిన అవసరం లేదు. దేశం కోసం ఆడటానికి వచ్చినప్పుడు మంచి ప్రదర్శన ఇచ్చి జట్టును గెలిపించడమే ముఖ్యం. వయసును పరిగణలోకి తీసుకోకుండా ఆటగాళ్ల ప్రతిభను, ప్రదర్శననే గీటురాయిగా చూడాలి" అని చేతన్ శర్మ స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు పూనమ్ రౌత్ గుడ్‌బై



ముంబై: భారత మహిళా జట్టు సీనియర్ బ్యాటర్ పూనమ్ రౌత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. 37 ఏళ్ల ఈ ముంబై ప్లేయర్ అన్ని ఫార్మాట్ల నుంచి రిటైరవుతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. పూనమ్ రౌత్ 2009-2021 మధ్యకాలంలో భారత్ తరపున వివిధ ఫార్మాట్లలో ప్రాతినిధ్యం వహించారు. ఆమె మొత్తం 4 టెస్టులు, 73 వన్డేలు, 35 టీ20 మ్యాచ్‌ల్లో భారత్ తరపున బరిలోకి దిగారు. వన్డేల్లో మూడు శతకాలతో కలిపి మొత్తం 2,288 పరుగులు సాధించగా, టీ20ల్లో నాలుగు అర్ధ శతకాలతో 719 పరుగులను తన ఖాతాలో వేసుకున్నారు. 2017 వన్డే ప్రపంచ కప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత మహిళా జట్టులో పూనమ్ రౌత్ కీలక సభ్యురాలిగా వ్యవహరించారు.

చైతన్య రథం
సినిమా

శనివారం 17 అక్టోబరు 2026 X

# ఆ పాత్ర నా చిరకాల స్వప్నం: విద్యాబాలన్



భారతీయ సంగీత దిగ్గజం, భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కాల్సిన బయోపిక్‌లో నటించాలనే తన చిరకాల వాంఛ నెరవేరక పోవడంపై ప్రముఖ బాలీవుడ్ నటి విద్యా బాలన్ మరోసారి తన మనసులోని వేదనను పంచుకున్నారు. ఇటీవల ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ సినిమా ప్రణాళిక గురించి విద్యా బాలన్ మాట్లాడుతూ... '2014లోనే ప్రముఖ దర్శకుడు రాజీవ్ మేనన్‌తో కలిసి ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితంపై ఓ సినిమా తెరకెక్కించాలని పక్కాగా నిర్ణయించుకున్నాం. రాజీవ్ ఎంతో అద్భుతమైన స్క్రిప్ట్ కూడా సిద్ధం చేశారు. కానీ ఆ చిత్రంపై కొన్ని కారణాల వల్ల స్టే ఆర్డర్ రావడంతో మేం ముందుకు వెళ్ల లేక పోయాం'అని గుర్తుచేసుకున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి అంటే తనకుఎంతటి ప్రాణమో విద్యాబాలన్ వివరిస్తూ... 'మా ఇంట్లో ప్రతిరోజూ ఉదయం ఆమె గొంతు తో పలికిన 'వెంకటేశ్వర సుప్రభాతం'తోనే ప్రారంభమవుతుంది. ఆమె సంగీతం అంటే నాకు విపరీతమైన ఇష్టం. ఆమె జీవిత విశేషాల గురించి నాకు చాలా విషయాలు తెలుసు. అందుకే ఆమె పాత్రలో నటించడం నా జీవితాశ యం. అది కాస్తా నెరవేరకుండానే నిలిచిపోవడం ఇప్పటికీ నన్ను ఎంతో బాధిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమా చేయలేకపోయినా, తన మన సులోని కోరికను కొద్దిపాటిగానైనా సంతృప్తిపరుచుకునేందుకు ఫొటోషూట్ చేసినట్లు ఆమె తెలిపారు. రెండేళ్ల క్రితం ఎంఎస్ సుబ్బులక్ష్మికి ఘన నివాళులర్పిస్తూ ప్రత్యేకంగా ఓ ఫొటోషూట్ నిర్వహించా మని, ఆ ఫొటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయని పేర్కొన్నారు. ఆ తర్వాత తనకు అలాంటి పాత్రల కోసం మరిన్ని ఆఫర్లు కూడా వచ్చాయని తెలిపారు. కాగా ప్రస్తుతం రష్మిక మందన్న ప్రధాన పాత్రలో ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. 'ఎం.ఎస్' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రానికి 'ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే ఉప శీర్షికను ఖరారు చేశారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.



## విజువల్ వండర్‌గా

# 'రామాయణం' కొత్త ట్రైలర్

భారతీయ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సరికొత్త ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దంగల్' వంటి ఇండస్ట్రీ హిట్ సినిమా లను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, టాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. రాకింగ్ స్టార్ యశ్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నారు. ఈ చిత్రం మొదటి భాగం నవంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని తాజా ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

## ఈరోజు బతికిపోయాను దేవుడా అనిపించేది

### అనుపమ పరమేశ్వరన్



అనుపమ పరమేశ్వరన్ నటించిన తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితంలోని కష్టకాలం గురించి మరోసారి మాట్లాడారు. గతంలో వేధింపుల కారణంగా తాను ఎంతగానో కుంగిపోయానని, ఒక దశలో సినిమాలకే స్వస్తి చెప్పాలని భావించినట్లు తెలిపారు. 'అద్దంలో చూసుకున్నప్పుడు నేనేనా అనిపించేది. ప్రతిరోజు భారంగా జీవితాన్ని నెట్టుకొచ్చాను. ఒక్కరోజు కూడా ఆస్వాదించేలా గడవలేదు. నిరంతరం పోరాడాల్సి వచ్చేది.... రోజు ముగిసేసరికి 'ఈరోజు బతికిపోయాను దేవుడా' అనిపించేది. జీవితమే ఓ సవాలుగా మారిపోయింది.

ఆ పరిస్థితుల్లో యాక్టింగ్ కూడా మానేద్దాం అనుకున్నాను. కానీ ధైర్యంగా కొనసాగించా" అని ఆమె తెలిపారు. ఇలాంటి వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా మాట్లాడినప్పుడు విమర్శలు వస్తాయని భావించానని, కానీ చాలా మంది నుంచి తనకు ఎంతో మద్దతు లభించిందని అనుపమ తెలిపారు. "నా అనుభవాలు కొందరిలో అయినా ధైర్యం నింపుతాయి అనుకుంటే.. నేను ఎన్ని విమర్శలకైనా సిద్ధమే" అని ఆమె స్పష్టం చేశారు.



## 'కుంభ'లోని శక్తిని ఇప్పుడే తట్టిలేపాలని అనుకోవడం లేదు

### పృథ్వీరాజ్ బర్త్‌డేపై రాజమౌళి ట్వీట్

టాలీవుడ్ అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి'. సూపర్‌స్టార్ మహేష్‌బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇది సినీ వర్గాల్లో, అభిమానుల్లో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే పృథ్వీ. ఈరోజు నీలోని 'కుంభ'ను తట్టిలేపాలని నేను అనుకోవడం లేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయడానికి తలరాతతో ముడిపడి ఉన్న కుంభ అతడు" అంటూ రాజమౌళి రాసుకొచ్చారు. 'కుంభ' అనేది 'వారణాసి' చిత్రంలో పృథ్వీరాజ్ పోషిస్తున్న పాత్ర పేరు కావడం విశేషం. ఆయన న్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని సమాచారం.

# సారా... దేవకన్యలా!





బాలీవుడ్ యంగ్ బ్యూటీ సారా అలీఖాన్ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో నెటిజన్లను ఇట్టే కట్టిపడేస్తోంది. తాజాగా ఈ భామ పండగ వాతావరణాన్ని తలపించేలా ఎల్లో కలర్ శారీలో దిగిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ట్రెడిషనల్ వేర్‌లో రాజసంతో కూడిన ఆమె రాయల్ లుక్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఈ ఫొటోషూట్ కోసం పింక్, గోల్డ్ అంచులు కలిగిన పసుపు రంగు పట్టు చీరలో ఎంతో అందంగా దేవకన్యలా మెరిసిపోతోంది. బ్లౌజ్ హ్యాండ్స్‌పై ఉన్న నెమలి డిజైన్లు, గ్రాండ్ వర్క్ బ్లౌజ్ ఆమె లుక్‌ను మరింత రిచ్‌గా మార్చేశాయి. చీరకు తగ్గట్టు ఎమరాల్డ్ స్టోన్స్ కలిగిన భారీ హారం, నడుముకి వడ్డాణం, ట్రెడిషనల్ ఆభరణాలు ఆమె లుక్ కు రాయల్ టచ్ ఇచ్చాయి. ఈ అవుట్‌ఫిట్‌లో సారా చూడముచ్చటగా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తూ వాటికి లైకుల వర్షం కురిపిస్తున్నారు.

### ట్రెండింగ్‌లో 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'

## దర్శకుడికి ఖరీదైన బైక్ బహుమతి

సినిమాతోనే కాదు.. మంచి మనసు తోనూ అందరి మనసులు గెలవవచ్చని నిరూపించారు ప్రముఖ నటుడు 'వైవా' హర్ష చెముడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా వెబ్ సిరీస్ 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ వేదికలు ETV Win, Netflixఖులో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ప్రస్తుతం ఈ సిరీస్ ట్రెండింగ్‌లో నిలవడంతో చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన సక్సెస్ మీట్ వేడుకలో దర్శకుడు బాబు డెగాలాపై హర్ష చెముడు తన ప్రేమను, కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు బాబు కోరుకున్న కోరికను గుర్తుంచుకున్న హర్ష.. ఆయనకు అదిరిపోయే రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను గిఫ్ట్‌గా ఇచ్చి సర్ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

